బుధవారం
09 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 291

www.vijayakranthinews.com

విజయక్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



అదే పెద్ద ఛాలెంజ్ 10



ముస్లింలు, గిరిజనుల రిజర్వేషన్ల పెంపుపై

కేంద్రంపై ఒత్తిడి తెండి

- 10% రిజర్వేషన్ బిల్లుకు మద్దతు, సవరణలు కోరండి
- టీఆర్ఎస్ ఎంపీలకు సీఎం కేసీఆర్ ఆదేశాలు

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణలో అమలు చేయతలపెట్టిన ముస్లిమ్స్, గిరిజనులకు రిజర్వేషన్స్ పెంపుకు సంబంధించి పెండింగులు లో ఉన్న శాసన సభ తీర్మానాలను పార్లమెంటులో ప్రవేశపెట్టేవిధం గా కేంద్రం పై ఒత్తిడి తేవాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు పార్టీకి చెందిన పార్లమెంట్ సభ్యులను ఆదేశించారు. అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్స్ కోరుతూ కేంద్రం పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెడుతున్నందున రాష్ట్రానికి చెందిన పెండింగు తీర్మానాలకు ఆమోదం తెలిపే విధం గా కొత్తబిల్లుకు సవరణలు కోరాలని ఆయన సూచించారు. మంగళవారం ముఖ్యమంత్రి ప్రగతిభవన్ నుంచి ఢిల్లీ లో ఉన్న పార్లమెంటుసభ్యులు తో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు.రిజర్వేషన్స్ పెంపునకు సంభందించి కేంద్రం బిల్లు ప్రవేశపెడుతున్నందున చాలా కాలంనుంచి కేంద్రంవద్ద పెండింగులో ఉన్న రిజర్వేషన్స్ అంశాలు పరిష్కారానికి కృషి చెయ్యాలని ఆయన పార్లమెంటు సభ్యులకు సూచించారు. తెలంగాణలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు, ఎస్టీలకు 10శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి (తరువాయి 4లో)

ఈబీసీ బిల్లుకు 323 మంది ఎంపీల మద్దతు

కోటాకు ఆమోదముద్ర

- అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ బిల్లు పాస్
- 124వ రాజ్యాంగ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- నేడు రాజ్యసభకు ఈబీసీ బిల్లు
- సామాజిక సమానత్వం కోసమేనన్న కేంద్ర మంత్రి గెహ్లాట్
- ఈబీసీ బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు
- ఎన్నికల వేళ రాజకీయ జిమ్మిక్కుగా విపక్షాల విమర్శ



న్యూఢిల్లీ: ఈబీసీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం లోక్‌సభలో ఈ బిల్లుపై సుమారు ఐదున్నర గంటలకుపైగా చర్చ జరిగింది. అనంతరం డివిజన్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 323 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 03 ఓట్లు వచ్చాయి. మొత్తం 326 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. అనంతరం ఈ బిల్లు సభ ఆమోదం పొందినట్లు లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ స్పష్టం చేశారు. అగ్రవర్ణాలకు 10 శాతం రిజరేషన కల్పించే 124వ రాజ్యాంగ సవరణ బిల్లు మూడింట రెండో వంతు మెజార్టీతో ఆమోదం పొందడంపై కేంద్ర సామాజిక మంత్రి గెహ్లాట్ హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లుకు మద్దతిచ్చిన సభ్యులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. మరోవైపు ఈబీసీ బిల్లు బుధవారం రాజ్యసభ ముందుకు రానుంది.

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించే దిశగా మరో అడుగు ముందుకేసింది. ఈ 10 శాతం కోటా వల్ల బ్రాహ్మణులు, రాజ్‌పుట్లు, జాట్లు, మరాఠాలు, భూమిహార్లు, వైశ్య, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ వంటి పలు సామాజిక వర్గాలు లబ్ధి పొందనున్నాయి. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలకున్న 49.5% రిజర్వేషన్లకు ఇది అదనం. అంటే రిజర్వేషన్లు 59.5% అవుతాయి. కాగా సుప్రీంకోర్టు విధించిన 50% గరిష్ఠ పరిమితికి అదనంగా ఈ కోటా ప్రతిపాదించడం రాజకీయంగా తీవ్ర చర్చకు తెరలేపింది. దీంతో దీనికి అవసరమైన 124వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లాట్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గెహ్లాట్ మాట్లాడుతూ.. 'వెనుకబడిన వర్గాలైన అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయడానికి చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. రిజర్వేషన్లు కాకుండా వేర్వేరు మార్గాల్లో వారికి ఊరట కలిగించే ప్రయత్నాలు కూడా జరిగాయి. ఆర్థిక స్థోమత లేక, రిజర్వేషన్ల పరిధిలోకి రాక చాలా ఇబ్బందులు పడుతున్నారు. సామాజిక సమానత్వం కోసమే ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్ నినాదాన్ని పరిపూర్ణం చేయడానికే ఈ రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాం. రాజ్యాంగంలోని అధికరణం 15, 16లను సవరణలను ప్రతిపాదించడంతోపాటు 15వ అధికరణకు క్లాజ్ (6) జోడించేందుకే ఈ బిల్లు తీసుకొచ్చాం.' అని వివరించారు. ఇప్పటికే జరిగిన రాజ్యాంగ సవరణలు ప్రభుత్వానికి కొంత వెసులుబాటు కలిగించాయన్నారు. ఆర్థిక వెనుకబాటు అనే అంశాన్ని రాష్ట్రాలు ఎప్పటికప్పుడు నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకున్న తర్వాత ఈ రిజర్వేషన్లు వర్తించవని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు: జైట్లీ

రాజ్యాంగ నిర్మాతల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బిల్లు ద్వారా ప్రయత్నిస్తున్నామని చర్చ సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఈ రాజ్యంగ సవరణ బిల్లుకు రాష్ట్ర అసెంబ్లీల ఆమోదం అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని జైట్లీ సమర్థించారు. దీనివల్ల భారతీయులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఈ వర్గాలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రస్తుతం ఉన్న కోటాను ఏ విధంగానూ కదిలించబోమని ఆయన స్పష్టం చేశారు.'ఈబీసీ రిజర్వేషన్ బిల్లు రాజ్యాంగ సవరణకు ఎలాంటి ఇబ్బంది లేదు. దేశంలోని పేదలకు మేలు చేసేందుకే ఈ బిల్లు తీసుకొచ్చాం. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకే మా ఈ ప్రయత్నం. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని పైకి తీసుకురావాలన్నదే ఈ బిల్లు ఉద్దేశం. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ అన్న అంశాన్ని 15వ అధికరణ క్లాజ్(5) సవరణ సమయంలోనే చేర్చారు. అదే ప్రకారం ఇప్పుడు (తరువాయి 4లో)

అయోధ్య వివాదంపై 10 నుంచి

ప్రత్యేక విచారణ..



ఐదుగురితో కూడిన ధర్మాసనం ఏర్పాటు

ఢిల్లీ: అయోధ్య కేసుపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనాన్ని మంగళవారం ఏర్పాటు చేసింది. వివాదాస్పద రామజన్మభూమి బాబ్రీ మసీదు కేసు విచారణ కొత్త ధర్మాసనానికి కేటాయించాలని సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ ఆధ్వర్యంలోని ఈ ధర్మాసనం జనవరి 10వ తేదీన అయోధ్య కేసుపై విచారణ చేపట్టనుంది. ఈ ధర్మాసనంలోని మరో నలుగురు న్యాయమూర్తులు.. జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే, జస్టిస్ ఎన్‌వి రమణ, జస్టిస్ లలిత్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లు ఉన్నారు. ఈ ధర్మాసనంలోని సభ్యులలో జస్టిస్ ఎన్ వీ రమణ తెలుగువాడు కావడం విశేషం. రామజన్మ భూమి వివాదంపై దాఖలైన ఈ కేసు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అయోధ్యలోని వివాదాస్పద ప్రాంతంలోని 2.77ఎకరాల భూమిని నిర్మోహీ అఖారా, రామ్ లల్లా, సున్నీ వక్ఫ్ బోర్డులకు మూడు భాగాలుగా పంచుతూ 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఇచ్చింది. దీనిపై సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపడుతుంది.

అయోధ్య–బాబ్రీ వివాదమేంటి?

గత యాభైఏళ్లుగా హిందూ, ముస్లింల మధ్య ఘర్షణకు అయోధ్య–బాబ్రీ మసీదు వివాదం కారణమవుతోంది. తమ ఆరాధ్య దైవమైన శ్రీరాముడు జన్మించిన పవిత్రస్థలంలో మందిర నిర్మాణం జరగాలని హిందువులు డిమాండ్ చేస్తున్నారు. 2.77 ఎకరాల స్థలంలో భవ్యంగా మందిర నిర్మాణం జరగాలని కోరుతున్నారు. అయితే బాబర్ మసీదు నిర్మించిన ఈ స్థలం తమకే చెల్లుతుందని రామమందిర నిర్మాణం జరపడానికి వీల్లేదని ముస్లింలు వాదిస్తున్నారు. రామజన్మభూమిలో ఆయన విగ్రహాలు పెట్టి.. అక్కడ పూజలకు అనుమతించాలంటూ 1950లో గోపాల్ సిమ్లా, పరమహంస రామచంద్రదాస్‌లు ఫైజాబాద్ కోర్టును ఆశ్రయించారు. దీనికితోడు 1992, డిసెంబర్ 6న కరసేవకులు బాబ్రీ మసీదులోని కొంత భాగాన్ని ధ్వంసం చేయడంతో దేశవ్యాప్తంగా ఇరువర్గాల మధ్య వివాదం మరింత ముదిరింది. ఆ తర్వాత పురాతత్వ శాస్త్రవేత్తలు చేపట్టిన తవ్వకాల్లోనూ మసీదు కింద రామమందిరానికి సంబంధించిన ఆనవాళ్లు బయటపడ్డాయి. దీంతో రామమందిర నిర్మాణానికి హిందూ సంఘాలు, ఆలయానికి వ్యతిరేకంగా ముస్లింలు పోటాపోటీగా కోర్టులో పిటిషన్లు వేసిన విషయం తెలిసిందే.



పౌరసత్వ సవరణ బిల్లుకు

లోక్‌సభ ఆమోదం

- బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ నుంచి వచ్చే.. ముస్లిమేతర శరణార్థులకు
- భారత పౌరసత్వం కల్పించేందుకు అవకాశం
- బిల్లుపై కాంగ్రెస్, టీఎంసీ అభ్యంతరం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన బిల్లు లోక్‌సభ ఆమోదం పొందింది. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్ఘనిసాన్ నుంచి వచ్చే ముస్లింయేతర శరణార్థులకు భారత పౌరసత్వం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ బిల్లు 2019ను కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ జరిగింది. ఈ బిల్లు వల్ల మతపరమైన మైనారిటీలు హిందువులు, జైనులు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలు కూడా భారత పౌరసత్వం పొందుతారని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. 'పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల్లో (తరువాయి 4లో)

సాయికృష్ణకు అండగా ఉంటాం

- అమెరికాలో దుండగుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన తెలంగాణ విద్యార్థి పరిస్థితి విషమం
- అమెరికాకు వెళ్లేందుకు తల్లి దండ్రులకు అన్ని ఏర్పాట్లు
- ఆర్థిక సహాయం చేయాలని సీఎంవో అధికారులకు కేటీఆర్ ఆదేశం



విజయక్రాంతి, హైదరాబాద్: అమెరికాలో దుండగుల చేతిలో కాల్పులకు గురై చికిత్స పొందుతున్న మహబూబాబాద్ కు చెందిన విద్యార్థి సాయికృష్ణ కు పూర్తి అండగా ఉంటామని తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. సాయికృష్ణ కుటుంబ సభ్యులు ఈరోజు బేగంపేటలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కేటీఆర్ ని కలిసి ప్రభుత్వ సహకారాన్ని కోరారు. సాయికృష్ణ తల్లిదండ్రులు వెంటనే అమెరికాకు వెళ్లేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని ఈ సందర్భంగా కేటీఆర్ వారికి హామీ ఇచ్చారు. తనను కలిసిన సాయికృష్ణ కుటుంబ సభ్యులను సాయి కృష్ణ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సాయి కృష్ణ ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారని అయితే పలు శస్త్ర చికిత్సలు ఆయనకు అవసరమని అక్కడ ఉన్న సాయి కృష్ణ మిత్రులు తమకు తెలియజేశారని తల్లిదండ్రులు కేటీఆర్ కు తెలిపారు. ఇప్పటికే సాయి కృష్ణ కు అవసరమైన తక్షణ వైద్య సహాయం గురించి అమెరికాలోని కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయానికి తమ ఎన్ఆర్ఐ శాఖ అధికారులు సమాచారం అందించారని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. అవసరమైతే మరింత సహకారం కోసం కేంద్ర ప్రభుత్వం విదేశీ వ్యవహారాల శాఖ తరపున సహాయం కోసం విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో మాట్లాడుతామని సాయి కృష్ణ కుటుంబ సభ్యులకు కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్ నేరుగా సుష్మాస్వరాజ్ గారిని కలిసిన్నట్లు కేటీఆర్ తెలిపారు. సాయి కృష్ణ వైద్య సహాయం ప్రస్తుతం ఎలాంటి ఆటంకాలు లేకుండా అందుతుందని, అయితే ఆయనకి భీమా సౌకర్యం లేకపోవడంతో తమకు ఆర్థిక సహాయం అవసరమవుతుందని ఈ సందర్భంగా కేటీఆర్ ను సాయి కృష్ణ కుటుంబ సభ్యులు కోరారు. సాయికృష్ణ కుటుంబ సభ్యులు అమెరికా వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని తక్షణం అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయ స్పెషల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డికి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. సాయి కృష్ణ కుటుంబ సభ్యులు అమెరికా వెళ్లేందుకు అవసరమైన అత్యవసర వీసాలను జారీ చేయాల్సిందిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జర్నల్ కేథరిన్ హెడ్డా తోనూ కేటీఆర్ ఫోన్లో మాట్లాడారు. కుటుంబ సభ్యుల రవాణా ఖర్చులతోపాటు, కొంత ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున తక్షణమే అందిస్తామని హామీ ఇచ్చారు. కష్ట కాలంలో తమ కుటుంబానికి ఆసరాగా నిలబడుతున్న తెలంగాణ ప్రభుత్వానికి సాయి కృష్ణ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

సాయికృష్ణ సౌత్‌ఎల్ఫ్ మిచిగన్‌లోని లారెన్స్ టెక్ యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. ఇటీవలే డెట్రాయిట్ డౌన్టౌన్‌లో (తరువాయి 4లో)

అలోక్ వర్మకు మళ్లీ సీబీఐ బాధ్యతలు

- కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం
- డైరెక్టర్‌ను అలా సెలవుపై పంపడం కుదరదని స్పష్టం
- సీబీఐ అధికారాలను లాగేసుకునే హక్కు ఎవరికీ లేదు
- ఆరోపణలపై కమిటీ విచారణ పూర్తయ్యేంత వరకు.. అలోక్‌వర్మ ఎలాంటి విధానపర నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం
- తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు నియామకాన్ని పక్కన పెట్టిన సర్వోన్నత న్యాయస్థానం



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు షాక్ ఇచ్చింది. సీబీఐ కేసులో కేంద్రం నిర్ణయాన్ని తప్పుబట్టింది. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను సెలవుపై పంపుతూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. ఆయనను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సర్వోన్నత న్యాయ స్థానం ఆదేశించింది. గత ఏడాది సీబీఐ టాప్ ఉన్నతాధికారులు ఒకరిపై మరొకరు అవినీతి ఆరోపణలపై కేసులు నమోదు చేసుకోవడం కలకలం రేపింది. దీంతో సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ, సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానా మధ్య వివాదాలు రచ్చకెక్కాయి. ఈనేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వారిద్దరిని సెలవుపై పంపుతూ గత ఏడాది అక్టోబర్ 23న ఉత్వర్వులు జారీ చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం తనను బలవంతంగా సెలవుపై పంపడాన్ని సవాల్ చేస్తూ అలోక్ వర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీం కోర్టు దీనిపై విచారణ జరిపింది. సీబీఐ వర్సెస్ సీబీఐ కేసులో మంగళవారం తీర్పు వెల్లడించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ సెలవులో ఉండడంతో మరో న్యాయమూర్తి జస్టిస్ కౌల్ తీర్పును చదివి వినిపించారు. అలోక్ వర్మను కేంద్రం సెలవుపై పంపడాన్ని న్యాయస్థానం తప్పు పట్టింది. సీబీఐ అనేది స్వయం ప్రతిపత్తిగల వ్యవస్థ అని, స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఉన్నందున రాజకీయ పక్షాలు జోక్యం చేసుకోకూడదని న్యాయస్థానం తీర్పును వెలువరించింది. సీబీఐ డైరెక్టర్‌ను అలా సెలవుపై పంపడం కుదరదని, ఆయన అధికారాలను లాగేసుకునే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేసింది. అలోక్ వర్మపై చర్యలు తీసుకోవడానికి ముందు కేంద్రం సెలక్ట్ కమిటీని సంప్రదించి ఉండాల్సింది అని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. అలోక్ వర్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ అంశంపై ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తితో కూడిన అత్యున్నత కమిటీ వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. అలోక్ వర్మపై (తరువాయి 4లో)


దిమాక్ ఖరాబ్



పంచాయతీ ఎన్నికల్లో..

6000 మంది అనర్హులు

- ఎన్నికల ఖర్చులు సమర్పించని వైనం
- అనర్హులుగా ఆశావహులు
- పోటీలో భార్యలు, మరదళ్లు, తమ్ముళ్లు
- రిజర్వ్‌డ్ స్థానాల్లోనే అధికం
- తలలు పట్టుకుంటున్న పార్టీలు



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. తొలి విడత నామినేషన్ల గడువు ముగియనున్న నేపథ్యంలో ఆశావహులు తెగ ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం సర్పంచులు, వార్డు మెంబర్లుగా పోటీ చేసిన అభ్యర్థులు చాలా మంది డిస్‌క్వాలిఫై అయ్యారు. ఈ విషయం ఆశావహులకు తెలియకపోవడంతో తీరా నామినేషన్ల సమయంలో చేదు కబురు ఏంటని తెగ ఇబ్బందులు పడుతున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల ఖర్చులను సమర్పించని అభ్యర్థులను పోటీకి అనర్హులుగా ప్రకటిస్తూ వారి జాబితాను అయా మండల పరిషత్ కార్యాలయాల్లో వెల్లడించారు. ఈ జాబితా అయా గ్రామాల్లో ప్రధాన పార్టీల్లో ఉన్న ఆశావహులు ఎక్కువగా ఉండడంతో ఖంగుతిన్నట్లు (తరువాయి 4లో)



సార్వత్రిక సమ్మె పాక్షికం

- నడిచిన బస్సులు, ఆటోలు

విజయక్రాంతి, హైదరాబాద్: రాష్ట్రంలో సార్వత్రిక సమ్మె పాక్షికంగా జరిగింది. కార్మిక చట్టాలను సవరించడం ద్వారా హక్కులకు భంగం కలిగిస్తోందని ఆరోపిస్తూ 10 జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ఆయా సంఘాలకు అనుబంధంగా పని చేస్తున్న కార్మిక సంఘాలు తెలంగాణలో సమ్మెకు పిలుపునిచ్చాయి. అయితే ఇతర కార్మిక స ంఘాలు మద్దతుగా నిలవక పోవడం వల్ల మంగళవారం సమ్మె పాక్షికంగా జరిగింది. ప్రధానంగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ (తరువాయి 4లో)




శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః

శ్రీ విళంబి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
పుష్య మాసం

సూర్యోదయం	: ఉ. 06:48
సూర్యాస్తమయం	: సా. 05:57
పక్షము	: శుక్ల పక్షం
తిథి	: తదియ 14.38
నక్షత్రం	: ధనిష్ట 26:50
యోగం	: సిద్ధి 29:36
కరణం	: గరజ 14:38 తైతుల 28:00
రాహుకాలం	: మ. 12:23, 01:45
యమగండం	: రా. 08:15, 09:37
వర్జ్యం	: లేదు
అమృతకాలం	: మ. 03:04, మ: 04:53





సూక్తి సుధ

సంతోషాన్ని ఎవరి కోసమో ఎందుకోసమో పణంగా పెట్టొద్దు. మీ సంతోషం మీదే. ఆ సంతోషం హాయిగా అనుభవించండి.

– సద్గురు జగ్గీ వాసుదేవ్

తిరుప్పావై పాశురం–25

ఒరిత్తి మగనాయ్ పిఱందు ఊరిరవిల్
ఒరిత్తి మగనాయ్ ఒళుత్తి వళర,
తరక్కిలా నాగిత్తాన్ తీంగునినైంద
కరుత్తైప్పిళైప్పిత్తుకంగన్ వయిట్రిల్
నెరుప్పెన్న నిన్ర నెడుమాలే! యున్నై
అరుత్తిత్తు వందోం, పఱై తరుతియాగిల్
తిరుత్తక్క శెల్వముం శేవగముం యాంపాడి
వరుత్తమ్ముంతీరందుమగిళిందు ఏలో రెంబావాయ్



'శ్రీకృష్ణా! భగవానుడే తనకు కుమారునిగా కావాలని కోరి, శంఖచక్రగదాధారిగా భగవానునే కుమారునిగా పొందగలిగిన సాటిలేని తల్లి దేవకికి కుమారుడవై జన్మించి, శ్రీకృష్ణుని లీలలను పరిపూర్ణంగా అనుభవించి కట్టను కొట్టను భగవానుని వశమొనర్చుకొనిన, అద్వితీయ వైభవం కల యశోదకు ఆ రాత్రియే కుమారుడవై దాగి పెరిగినవాడా! ఈ వృత్తాంతాన్ని నారదుని వల్ల విని కంసుడు రాబోవు అనర్థం ఎరుంగక సహించలేనివాడై ఏదో విధంగా నిన్ను చంపాలనే చెడుభావంతో ఉన్న కంసుని అభిప్రాయాన్ని వ్యర్థపుచ్చి, వాని కడుపులో చిచ్చుగా నిలిచి, నిన్ను చంపవలెనన్న వానిని నీవే చంపిన ఆశ్రిత వ్యామోహశాలీ! నిన్నే కోరి వచ్చితిమి. మా సంకల్పం నెరవేర్చదలచినచో శ్రీలక్ష్మీదేవి ఆశపడదగిన సంపదను, ఆ సంపదను సార్థకపరచగల నీ పరాక్రమాన్ని ఆనందపరవశులమై పాడి, అలసట తీరి ఆనందించునట్లు అనుగ్రహించు.'

శ్రీకృష్ణునకు ఇద్దరు తల్లులుండునట్లు మనకు కూడా ప్రధానమైన మంత్రాలు రెండు. 'నారాయణాష్టాక్షరీ', 'వాసుదేవ ద్వాదశాక్షరి'. ఇందు నారాయణాష్టాక్షరిలో నారాయణ తత్త్వం స్పష్టంగా ప్రకాశించును. వాసుదేవ శబ్దంలో సర్వవ్యాపకత్వం గూఢంగా ఉంది. కావున దేవకి అనగా నారాయణాష్టాక్షరి యశోద అనగా వాసుదేవ ద్వాదశాక్షరి.

ఒకటి గాయత్రి మంత్రం. ఇంకొకటి నారాయణాష్టాక్షరి అని కూడా మంత్రం కలదు. అప్పుడు గాయత్రిలో అనగా సూర్యమండలాన శ్రీమన్నారాయణుడు శంఖచక్రధారియై ప్రత్యక్షంగా కనపడును కావున దేవకీదేవి గాయత్రీ మంత్రమని, నారాయణ శబ్దంలో 'నార' 'అయిన' శబ్దార్థాలు తెలిసినవే బోధపడును. కాన నారాయణాష్టాక్షరి యశోదయని తెలియవలయును.

ఇక్కడ కంసుడనగా అహంకారం. అహంకారం తనకంటే ఇంకొక పరమాత్మ ఉన్నాడని విని సహించలేదు. అంతేకాదు శరీరం కంటే విడిగా ఆత్మ ఉన్నదని కూడా అంగీకరించని దేహాత్మాభిమానమే అహంకారం. ఈ అహంకారంను భగవంతుడే పోగొట్టాలి. దానిలో తాను చేరును అది కూడా అగ్నివలె. అనగా అహం ధ్వంసమై దాసోహం అగును. ఇదియే నిప్పులా నిలుచుట.



– డా|| బాలుశర్మ పన్నాల (వేద పండితులు)

లాభనష్టాల్లో గోప్యత అవసరం

చాణక్యం

శ్లో|| అర్థనాశం మనస్తాపం గృహే దుశ్చరితాని చ।
వంచనం చావమానంచ మతిమాన్న ప్రకాశయేత్||

ధనం పోయినా, మనస్సునకు దుఃఖం కలిగినా, ఇంటిలో దోషాలున్నా, ఇతరులచే మోసపోయినా లేక ఇతరులతో అవమానం పొందినా కూడా బుద్ధిమంతుడైన వాడు చెప్పుకొనకూడదు అని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేస్తున్నారు. పైన తెలియచేసిన అంశాలను ఇతరులకు చెప్పినచో ఎగతాళి చేస్తారే గాని సానుభూతిని చూపరు. ఇవి సొంత విషయాలు కావున వీటిని ఎంత దాచుకుంటే అంత మంచిదంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరాయివాళ్లకు చెప్పరాదంటున్నారు. ఏదేనా వ్యాపారంలో నష్టం వచ్చినప్పుడు, అనుకోకుండా దొంగతనం, మరే ఇతర కారణాల వల్ల నష్టపోయినప్పుడు కూడా ఇతరులతో చెప్పకూడదంటున్నారు. ఇతరులతో చెప్పిన యెడల వారు మన కష్టాల్లో పాలు పంచుకోకుండా సూటి పోటి మాటలతో బాధిస్తారు. అంత అసమర్థుడైన వాడివి వ్యాపారం ఎందుకు చేశావు. ఆ వ్యాపారం గురించి సరిగా తెలుసుకోకుండా ఎందుకు మొదలుపెట్టావు అన్న అవమానకరమైన మాటలతో వేధిస్తారు తప్ప మనల్ని ఏమాత్రం పట్టించుకోరు. కాబట్టి ఇలా అంటారని ముందే ఊహించి కష్ట నష్టాల గురించి ఇతరులతో చెప్పకూడదంటున్నారు. మన బాగు కోరే వారి దగ్గర, స్నేహితుల దగ్గర, మన క్షేమాన్ని కాంక్షించే బంధువుల వద్ద మన కష్ట, నష్టాలు చెప్పుకుంటే మంచిది. ఇతరులతో చెప్పుకుంటే వారు ఫలానా వారు నష్టపోయారని సమాజంలో కూడా ప్రచారం చేస్తారు. దానివల్ల ఆ నష్టాల్లోంచి బయటకు వద్దామనుకున్నా మరింత కష్టాల పాలవుతామే తప్ప వారి నుంచి ఏమాత్రం సహాయ సహకారాలు అందవు. అందువల్ల మనకు లాభం జరిగినా, నష్టం జరిగిన రహస్యంగా ఉంచాలంటున్నారు.



– యామిజాల సుబ్రహ్మణ్యం

విశాజీ రఘునాథ లేలే (జనన – శక. 1749)

వేద విజ్ఞానం

భాగం-74

మన దేశంలో జన్మించి అత్యంత ప్రతిభ, నేర్పుగల ఖగోళ శాస్త్రవేత్తలలో ప్రముఖుడు నాసిక్‌కు చెందిన లేలే ఒకడు. ఇతను శక.1749లో (క్రీ.శ 1827) శ్రావణ బహుళ దశమినాడు మకర లగ్నంనందు జన్మించాడు. ఇతను చిత్‌పావన్ బ్రాహ్మణుడు, హిరణ్యకేశి, శాఖ, కాశ్యపగోత్రికులు. లేలేకు 11 సం||లు వచ్చేవరకు నాసిక్‌లో తన మేనమామ వద్ద మరాఠిభాషలోనే విద్యాభ్యాసం చేశాడు. అందులో భిన్నాల వరకు అంక గణితాన్ని, కొంత వరకు సంస్కృతాన్ని నేర్చుకున్నాడు. ఇంత మాత్రమే ఇతను గురుముఖతః నేర్చుకొనినది. కాని ఇతను దీక్ష, శ్రద్ధలతో విద్యాభ్యాసాన్ని కొనసాగించి, తన మేధస్సుతో, ఇంగ్లీషులో విద్యనభ్యసించిన విశ్వవిద్యాలయ విద్యార్థులకు సాధ్యంకాని క్లిష్టమైన గణిత సమస్యలను కూడా పరిష్కరించే కౌశల్యాన్ని సాధించచేడు.

కొన్ని సంవత్సరాలు సాధారణ ఉద్యోగంతో కాలం గడిపినా, శక.1782లో గ్వాలియర్ వెళ్ళాడు. అక్కడ సింధియా ప్రభుత్వంలో ఆదాయశాఖలోను, జమాఖర్చుల శాఖలోను ఉద్యోగాన్ని సంపాదించుకున్నాడు. ఈయన చేతివ్రాత, చెప్పేవిధానం అద్భుతంగా ఉండేది. అలాగే దేశపటాలు గీయడంలో ప్రతిభ చూపించేవాడు. పద్దులలో ఒక తప్పుకూడా లేకుండా అతను ఉద్యోగం చేశాడు. ఈ విధంగా 33 సంవత్సరాలు పనిచేసి శక. 1816లో పదవీ విరమణ చేసి, తమ 69వ సంవత్సరంలో అంటే శక.1817 కార్తీక బహుళ షష్ఠి నాడు పరమవదించాడు.


(లేలేతో ఈ రచయిత (దీక్షిత్)కు లేఖల ద్వారా పరిచయం అయ్యింది. ఆయనతో గల పరిచయంతో ఈ వివరాలు తెలియచేస్తున్నాడు. ఇతని జీవిత చరిత్ర క్రీ.శ. 1888 అక్టోబర్ బాల బోధ్‌లో ముద్రించబడింది.)

సాయన పంచాంగాలు

చాలా మంది పంచాంగాలు సాయనపద్ధతిలో ఉండాలని భావిస్తారు. దీనిని అనేక మంది మనస్సులో భావించినా నిజంగా భావించింది లేలే మాత్రమే. లేలే మనస్సులో కేవలం సాయన పంచాంగం మాత్రమే మతపరమైన పరీక్షలకు తట్టుకుంటుందని భావించేవాడు. కొంతకాలం గ్రహలాఘవ సహాయంతోను తర్వాత కాలంలో నాటికల్ ఆల్మనాక్ సహాయంతోను నిత్య జీవితంలో వినియోగానికి సాయన పంచాంగాన్ని సంకలనం చేసేవాడు. అయితే దీనిని ముద్రించే అవకాశం చాలా సంవత్సరాల వరకు లభించలేదు. కొంతకాలానికి ఆంగ్లభాషలో పట్టు సంపాదించి, దాని సహాయంతో నాటికల్ ఆల్మనాక్‌ను వినియోగించి పంచాంగ సాధనలో జ్ఞానాన్ని సంపాదించాడు. శక.1787లో కేరోపంత్ ఖచ్చితమైన నిర్ణయ పంచాంగ ముద్రణ ప్రారంభించాడు. అక్కడ నుండి కేరోపంత్‌ను సాయన పద్ధతిలోకి మార్చే ప్రయత్నంలో ఇద్దరికి వివాదాలు ప్రారంభమయ్యాయి. లేలే "స్ఫుటవక్త అభియోగి" అంటే నిష్పాక్షికమైన యోధుడు, అనే కలం పేరుతో పత్రికలలో వాద ప్రతివాదాలు జరిపారు. కేరోపంత్, లేలే అభిప్రాయాలను అంగీకరించలేదు. కేరోపంత్, సాయన పద్ధతిలో పంచాంగాలు చేయడానికి ఆసక్తి చూపకపోవడంతో, శక.1806 నుండి లేలే ఇతరుల సహాయంతో, ఆచార వ్యవహారాలకు అనుగుణంగా ఉండే విధంగా, సాయన పంచాంగాన్ని ముద్రించడం ప్రారంభించాడు. వివరాలను పంచాంగాలు అనే చోట విపులంగా అందించడం జరుగుతుంది.

లేలే సాయన పంచాంగం కాకుండా మరే గ్రంథాన్ని సంకలనం చేయలేదు. అందుచే దీనికి ప్రాచుర్యం కలిగించడానికి మిగిలిన అంశాలపైన ఆధారపడవలసి వచ్చింది.

–డా|| రేమెళ్ల అవధానులు



కర్ణుడి క్షుద్బాధ



కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. యుద్ధంలో మరణించిన వీరులందరూ వారి వారి పాపపుణ్యాల ఆధారంగా స్వర్గ నరకాలకు చేరుకున్నారు. వారిలో అత్యంత దానశీలిగా పేరు పొందిన కర్ణుడు స్వర్గలోకానికి వెళుతుండగా మార్గమధ్యంలో ఆకలిగా, దప్పికగా అనిపించింది. సమీపంలో ఉన్న కొలనులోని నీటిని దోసిలిలోకి తీసుకుని నోటిముందుకు చేర్చుకుని ఆత్రంగా తాగబోయాడు. చిత్రంగా ఆ నీరు కాస్తా బంగారు ద్రవంగా మారి, తాగడానికి పనికిరాకుండా పోయింది. ప్రయత్నించిన ప్రతిసారీ అంతే అయింది. ఈలోగా విపరీతమైన ఆకలి వేయడంతో కంటికి ఎదురుగా ఉన్న ఓ ఫలవృక్షాన్ని సమీపించి, చేతికి అందేంత దూరంలో ఉన్న ఓ పండును కోశాడు.

మధురమైన వాసనలతో ఉన్న ఆ పండు ఆయన క్షుద్బాధను ఇనుమడింప జేయడంతో వెంటనే పండు కొరికాడు. పండు కాస్తా పంటికింద రాయిలా తగిలి నొప్పి కలిగింది. మరో పండు కోశాడు. మళ్ళీ అదే అనుభవం ఎదురయింది. ఏది తిన్నా, ఏది తాగబోయినా మొత్తం బంగారుమయంగా మారిపోతున్నాయి తప్పితే ఆకలి, దాహం తీరడం లేదు. దాంతో కర్ణుడు తన ఆకలి దప్పులు తీరే మార్గం లేక నిరాశా నిస్పృహలతో ఒక చోట కూలబడిపోయాడు. అప్పుడు "కర్ణా! నీవు దానశీలిగా పేరొందావు. చేతికి ఎముక లేకుండా దానాలు చేశావు. అయితే బంగారం, వెండి, ధనం రూపేణా చేశావు గానీ కనీసం ఒక్కరికి కూడా అన్నం పెట్టి వారి ఆకలి తీర్చలేదు. అందువల్లే నీకీ పరిస్థితి ఏర్పడింది" అని అశరీరవాణి పలికింది.

అప్పుడు గుర్తుకొచ్చింది కర్ణుడికి ఒక సందర్భంలో ఒక పేద బ్రాహ్మడు తనను ఆకలితో కడుపు నకనకలాడిపోతోంది మహారాజా! ముందు నాకింత అన్నం పెట్టించండి మహాప్రభో అని నోరు తెరిచి అడిగాడు కూడా! అయితే అపార ధనవంతుడను, అంగరాజ్యాధిపతిని అయిన నేను పేదసాదలకు అన్నం పెట్టి పంపితే, వారు నన్ను చులకనగా చూస్తారేమో, ఆ విషయం నలుగురికీ తెలిస్తే నవ్వుకుంటారేమో అని అహంకరించి, సేవకులతో సంచీడు బంగారు నాణేలను తెప్పించి, అతని వీపుమీద పెట్టించడంతో, ఆ బరువును మోయలేక అతను అక్కడే చతికిలబడటం, తాను తిరస్కారంగా చూసి, భటుల చేత గెంటించడం గుర్తుకొచ్చింది.

బంగారం, వెండి, ధనం, వజ్రవైఢూర్యాలను దానం చేయడమే గొప్ప. వాటిని దానం చేయబట్టే కదా తనకు దానకర్ణుడనే పేరొచ్చింది... అన్నం మెతుకులంటే ఎవరైనా పెడతారు, ఇక తన గొప్పేముంది అని ఆలోచించాడు కానీ, ఆకలన్నవాడికి ముందు అన్నం పెట్టి కడుపు నింపడం కనీస బాధ్యత అని గుర్తించలేదు. దాని పర్యవసానం ఇంత తీవ్రంగా ఉంటుందనుకోలేదు... బతికి ఉండగా చేయలేని అన్నదాన కార్యక్రమాన్ని ఇప్పుడు ఎలా అమలు పరచగలడు? కర్తవ్యం ఏమిటి? అని ఆలోచించగా తన తండ్రి అయిన సూర్యదేవుడు గుర్తుకొచ్చాడు.

సూర్యుని వద్దకెళ్లి జరిగిన విషయమంతా వివరించి పరిపరి విధాల ప్రాధేయపడ్డాడు. సూర్యుడు తమ రాజైన మహేంద్రునికి విన్నవించాడు. చివరకు దేవతలంతా కలసి ఆలోచించుకుని కర్ణుడికి ఒక అపురూపమైన అవకాశమిచ్చారు. అదేమంటే, సశరీరంగా భూలోకానికెళ్లి అక్కడ ఆర్తులందరికీ అన్న సంతర్పణ చేసి తిరిగి రమ్మన్నారు. దాంతో కర్ణుడు భూలోకానికి వెళ్లి, అన్న సంతర్పణ చేశాడు. పితరులకు తర్పణలు వదిలి తిరిగి స్వర్గానికెళ్లాడు.

ఎప్పుడైతే అన్నసమారాధనతో అందరి కడుపులూ నింపాడో అప్పుడే కర్ణుడికి కూడా కడుపు నిండిపోయింది. ఆకలి, దప్పిక ఆయనను ఎన్నడూ బాధించలేదు.

ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టి కడుపు నింపాలి కానీ డబ్బు, బంగారం దానం చేస్తే ప్రయోజనం ఏముంటుంది? అన్నం పెట్టి, ఆకలి తీర్చినవారిని అన్నదాతా సుఖీభవ అని నిండు మనసుతో ఆశీర్వదిస్తారు. పితృదేవతల పేరిట ఆలయాలలో అన్నదానం చేయించడం వల్ల పేదల కడుపు నిండుతుంది, పితృలోకంలో ఉన్నవారికి ఆత్మశాంతి కలుగుతుంది.

పరాత్పర రూపం

ఈ మధ్యాహ్నం కొందరాంధ్రులు స్త్రీలతో సహా వచ్చి భగవత్సన్నిధితో కొంతసేపుండి వెళ్ళారు. వారిలో ఒక పురుషుడు లేచి చేతులు జోడించి "స్వామీ, మేము రామేశ్వరాది యాత్రలు చేసుకొని, అక్కడ ఉండే దేవతలని సేవించి వచ్చాం. పరాత్పర స్వరూప మెటువంటిదో తమ వల్ల తెలుసుకోవాలని ఉన్నది. దయ ఉంచి తెలుపగోర ప్రార్థిస్తున్నాను" అన్నాడు.


భగవాన్ చిరునవ్వుతో "అట్లాగా, అదే మీరు చెపుతున్నారు గదా. అన్ని దేవతలను సేవించి వచ్చామని, అన్నీ తానైనప్పటికీ, ఈ అన్నిటికీ అతీతంగా ఉండేదేదో అదే పరాత్పర రూపం. అన్నిటికీ అతీతమన్నమాట. మీరా దేవాలయాలన్నీ చూడటం వల్ల ఇన్ని దేవుళ్ళకు మూలమైన పరాత్పర స్వరూపం ఎటువంటిదోనన్న యోచన తట్టింది. అవన్నీ చూడకుంటే ఈ ప్రశ్న వస్తుందా?"అన్నారు. అప్పుడు శ్రీవారి ముఖ వికాసం చూస్తే పరాత్పర రూపం తాండవమాడుతూ ఉన్నదన్నమాట. ఆ కళ్లలో తేజస్సు, ఆ మందహాసం చూచి తీరాలి. ఆ యువకుడికా మాటలు అర్థంకాకపోయినా శ్రీవారి కృపా వీక్షణంతోటే సంతృప్తి చెంది, సహచరులతో సహా నమస్కరించి వెళ్లిపోయాడు.

వారటు పోగానే భగవాన్ ఉత్సాహపూరితులై సమీప వర్తియగు ఒక భక్తునితో "ఇదిగో చూడు. వారి మాటల్లోనే యథార్థం తెలుస్తుంది. పరాత్పర రూపం అంటే పరమునకు పరమైనదేదో అదే యథార్థమని దాని కర్థం. అడిగే మాటకే అర్థం తెలియదు. అర్థం తెలిస్తే జవాబు కూడా దానిలోనే ఉంటుంది" అన్నారు..

– సూరి నాగమ్మ
(శ్రీరమణాశ్రమ లేఖలు)


ధర్మ సందేహాలకు సమాధానాలు

సాధనా చతుష్టయ మంటే ఏమిటి?



- **నిత్యానిత్యవసు వివేకం:** మాయా స్వరూపమైన ప్రపంచం అశాశ్వతమని, అఖండమై, నిర్మలమై, నిర్గుణమైన పరమాత్మ మాత్రమే శాశ్వతమని తెలుసుకోవడమే నిత్యానిత్య వస్తువివేకము.
- **ఇహాముత్రార్థ ఫల భోగ విరాగం:** ఈ లోకంలో ధనంచేత అనుభవించే ఇండ్లు, వాహనాలు, తోటలు, ఆహారాదులు, స్త్రీలపట్ల, పరలోకంలో స్వర్గ, సత్య, వైకుంఠ, కైలాసాది లోకాల్లో కలిగే సాలోక్య, సామీప్య, సారూప్య, సాయుజ్యాదులనే పదవులపట్ల గల భోగంపై విరక్తి కలిగియుండటం.
- **శమాదిషట్క సంపద:** శమము, దమము, ఉపరతి, తితీక్ష, శ్రద్ధ, సమాధానం అనే ఆరింటిని 'శమాదిషట్క సంపద' అంటారు. ఇవి మానవుడు మోక్షమార్గం వైపు వెళ్ళే సాధనకు మెట్లవంటివి. శమము అనగా – అంతరేంద్రియ నిగ్రహం, దమము అనగా – బాహ్యేంద్రియ నిగ్రహం, ఉపరతి అంటే – విహితకర్మలను జ్ఞాన విధిచే క్రమంగా వదిలి పెట్టడం, తితీక్ష అనగా – శీతోష్ణ, సుఖదుఃఖాలయందు సమబుద్ధి కల్గియుండుట. శ్రద్ధ అనగా గురువు బోధించిన భగవన్మార్గమునందు విశ్వాసము కలిగి శ్రద్ధ వహించుట, సమాధానము అనగా గురువులుపదేశించిన మహావాక్యాలను శాస్త్రాల్లో చూసి మనస్సంతృప్తిని పొందడం.
- **మోక్షాసక్తి:** మోక్షమే పరమలక్ష్యమని మోక్షం పట్ల ఆసక్తిని కలిగియుండటం.

సత్, చిత్‌లు అనగానేమి?



భూత, భవిష్యత్, వర్తమాన కాలాలందు మార్పు పొందకుండా ఒక్క రూపంలో ఉండేది 'సత్(సత్తు). పని జరిగిన తర్వాత కోరికలు లేకుండా మనం చూసే అన్ని వస్తువుల్లో వెలిగేదాన్ని 'చిత్'(చిత్తు) అంటారు. శాశ్వతత్వం కలిగి ఉండి, సాటిలేనిదైన సంతోషాన్ని 'ఆనందం' అంటారు. ఈ శాశ్వతానందమే సత్, చిత్ లతో కలిసి 'సదానందం', చిదానందంగా చెప్పబడింది.
(సత్తు=జీవుడు, చిత్తు=ప్రకృతి, ఆనందం=ఈశ్వరుడు)

ఈ షణ త్రయాలేవి?

ఈషణ అంటే కోరిక అని అర్థం.


- **ధనేషణ:** తాను చేసే ప్రతిపనిలో ధనకాంక్షను కలిగి ఉండటమే ధనేషణ.
- **దారేషణ:** కామం వల్ల భార్యపట్ల అమితాసక్తి కలిగి ఉండటమే దారేషణ.
- **పుత్రేషణ:** పుత్రసంతానం వల్ల స్వర్గాదిగతులు, ఇహలోక సుఖాలు కలుగుతాయని భావించి, పుత్ర సంతానం కలిగి ఉండటమే గొప్ప అనుకొని భావించటమే 'పుత్రేషణ' అంటారు.

పురాణ క్విజ్

తెలిసినవేంటో తేల్చుకోండి!
తెలియనివన్నీ తెలుసుకోండి..

1. పరీక్షిత్తుకు మరో పేరు?
2. తిరుమల్లో పాండవ తీర్థానికి ఆ పేరు ఎందుకు వచ్చింది?
3. యక్షులు ఎవరి భక్తులు?
4. విశ్వరూపుడు ఎవరి కుమారుడు?
5. తాటకి పుత్రుల పేర్లు?
6. పాండవ తీర్థానికి మరో పేరు?
7. తాటకి ఎవరి భార్య?
8. బ్రహ్మ మనసు నుండి పుట్టిన నది?
9. అనిరుద్ధుని పుత్రుడు?
10. విదురుడు పూర్వజన్మలో ఎవరు?





చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు
కొంచెమైన నదియుఁకొదువకాదు
విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత
విశ్వదాభిరామ వినురవేమ.

భావం: మనసు పెట్టి చేస్తే ఏ చిన్న పనైనా సత్ఫలితాలనిస్తుంది. మనసు దానిమీద లేకపోతే అది ఫలించదు. మర్రిచెట్టు విత్తనం ఎంతో చిన్నది అయినా ఎంతో పెద్ద చెట్టయి విస్తరిస్తుంది. దీపం చిన్నదైనా ఎంతో వెలుగునిస్తుంది. కాబట్టి ఏ పనైనా మనసారా చేయమని భావం.

మన జీవితం

వికాసమే విజయం

- మన బలహీనతల్ని మనం ఎప్పుడైతే తెలుసుకుటామో అప్పటి నుండి, మన బలం పెరుగుతుంది.
- మన లోపాలను ప్రేమిస్తున్నప్పటి నుండి, మన అందం పెరుగుతుంది.
- నిజానికి, భ్రమకి మధ్య తేడా కనుగొన్నప్పటి నుండి, ధైర్యం పెరుగుతుంది.
- తప్పుల నుండి నేర్చుకునే పాఠంతో తెలివి పెరుగుతుంది.
- ద్వేషాన్ని ఎదుర్కొన్నప్పటి నుండి మనలోని ప్రేమ పెరుగుతుంది.
- దుఃఖాన్ని అనుభవించినప్పటి నుండి, మనలోని ఆనందం పెరుగుతుంది.
- బాధలు అనుభవించినప్పటి నుండి, ఇతరుల ఇబ్బందుల పట్ల సానుభూతి పెరిగింది.
- అయినా మనకి తెలుసు, మనమెంతో ఎదగాల్సి ఉందని!

జీవితం అంటే యాభై శాతం.. మనకు ఎదురయ్యే సంఘటనలు, వాటికి మన స్పందన యాభై శాతం. కానీ ఇతరుల ప్రతిస్పందనకు అతిగా చింతించడంతోనే అసలు కష్టం ఆరంభం అవుతుంది.

ప్రవచనం

– డా॥ శ్రీ చాగంటి కోటేశ్వర రావు



పూర్వకాలంలో కోసల దేశం అనే గొప్ప రాజ్యం ఉండేది. ఆ దేశ రాజధాని అయిన అయోధ్యని, మనువు తన సంకల్ప బలంతో నిర్మించాడు. ఆ నగరం 12 యోజనాల పొడువు, 3 యోజనాల వెడల్పు ఉండేది(యోజనం అంటె = 9 మైళ్ళు). ఆ నగరం మధ్యలో రాజ ప్రాసాదంలో దశరథ మహారాజు నివాసముండేవారు. ఆ నగరంలో రహదారులన్నీ విశాలంగా, ఎప్పుడూ సుగంధ ధూపాలతో ఉండేవి. ధాన్యం, చెరుకు లాంటి పంటలన్నీ, బాగా పండేవి ఆ రాజ్యంలో. ఏ ఇంట్లోను కూడా అనవసరంగా ఉన్న నేల లేదు. అయోధ్య నగరంలో అందరూ చాలా సంతోషంగా ఉండేవాళ్ళు, అందరూ ధర్మం తెలిసిన వాళ్ళే, ఎవడికి ఉన్న దానితో వాడు తృప్తిగా ఉండేవాళ్ళు, అందరూ దానం చేసేవాళ్ళు, సత్యమే పలికేవాళ్ళు, అందరూ ఐశ్వర్యవంతులే, ఆవులు, గుఱ్ఱాలు, ఏనుగులతో ఆ నగరం శోభిల్లేది. చెవులకి కుండలాలు లేనివాడు, కిరీటం లేనివాడు, మెడలో పూలహారం లేనివాడు, హస్తములకు ఆభరణాలు లేనివాడు, దొంగతనం చేసేవాడు, నాస్తికుడైనవాడు ఆ అయోధ్య నగరంలో లేడు.

దశరథ మహారాజుకి, 8 ప్రధాన మంత్రులు, ఎప్పుడూ సహాయం చేసేవారు, వాళ్ళు, దృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలకుడు, సుమంత్రుడు. వశిష్ఠుడు, వామదేవుడు ఎల్లప్పుడూ దశరథ మహారాజుకి, సలహాలు ఇచ్చే ఋత్విక్కులు. ఇతరమైన బ్రాహ్మణులూ, మంత్రులు కూడా ఉండేవారు. ఆ మంత్రులు, అపారమైన విద్య కలిగిన వాళ్ళు, పని చెయ్యడం తెలిసినవాళ్ళు, ఇంద్రియాలను నిగ్రహించినవాళ్ళు, శ్రీమంతులు, శాస్త్రం తెలిసిన వాళ్ళు, సావధాన చిత్తం కలిగినవాళ్ళు. ఆ కోసల దేశంలో పరభార్య మీద వ్యామోహం ఉన్న వ్యక్తి ఒక్కడు కూడా లేడు.

ఇన్ని ఉన్నా ఆ దశరథ మహారాజుకి ఒక బాధ ఉండేది. వంశోద్ధారకుడైన పుత్రుడు లేడనే బాధ ఉండేది. ఆయనకి అప్పటికి 60,000 సంవత్సరాలు నిండిపోయాయి. ఆయనకి అశ్వమేధ యాగం చెయ్యాలనే ఆలోచన వచ్చి, వెంటనే సుమంతుడిని పిలిచి, ఋత్విక్కులైన వశిష్ఠుడు, వామదేవుడు, ఇతర పురోహితులని పిలవమని చెప్పాడు. అందరికీ తన ఆలోచన చెప్పాడు. అందరూ సరే అన్నారు. అశ్వమేధ యాగానికి కావాల్సిన సంభారాలన్నీ తెప్పించి, సరయు నదికి ఉత్తర తీరంలో యాగమంటపం నిర్మించారు.

దశరథ మహారాజు దక్షిణ నాయకుడు, ఆయనకి 300కి పైగా భార్యలున్నారు. కాని పత్నులు మాత్రం కౌసల్య, సుమిత్ర, కైకేయి. తను యాగం మొదలపెడుతున్నాడు కాబట్టి, తన పత్నులని దీక్ష స్వీకరించమన్నాడు. అంతఃపురంలోకి వెళుతున్న దశరథ మహారాజుతో సుమంత్రుడు ఇలా అన్నాడు..

సనత్కుమారో భగవాన్ పూర్వం కథితవాన్ కథాం।
ఋషీణాం సన్నిధౌ రాజన్ తవ పుత్రాగమం ప్రతి॥

పూర్వకాలంలో ఒకసారి సనత్కుమారుడు, ఋషులకు ఇలా చెప్పాడు...........

ఇక్ష్వాకువంశంలో జన్మించిన దశరథ మహారాజుకి కుమారులు లేక, అశ్వమేథ యాగం చేస్తాడు. ఆ యాగం వల్ల, ఆయనకి నలుగురు కుమారులు కలుగుతారు. కాని అశ్వమేథ యాగంతో పాటు, పుత్రకామేష్టి యాగం కూడా చెయ్యాలి. ఈ రెండు యాగాలని చెయ్యగలిగినవాడు, ఋష్యశృంగుడు. ఆయన ఆ యాగాలని చేస్తేనే, బిడ్డలు పుడతారని, సనత్కుమారుడు చెప్తుంటే విన్నాను , అని సుమంతుడు దశరథ మహారాజుతో అన్నాడు. ఆ ఋష్యశృంగుడు పక్కనే ఉన్న అంగదేశంలో ఉన్నాడు, కాబట్టి మీరు వెళ్లి ఆయనని తీసుకొని రండి అన్నాడు.

అప్పుడు దశరథ మహారాజు, నాకు ఆ ఋష్యశృంగుడు గురించి వివరంగా చెప్పు అంటే, సుమంతుడు ఇలా చెప్పసాగాడు

పుత్రకామేష్టి

............పూర్వకాలంలో విభణ్డక మహర్షి చాలాకాలం తపస్సు చేసి స్నానం చెయ్యడానికి ఒక సరస్సు దగ్గరికి వెళ్ళగా, అక్కడ అలా వెళుతున్న ఊర్వశిని చూసేసరికి, ఆయన రేతస్థానం నుంచి కదిలిన వీర్యం, సరోవరంలో పడింది. ఆ వీర్యాన్ని ఒక జింక తాగి, గర్భం దాల్చి, శిరస్సు మీద కొమ్ము ఉన్న ఒక పిల్లవాడికి జన్మనిచ్చింది. అలా శిరస్సు మీద కొమ్ముతో పుట్టాడు కాబట్టి ఆయనకి ఋష్యశృంగుడు అని పేరు పెట్టారు. ఆ విభణ్డక మహర్షి, ఋష్యశృంగుడికి, సమస్త వేదాలు, శాస్త్రాలు, యజ్ఞయాగాదులు.. అన్నీ చెప్పాడు. కాని ఆ ఋష్యశృంగుడికి లోకం తెలీకుండా పెంచాడు, ఆయనకి అసలు ఈ సృష్టిలో స్త్రీపురుషులని ఇద్దరు ఉంటారని కూడా తెలీకుండా పెంచాడు. అంటే విషయసుఖాల వైపు వెళ్ళకుండా పెంచాడు. ఎప్పుడూ ఆ ఆశ్రమంలోనే, తండ్రి పక్కనే ఉండేవాడు. ఆ అంగరాజ్యాన్ని పరిపాలించే రోమపాదుడు, ధర్మం తప్పడం వల్ల, ఆ రాజ్యంలో వర్షాలు పడడం మానేశాయి. దేశంలో క్షామం వచ్చింది. ఋష్యశృంగుడు కాని మన దేశంలో అడుగుపెడితే, వర్షాలు తప్పక కురుస్తాయని, కొందరు మహర్షులు అన్నారు.

వెంటనే రాజు మంత్రుల్ని పిలిచి విషయం చెప్తే, 'ఋష్యశృంగుడిని తీసుకురావడం మావల్ల కాదు, ఏమి కోరికలు లేని వాడు, మన రాజ్యానికి ఎందుకు వస్తాడు?' అన్నారు. ఎంతైనా మంత్రులు కనుక ఒక మాట అన్నారు.....

ఇంద్రియార్థైః అభిమతైః నరచిత్త ప్రమాథిభి।

ఋష్యశృంగుడికి కుడా ఇంద్రియాలు, మనస్సు ఉంటాయి. వాటికి ఇప్పటిదాకా రుచి తగలక, విషయసుఖాల వైపుకి రాలేదు. కాబట్టి అందంగా అలంకరించుకున్న కొంతమంది వేశ్యలని పంపిస్తే, విభణ్డకుడు లేని సమయంలో, వీళ్ళు ఆ రుష్యశృంగుడి మనస్సుని ఆకర్షించి, ప్రలోభపెడతారు. అప్పుడు ఆయనే వాళ్ళ వెంట వస్తాడు, అని మంత్రులు సలహా ఇచ్చారు.

ఆ వేశ్యలకి విభణ్డకుడి మీద ఉన్న భయం వల్ల, వాళ్ళు ఆశ్రమానికి దూరంగా ఉండి పాటలు పాడడం, నాట్యం చెయ్యడం మొదలుపెట్టారు. ఒకరోజు విభణ్డకుడు లేని సమయంలో గానం విన్న ఋష్యశృంగుడు, ఆ గానం వస్తున్న వైపు వెళ్ళాడు. అక్కడున్న ఆ వేశ్యలని చూసి, వాళ్ళు పురుషులే అనుకొని, 'మహాపురుషులారా! మీరు మా ఆశ్రమానికి రండి, మిమ్మల్ని పూజిస్తాను' అన్నాడు. అందరూ విభణ్డకుడి ఆశ్రమానికి వెళ్లారు. తరువాత ఆ వేశ్యలు ఆశ్రమంనుంచి వెళ్ళిపోతూ, ఆ ఋష్యశృంగుడిని గట్టిగ కౌగలించుకుని వెళ్ళిపోయారు. మరునాడు ఆ ఋష్యశృంగుడికి మనసులో దిగులుగా అనిపించి, ఆ వేశ్యలని చూడాలనిపించి, వాళ్ళ దగ్గరికి వెళ్ళాడు. ఈసారి వాళ్ళు, ఆయనని కొంచెం దూరంలో ఉన్న తమ ఆశ్రమానికి రమ్మన్నారు. సరే అని అందరూ బయలుదేరారు. ఆయన అలా అంగదేశంలో అడుగుపెట్టగానే..

తత్ర చ ఆనీయమానే తు విప్రే తస్మిన్ మహాత్మని।
వవర్ష సహసా దేవో జగత్ ప్రహ్లాదయన్ తదా॥


ఆకాశం నుంచి బ్రహ్మాండమైన వర్షం కురిసింది. వెంటనే రోమపాదుడు రుష్యశృంగుడికి నమస్కారం చేసి, ప్రార్థించి, అంతఃపురానికి తీసుకెళ్ళి, తన కుమార్తె అయిన శాంతని ఇచ్చి వివాహం జరిపించారు.

కాబట్టి దశరథ మహారాజు, ఆ రుష్యశృంగుడిని పిలవడానికి, అంగదేశానికి స్వయంగా వెళ్ళాడు. అక్కడ 8 రోజులున్నాక, వెళ్ళిపోతూ, దశరథుడు రోమపాదుడితో ఇలా అన్నాడు...మా ఇంట్లో ఒక ముఖ్యమైన కార్యం ఉంది, కనుక నీ కూతుర్ని అల్లుడిని కూడా నాతో పంపిస్తావా, అని అడిగాడు. రోమపాదుడు ఆనందంగా పంపించాడు. దశరథుడు చాలా సంతోషించి, వాళ్ళని అయోధ్యకి తీసుకెళ్ళాడు.



శివానందలహరి

శ్రీ ఆదిశంకరాచార్యుల విరచితం



శ్లోకము:

అంకోలం నిజబీజ సంతతి రయస్కాంతోపలం సూచికా
సాధ్వీ నైజవిభుం లతా క్షితిరుహం సింధుస్సరిద్వల్లభమ్
ప్రాప్నోతీహ యథా తథా పశుపతేః పాదారవిన్దద్వయం
చేతోవృత్తిరుపేత్య తిష్ఠతి సదా సా భక్తిరిత్యుచ్యతే

భావం

శంకరులు భక్తి అంటే ఏమిటో నిర్వచిస్తున్నారు.

అంకోలచెట్టు విత్తనాలు రాలి పడి, మరల చెట్టును చేరినట్లు, సూది అయస్కాంతాన్ని అంటుకున్నట్లు, పతివ్రత తన పెనిమిటిని అంటిపెట్టుకుని ఉన్నట్లు, లత చెట్టును పెనవేసుకుని ఉన్నట్లు, నదులు సముద్రుడిని చేరినట్లు, మనస్సు పశుపతి పాదారవిందాలను పొంది, ఎల్లప్పుడూ అక్కడే ఉండటాన్ని భక్తి అందురు.

వివరణ

భక్తి అంటే ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం ఉండాలే గాని, ప్రపంచంలో ఎన్నో రకాలుగా ఈ భక్తి వ్యక్తమవుతుంది. ఆ భక్తిలో గూడా ఎన్నో వ్యత్యాసాలు,వైవిధ్యాలు వుంటాయి. అంకోల బీజాలు అంటే, ఊడుగు గింజలు పండి, చెట్టు నుండి నేల మీదకు రాలిపోయినా, మళ్ళీ ఒక అనుకూల సమయం ఆసన్నమైనపుడు, ఇతర ప్రేరణలు లేకుండా వాటంతట అవే, ఆ ఊడుగచెట్టు మానుకే అంటుకుపోతాయి. అంటే, తాము చేరవలసిన చోటు, వాటికి తెలుసన్నమాట. ఇది సామీప్య ముక్తిని సూచించే భక్తికి నిదర్శనం.

దగ్గరలో ఏదన్నా సూదంటు రాయి(అయస్కాంతం)

అంటే సూది ఇతర త్రోవలు పట్టకుండా, ఏదో కొంప మునిగిపోయినట్లు, ఆత్రంగా తిన్నగా వెళ్ళి,

ఆ సూదంటు రాయిని అతుక్కుపోతుంది. అంతే కాదు. ఆ సూదంటు రాతి ఆకర్షణ ధర్మాన్ని గూడా పొందుతుంది. ఇది సాలోక్య ముక్తిని సూచించే భక్తికి నిదర్శనం. పతివ్రతా శిరోమణి తన భర్తను ఆశ్రయించుకొని వుంటూ, అతడి తోడిదే తన జీవితానికి అర్థం పరమార్థం అని నమ్ముతూ, ఎప్పుడూ విడవకుండా కనిపెట్టుకుని, సహధర్మచారిణి ధర్మాన్ని నిర్వర్తిస్తుంది. ఇది కూడా సామీప్య, సాలోక్యాలను, సూచించే భక్తికి నిదర్శనం.

అప్పుడే చిగురు వేస్తున్న తీగ, ఒక చెట్టును గాని, వెదురు కర్రను గాని, ఆశ్రయంగా చేసుకుని, వదలకుండా, దాన్ని చుట్టుకుంటూ, పైపైకి పాకుతుంది. చివరకు పువ్వులను ఫలాలను పొంది, ప్రపంచానికి సమర్పిస్తుంది. ఇది కూడా సామీప్య ముక్తిని సూచించే భక్తికి నిదర్శనం.

ఎక్కడో పుట్టి , ఎక్కడెక్కడో ప్రవహించినా, నదులు చిట్ట చివరకు తమ లక్ష్యాన్ని గుర్తు పెట్టుకుని, సముద్రాన్ని చేరి దానిలో లీనమైపోతాయి. తమ అస్తిత్వాన్ని కూడా కోల్పోతాయి. నది నీళ్ళు తియ్యగా వున్నా , సముద్రంలో కలవంగానే , ఆ నీళ్ళు ఉప్పగానే వుంటాయి. అంటే సముద్ర లక్షణాన్ని , రూపాన్ని కూడా పొంది తమ అస్తిత్వాన్ని (నామ రూపాలను) పూర్తిగా కోల్పోయి సముద్ర నామం తోనే , సముద్ర లక్షణంతోనే వ్యవహరింపబడతాయి. ఇది సాయుజ్య ముక్తిని సూచించే భక్తికి నిదర్శనం.

ఇన్ని రకాల లక్ష్యాలతోను భక్తిని తద్వారా ముక్తిని పొందవచ్చును. ఆ ఆదిదంపతుల పాద పద్మాలకు నమస్కరిస్తూ

సర్వేజనా సుఖినోభవంతు

స్వప్రయత్నము – దైవకృప (నారదుడు – నరకము)

ఒకరోజు శ్రీరామకృష్ణుల భక్తులలో ఇద్దరికి స్వప్రయత్నము – దైవకృప అనే రెండు భావాలకూ సమన్వయం కుదరక గురుదేవుల వద్దకు వెళ్ళి ఆయనను ప్రశ్నించారు. గురుదేవులు వారితో మాట్లాడుతూ ఈ విధంగా చెప్పారు : "స్వప్రయత్నం గురించి ఎందుకు మాట్లాడతారు? ప్రతీదీ భగవంతుని సంకల్పం మీదే ఆధారపడి ఉంటుంది. ఒక ఆవును పలుపుతాడుతో గుంజకు కట్టినట్లుగా మన సంకల్పం కూడా భగవంతుని సంకల్పానికి ముడివేయబడి ఉన్నది. మనిషికి కొంత స్వతంత్రం తప్పక ఉంది. అంతవరకూ తాను స్వప్రయత్నంతో కృషి చేయగలడు. కానీ, ఆ పలుపుతాడు ఎంత పొడవు ఉందో అంతవరకు మాత్రమే ఆ ఆవు తిరగగలిగినట్టుగా, మనిషి స్వతంత్రం కూడా కొంతవరకే ఉంటుంది. అంత మాత్రంతోనే తాను సర్వస్వతంత్రుణ్ణి అని మనిషి అనుకుంటాడు. కానీ నిజానికి అతని సంకల్పం, ఆలోచనా పరిధి అంతా కూడా దైవసంకల్పం పైనే ఆధారపడి ఉంటుంది" అని చెప్పారు.

"అలా అయితే జపతపధ్యానాదుల అవసరమేమీ లేదా? మనిషి హాయిగా కూర్చుని, అన్నీ ఆయన ఇష్టప్రకారం జరుగుతున్నాయని అనుకోవచ్చు కదా?" అని వారు ప్రశ్నించారు.

దానికి గురుదేవులు, "అన్ని మాటలు మాట్లాడి ఏమిటి ప్రయోజనం? ముళ్ళ మీద చెయ్యి పెడితే ముళ్ళు గుచ్చుకుంటాయి. ముళ్ళకంప మీద చెయ్యిపెట్టి, 'ముళ్ళులేవు–ముళ్ళులేవు' అని ఎంత బింకంగా పలికినా అవి గుచ్చుకోకా మానవు! న6ఒప్పి కలుగకా మానదు! మనిషి తన సొంతశక్తితోనే అంతా సాధించగలిగితే అందరూ దైవసాక్షాత్కారాన్ని సాధించి ఉండేవారు కదా! కానీ అలా జరగడం లేదు. ఎందుకో ఆలోచించండి!"

"భగవంతుడు తనకు ఇచ్చిన శక్తిని మనిషి సరిగా ఉపయోగించుకోకపోతే, ఆయన అంతకు మించి మనకు శక్తిని ఇవ్వడు. ఇది మాత్రం నిజం! అందువలననే స్వయంకృషి అనేది అవసరం. స్వయంకృషితో దైవానుగ్రహానికి అర్హతను పొందాలి. స్వయంకృషి, దైవకృప కలిసినప్పుడు అనేక జన్మల బాధలన్నీ ఒక జన్మలోనే అనుభవించవచ్చు. కాబట్టి ఎంతోకొంత స్వప్రయత్నం తప్పనిసరి. ఈ విషయానికి సంబంధించి, ఒక కథ చెపుతా వినండి!"




"ఒకసారి విష్ణువుకు ఎందుకో కోపం వచ్చి, నారదుణ్ణి నరకంలో పడమని శపించాడు. నారదుడు చాలా కలతపడి, నరకం ఎక్కడ ఉందో చూపించమని, అక్కడకు ఎలా వెళ్ళాలో తెలియచేయమని విష్ణుమూర్తినే మరీమరీ ప్రార్థించాడు. విష్ణుమూర్తి ఒక సుద్దముక్కతో నేలపైన విశ్వం యొక్క చిత్రపటాన్ని గీసి దానిలో స్వర్గం, నరకం ఎక్కడ ఉంటాయో స్పష్టంగా గుర్తుపెట్టి చూపించాడు. నారదుడు ఆ పటంలో నరకం ఉన్న ప్రదేశాన్ని చూపించి, 'ఇదే కదా నరకం? మీరు చెపుతున్నారు కనుక ఇది కచ్చితంగా నరకమే!" అని, ఆ ప్రదేశంలో నేలమీదపడి, అటూ ఇటూ పొర్లి, తాను నరకబాధలన్నీ అనుభవించేసినట్టేనని చెప్పాడు. విష్ణుమూర్తి చిరునవ్వుతో, 'అదెలా కుదురుతుంది?' అని అడిగాడు. నారదుడు, 'ప్రభూ! స్వర్గము, నరకము మీ సృష్టే కదా! మీరే ఈ బొమ్మ గీసి దానిలో నరకాన్ని చూపించారు కదా! కాబట్టి అది నిజంగా నరకమే అవుతుంది. నిజానికి ఆ ప్రదేశంలో నేను పొర్లుతున్నప్పుడు నాకు విపరీతమైన బాధ కలిగింది. అందుచేత నరకంలోని శిక్షలన్నీ అనుభవించినట్టే!" అన్నారు. ఈ మాటలను నారదుడు ఎంతో నిజాయితీతో చెప్పాడు. అది విని విష్ణుమూర్తి సంతృప్తి చెందాడు." నారదుడు ఆ చిత్రపటం ఉన్న ప్రదేశంలో పొర్లడాన్నీ, విపరీతమైన బాధలను అనుభించడాన్నీ ప్వప్రయత్నంతోనూ, విష్ణువు సంతృప్తి చెందడాన్ని దైవకృపతోనూ పోల్చవచ్చు.

శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన గూఢార్థ కథలు

బాల మకరందం

నిజం నిరూపించే యుద్ధం

కృష్ణుడు మధురవాసులందరి శ్రేయస్సు కోరుకునేవాడు. అలాగే మధుర వాసులంతా కృష్ణుడిని ఇష్టపడినా, ఎవరో ఒకరిద్దరు అతడికి వ్యతిరేకులుగా ఉండేవారు. అలాంటి వారిలో సత్యభామ తండ్రియైన సత్రాజిత్తు ఒకడు. అతడు సూర్య భగవానుడిని నిత్యపూజలతో ప్రార్థించి, 'శమంతకమణి'ని పొందాడు. ఆ మణి రోజుకు 80 కిలోల బంగారిన్నిచ్చేది. దాంతో సత్రాజిత్తు సంపాదన రోజు రోజుకి పెరిగిపోసాగింది. ఇలాంటి మణి సామాన్యుల వద్ద ఉండడం కన్నా మహారాజు వద్ద ఉంటే సమాజానికి మరింత మేలు కలుగుతుందని కృష్ణుడు, సత్రాజిత్తుకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. కృష్ణుడి మాటలకు సత్రాజిత్తు అంగీకరించలేదు. కొంత కాలం తర్వాత సత్రాజిత్తు ఆ మణిని పోగొట్టుకున్నప్పుడు కృష్ణుడిచ్చిన సలహాను గుర్తుచేసుకొని, అతడే ఆ మణిని దొంగిలించాడని దుష్ప్రచారం చేశాడు. తన మీద పడిన అపవాదును చెరిపివేసుకోవడానికి, సత్యం నిరూపించడానికి, కృష్ణుడు తన బృందంతో అడవులకు వెళ్ళి మణి కోసం వెతకసాగాడు. అక్కడ ఎలుగుబంటి రాజైన జాంబవంతుడి కుమార్తె జాంబవతి దగ్గర ఆ మణిని చూసి దానిని తీసుకోబోయాడు. అంతలో జాంబవంతుడు వచ్చి కృష్ణుడిని యుద్ధం చేయమని పిలుపునిచ్చాడు. కృష్ణ, జాంబవంతుల మధ్య 28 రోజుల పాటు యుద్ధం సాగింది. త్రేతాయుగంలో జాంబవతి రాముడితోనే యుద్ధం చేయాలనే కోరికను వ్యక్తం చేశాడు. శ్రీకృష్ణుడు సాక్షాత్ ఆ పరమాత్ముడేనని గ్రహించి ఓటమిని అంగీకరించాడు. జాంబవంతుడు శమంతకమణితో పాటు తన కుమార్తె జాంబవతిని కృష్ణుడికిచ్చి వివాహం జరిపించాడు.



గ్రహించవలసిన లక్షణం: న్యాయం

ధృతరాష్ట్ర ఉవాచ

ధర్మక్షేత్రే కురుక్షేత్రే
సమవేతా యయుత్సవహ!
మామకాహ పాండవాశ్చైవ
కిమకుర్వత సంజయ॥

తాత్పర్యం

ధృతరాష్ట్రుడు పలికెను – ఓ సంజయా! యుద్ధ సన్నద్ధులై ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునకు చేరియున్న నా కుమారులునూ, పాండుపుత్రులునూ ఏమి చేస్తారు?

నీతి

కౌరవ, పాండువల మధ్య జరిగిన యుద్ధంలో పాండవులు ధర్మమార్గం అనుసరించారు. అందువల్లే వారు యుద్ధంలో గెలిచారు. ఎప్పుడూ ధర్మమే గెలుస్తుంది.

ముఖ్యపదం: యుద్ధం

మంత్రం

మంత్రం అనునది ప్రపంచానికి భారతీయ విజ్ఞానం ప్రసాదించిన అపూర్వమైన విజ్ఞానం. మంత్రించి శరసంధానం చేయటం, మంత్రంతో రోగ నివారణ చేయటం, మంత్రాలతో జనహిత నెర చేర్చటం, వేదమంత్రోచ్చారణతో విశ్వకళ్యాణం కాంక్షించటం భారత సంప్రదాయం. ఇప్పుడు ఆధునికులు ఈ మంత్ర (శబ్ధ) శక్తిని సౌండ్ థెరపీగా వైద్య విధానంలో అవలంభిస్తున్నారు.

మంత్రం అనగా మననాత్ ఇతిమంత్రః అని అర్థం. నిర్ణీత ధ్వనుల సమూహాన్నే మంత్రమంటారు. మంత్రానికి అర్థం ఉంటుంది. ఇది ధ్వనిపై ఆధారపడుతుంది. మంత్రానికి స్వరం కూడా ముఖ్యమైనది. స్వరం వల్ల శక్తి పుంజం ఏర్పడుతుంది.

మంత్రం శబ్దం విన్యాసమే కాదు. అది ఒక సునిశిత విజ్ఞానం. భావన బట్టి, ఉచ్చారణను బట్టి చేసిన మంత్ర సాధనకు ఫలితం ఉంటుంది. మన స్థూల శరీరానికి కొంచె కూడా శక్తి లేదు. సూక్ష్మశక్తుల ప్రక్రియ దీనిలో ప్రదర్శిస్తారు. మన సూక్ష్మ శరీరంలో అనేక శక్తులున్నాయి. వాటిని మేల్కొలిపితే అసాధారణ కార్యాలు చేయగలుగుతాయి.

సంస్కృత భాషకు సంబంధించిన అక్షరాల్లో శబ్దం, అర్థం రెండూ ఇమిడి ఉన్నాయి. ఈ అక్షరాలను సరైన రీతిలో కూర్చడంవల్ల అనేక శక్తులు సమకూరుతాయి. వాటిలో కొన్నింటిని బీజాక్షరాలు అని అంటారు. ఈ బీజక్షర నిరంతర ఉచ్చారణ వల్ల శక్తి జనిస్తుంది. తద్వారా మంత్రసిద్ధి కలుగుతుంది.



ఐం, క్లీం, సౌః, హ్రీం, శ్రీం, వంటివే ఎన్నో బీజాక్షరాలు. వాటి వినియోగం మంత్ర శాస్త్రంలో తెలిపారు. ఐం, అనునది ఐశ్వర్య బీజాక్షరం. క్లీం. అనునది ఆకార్షణా బీజాక్షరం. వేదాలు కూడా అనంత మంత్రరాశి. ఈ మంత్రాలను ఉచ్చారణ దోషం లేకుండా వినియోగించాలి. మంత్రోచ్చారణ వల్ల ఏర్పడిన ప్రకంపనలు ఆయా నాడులను చైతన్యపరుస్తాయి. ఈ ప్రకంపనలు దేవతా శక్తులతో అనుసంధానిస్తారు. తద్వారా అభీష్టసిద్ధిని కనిగిస్తాయి. మంత్రద్రష్టలను ఋషులు ఏర్పాటు చేశారు. ప్రతి మంత్రానికి దానికి సంబంధించిన ఒక ఋషి ఉంటాడు. మంత్ర జపం ముందుగా అ ఋషిని స్మరించాలి. ఆ మంత్రాధి దేవతను స్మరించాలి. తద్వారా ఆ దేవతా శక్తిని మన మంత్రాసాధకుడు గ్రహిస్తాడు. ప్రతి మంత్రానికీ ఒక ఛందస్సు ఉంటుంది. మంత్ర శక్తిని సాధకునికి అందజేయు బీజాక్షరమే శక్తి బీజం అనగా దేని నుండి చైతన్య ప్రసారం జరుగుతున్నదో అ బీజాక్షరానికి బీజమని పేరు. ఇక మంత్రం గత చైతన్యాన్ని కట్టివేసే బీజాక్షరానికి కీలకమని పేరు. ఇది మంత్రానికి తాళం వంటిది. ఆ కీలక బీజోచ్చారాణయే తాళంచెవి వంటిది. ఇక వినియోగమనగా జపమునగాని, హోమమున గాని, పారాయణమున గాని దేని యందు మంత్రగత చైతన్యము వినియోగింపబడుతున్నదో తెలుపుట వినియోగం.

ప్రతి మంత్రగత శక్తిని ఆరు భాగాలుగా చేసి వానితో హృదయాదులయందు న్యాసము (అనగా ఉంచుట అని అర్థం) చేయుటయే అంగన్యానము. చేతుల యందలి న్యాసమే కరన్యాసము. ధ్యానం అనగా ప్రతి మంత్రానకు ఒక ధ్యాన శ్లోకం ఉంటుంది. ఆ మంత్ర దేవతను ధ్యానము శ్లోకానుగుణంగా నిరంతరం భావన చేయటమే ధ్యానము. ఇచట దేవత స్థూల రూపము మంత్ర ధ్యాన శ్లోకానుగతమని, సూక్ష్మరూపము మంత్రానుగుణమని, కారణ రూపము (సూక్ష్మతయు) మూల తేజోభూతమైన కుండలినీ శక్తియని గ్రహించాలి.

శాస్త్రీయ విజ్ఞానం

భారతీయ వైదిక జీవనంలో ఎన్నో గురుముఖంగా గురువు ద్వారా గ్రహించాలి. అప్పుడే మంత్రసిద్ధి కలుగుతుంది. భారతీయ వైదిక జీవనంలో ఎన్నో మంత్రాలు నిక్షిప్తంగావింపబడి ఉన్నాయి. ఈ జప, తప, మంత్ర విధానాలు హైందవుల నుంచి జైనులకు, బౌద్ధులకు, విదేశీయులకు, సూఫీ సాధువులకు చివరకు నేటి క్రిష్టియన్లకు చేరివారి ఈ మంత్ర, తంత్ర విధానాలను అవలంభిస్తూ దీనిపై ఆసక్తి కనబరుస్తున్నారు.

విజయక్రాంతి
బుధవారం 09 జనవరి 2019
హైదరాబాద్

టీఎస్పీఎస్సీ ముందు ఫార్మాసిస్టు అభ్యర్థుల ఆందోళన

విజయక్రాంతి, హైదరాబాద్: ఫార్మాసిస్టు పోస్టుల భర్తీ కోసం టీఎస్పీఎస్సీ విడుదల చేసిన రివైజ్డ్ మెరిట్ లిస్ట్‌పై పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో మంగళవారం టీఎస్‌పీఎస్సీ ముందు పలువురు అభ్యర్థులు నిరసన చేపట్టారు. ప్లకార్డులను పట్టుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్‌లో నిబంధనలకు విరుద్ధంగా టీఎస్పీఎస్సీ వ్యవహరిస్తున్నదని వారు ఆరోపించారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కనీస అర్హత మార్కులు నిర్ణయించారని, సవరించిన మెరిట్ లిస్ట్‌లో ఆ విషయాన్ని విస్మరించారన్నారు. కేవలం కాంట్రాక్ట్ ఉద్యోగులకే మొత్తం ఉద్యోగాలను కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

తిరుపతికి ప్రత్యేక రైళ్లు

విజయక్రాంతి, హైదరాబాద్: సంక్రాంతి రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ – తిరుపతి – హైదరాబాద్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపనుంది. జనవరి 12న హైదరాబాద్ నుంచి తిరుపతికి, జనవరి 13న తిరుపతి నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక రైలును నడుపనున్నారు. మార్గమధ్యలో ఈ రైళ్లు కాజీపేట్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లలో జనరల్ సెకెండ్ క్లాస్, స్లీపర్ క్లాస్ కోచ్‌లతో పాటు ఏసీ టూ టైర్, త్రీ టైర్ బోగీలుంటాయి.

సాయికృష్ణకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి) ఓ ఆటోమోటివ్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఈ నెల మూడోతేదీన విధులు ముగించుకుని (అమెరికా కాలమానం ప్రకారం గురువారం రాత్రి 11.30 గంటలకు) ఇంటికి తిరిగి వస్తుండగా అనుకోని పరిణామం సంభవించింది. ఆయన మిత్రుడు సృజిత్ తెలిపిన సమాచారం మేరకు సాయికృష్ణ ఓ మెక్సికన్ ఫుడ్ రెస్టారెంట్ దగ్గర కారును ఆపినప్పుడు సాయుధ దుండగులు చొరబడ్డారు. తుపాకులు చూపి బెదిరిస్తూ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ సాయికృష్ణ నుంచి వాలెట్ తీసుకున్నారు. బట్టలు లాగేశారు. కారును తీసుకుని వెళ్ళిపోయేముందు సాయికృష్ణ నోటిలో తుపాకి పెట్టి కాల్చేశారు. తీవ్రంగా గాయపడి గడ్డకట్టే చలిలో రక్తమోడుతూ గంటకుపైగా అలాగే ఉండిపోయిన అతడిని ఆ దారివెంట వెళుతున్న మహిళలు చూసి అధికారులకు సమాచారమందించారు.

ముస్లింలు, గిరిజనుల రిజర్వేషన్ల పెంపుపై కేంద్రంపై ఒత్తిడి తెండి

(మొదటి పేజీ తరువాయి) కేంద్రానికి పంపింది. ఈ తీర్మానాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టాల్సి ఉంది. బిల్లుకు టీఆర్ఎస్ మద్దతు ప్రకటించాలనీ, అయితే వివిధ అంశాలపై క్లారిటీ లేనందున సవరణలు కోరాలనీ కేసీఆర్ సూచించారు. తాజాగా కేంద్రం రిజర్వేషన్ల పెంపు అంశాన్ని చేపట్టినందున ఈ బిల్లులో తెలంగాణలో రిజర్వేషన్ల పెంపు అంశాన్ని కూడా చేర్చాలని కోరాల్సిందిగా సీఎం ఆదేశించారు. బిల్లులో సవరణలు తెచ్చి తెలంగాణ డిమాండ్స్‌ను నెరవేర్చాలని పట్టుబట్టాలని ఎంపీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

సార్వత్రిక సమ్మె పాక్షికం

(మొదటి పేజీ తరువాయి) యూనియన్ (ఎన్ఎంయూ), ఆర్ఎస్ఎస్ అనుబంధ కార్మిక సంఘం బీఎంఎస్ సమ్మెకు మద్దతివ్వలేదు. దీంతో ఆర్టీసీ బస్సులు రాష్ట్ర వ్యాప్తంగా తిరిగాయి. టీఎంయూ నిరసన ప్రదర్శనలు మాత్రమే నిర్వహించింది. ఏఐటీయూసీ, సీఐటీయూ సంఘాలకు అనుబంధంగా ఉన్న ఎంప్లాయిస్ యూనియన్, ఎస్‌డబ్ల్యూఎఫ్‌తో పాటు కార్మిక పరిషత్, బహుజన వర్కర్స్ యూనియన్‌కు సంబంధించిన కార్మికుల మాత్రం సమ్మెలో పాల్గొన్నారు. ఆటోలు, క్యాబ్‌లు కూడా యథావిధిగా తిరిగాయి. బ్యాంకుల్లో ప్రధానంగా వామపక్షాలకు సంబంధించిన సంఘాల ప్రాతినిధ్యమున్నప్పటికీ.. కొన్ని బ్యాంకులు తమ లావాదేవీలు నిర్వహించాయి. సింగరేణిలో కూడా టీఆర్ఎస్ అనుబంధ సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గుర్తింపు సంఘం కావడంతో అక్కడ కూడా కార్మికులు సమ్మెలో పాల్గొనలేదు.

విజయవంతం: కార్మిక సంఘాలు

సింగరేణి, ఆర్టీసీ మినహా మిగిలిన రంగాల్లోని కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు చుక్కా రాములు, రత్నాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాలుపంచుకున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పోస్టల్, ఎల్ఐసి, జనరల్ ఇన్సూరెన్స్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ వంద శాతం సమ్మెలో పాల్గొన్నారని చెప్పారు. గ్రామీణ కమర్షియల్ బ్యాంకు ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బీడీఎల్, ఎన్‌టీపీసీ, ఈసీఐఎల్, బీహెచ్ఈఎల్, బీఈఎల్, బీహెచ్ఈఎల్ఆర్‌డీ తదితర సంస్థల్లో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు అన్ని చోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. బుధవారం కూడా సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఈబీసీ కోటాను స్వాగతించిన కాంగ్రెస్

విజయక్రాంతి, హైదరాబాద్: ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించడాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. ఈ మేరకు గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి, ఇందిరాభవన్‌లో ఏపీసీసీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డిలు వేరువేరుగా జరిగిన మీడియా సమావేశాల్లో మాట్లాడారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ, ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో ఇదివరకే తాము ఈ అంశాన్ని పేర్కొన్నామన్నారు. నాలుగేళ్లు కాలయాపన చేసి హడావుడిగా ప్రకటించడంలో నిజాయితీ లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కల్పించి ఉంటే చాలా మందికి మేలు జరిగి ఉండేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 24 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయలేదన్నారు. రాజ్యాంగం ప్రకారం.. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీలకు 18.46 శాతం, ఎస్టీలకు 10.97 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీల జనాభా పెరిగినప్పటికీ ఓబీసీల రిజర్వేషన్ పెంచాల్సి వస్తుందనే ఆ వివరాలను రహస్యంగా ఉంచారన్నారు. మల్లు రవి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని సవరించి ఈబీసీలకు రిజర్వేషన్ కల్పించడానికి కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందన్నారు.

ఇటు ఫెడరల్, అటు ప్రజాఫ్రంట్లు

- రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు బిజీబిజీ
- ఢిల్లీలో చంద్రబాబు మంతనాలు
- అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్‌పై విభిన్న స్వరాలు



విజయక్రాంతి, హైదరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెసేతర, బీజేపీయేతర ఫ్రంట్ కోసం ప్రాంతీయ పార్టీల నాయకులను, ముఖ్యంగా ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలుస్తోంటే, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాంగ్రెస్‌తో కలిసి ప్రజా ఫ్రంట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

ఇందులో భాగంగా ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు సీఎంలు, జాతీయ నేతలను కలుస్తున్నారు. కేసిఆర్ ప్రస్తుతం మంత్రి వర్గ విస్తరణ, అసెంబ్లీ సమావేశాల్లో బిజీగ ఉన్నప్పటికీ, అయన కూడా త్వరలో దేశ రాజధానికి వెళ్లే అవకాశాలు లేకపోలేదు. దీంతో, ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులే పెద్ద చర్చనీయాంశంగా మారారనడంలో సందేహం లేదు. ఇప్పటికే ఎవ్వరు ఊహించనంత భారీ మెజారిటీతో తిరిగి టీఆర్ఎస్ ను అధికారంలోకి తెచ్చిన కేసిఆర్ దేశ రాజకీయ్యాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారారు. మరోవైపు కేంద్రంపైన, ప్రధాని మోడీ పైనా అవకాశం దొరికిన ప్రతీ సందర్భంలో నిప్పులు చెరుగుతున్న చంద్రబాబు కూడా జాతీయ రాజకీయాలను పూర్తి స్థాయిలో రక్తి కట్టిస్తున్నారు.

ప్రాంతీయ పార్టీలను ఏకం చేయాలని కేసీఆర్ వరస పర్యటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అయన బెంగాల్ ముఖ్య మంత్రి మమత బెనర్జీని, ఒడిశా ముఖ్య మంత్రి నవీన్ పట్నాయక్ ను కలిసి మంతనాలు జరిపారు. కేంద్రంలో బీజేపి ఏతర, కాంగ్రెస్ ఏతర ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమున్న ప్రాంతీయ పార్టీలన్నింటిని ఏకం చేస్తూ ముందుకు సాగుతున్నారు. కేంద్రంలో ప్రాంతీయ పార్టీలతో కూడిన ఫ్రంట్ ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలన్నీ కేసిఆర్ తీసుకుంటున్నారు. మాజీ ఉత్తర్ ప్రదేశ్ ముఖ్య మంత్రి అఖిలేష్ యాదవ్ జనవరి 6వ తేదీనే హైదరాబాద్ వచ్చి కేసీఆర్ ను కలవాల్సి వున్నా, ఆ రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పురపాలక ఎన్నికల నేపథ్యంలో ఆయన తన హైదరాబాద్ పర్యటన వాయిదా వేసుకున్నట్లు సమాచారం. అదే రాష్ట్రానికి చెందిన మరో మాజీ ముఖ్య మంత్రి మాయావతి కూడా తాను కాంగ్రెస్ తో కూడిన ఫ్రంట్ లో చేరే అవకాశమే లేదని చెప్పడంతో ఆమె కూడా కేసిఆర్ ప్రతిపాదిస్తున్న ఫ్రంట్ లోనే చేరవచ్చనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి.

చంద్రబాబు నాయుడు ఇప్పటికే కాంగ్రెస్ తో జత కట్టారు. బీజేపీకి వ్యతిరేకంగా వున్న అన్ని ప్రాంతీయ పార్టీల అధినాయకత్వాలను కాంగ్రెస్ పార్టీతో కలిసి ఏకం చేస్తున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి బీజేపి, ఆంధ్ర ప్రదేశ్ కు అన్యాయం చేసిందని, కనీసం నిధులు కూడా సరిగా ఇవ్వడం లేదని నూతన రాష్ట్రంగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ కు కేంద్రం నుంచి ఎలాంటి సహకారం అందడంలేదని ఆయన వారికి చెప్పడమే కాకుండా వారందరి మద్దతు కూడా గట్ట గలిగారు. చంద్రబాబు కూడా ఇప్పటికే తమిళ్ నాడు నాయకులను, కర్ణాటక ముఖ్య మంత్రి కుమారస్వామిని, మమతా బెనర్జీని మరికొందరు నాయకులను కలిశారు. తాజాగా, కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను పెంచుతూ తీసుకున్న నిర్ణయం అయనకు కలిసి వచ్చే అంశమేనని, దీనిపై కేంద్రాన్ని ఇబ్బంది పెట్టె దిశగా చంద్రబాబు పావులు కదిపే అవకాశాలు లేకపోలేదని కూడా పార్టీ నాయకులు నమ్ముతున్నారు. ఇలా ఇద్దరు చంద్రులు దేశ రాజకీయాల్లో మార్పుకోసం అహర్నిశలు కృషి చేస్తు ముందుకు సాగుతున్నారు. దీంతో తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు జాతీయ రాజకీయాల్లో పెద్ద చర్చనీయాంసంగా మారారనడంలో సందేహం లేదు. తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షులు అమిత్ షా స్వయంగా ప్రచారం చేయడం, మోడీ గత వారం ఆంధ్ర ప్రదేశ్ నాయకులతో జరిపిన వీడియో సమావేశాల్లో చంద్రబాబు పై తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం జాతీయ రాజకీయాల్లో ఈ ఇద్దరు చంద్రులకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతోంది.

పంచాయతీ ఎన్నికల్లో.. 6000 మంది అనర్హులు



(మొదటి పేజీ తరువాయి) తెలిసింది. తొలి విడత నామినేషన్ల గడువుకు దగ్గర పడుతుండడంతో ఆశావహులు భార్యలు, మరదళ్ళు, తమ్ముళ్ళు, కుమారులను పోటీలో దింపుతున్నట్లు తెలిసింది. అనర్హుల జాబితాలో ఉన్న ఆశావహులు కొంతమంది వారి ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్లి పైరవీలు కూడా చేసుకుంటున్నట్లు తెలిసింది. కానీ ఎన్నికల నియామావళి ప్రకారం ఎన్నికల సంఘం ఒక్కసారి అభ్యర్థులను అనర్హులుగా ప్రకటిస్తే దాన్ని మార్చడం కష్టమే. దీంతో ఎమ్మెల్యేలు కూడా చేతులు ఎత్తివేయడంతో ప్రత్యామ్నాయంగా వారి కుటుంబంలోని ఇతరులను పోటీ పెడుతున్నట్లు తెలిసింది. అయా గ్రామ, మండల కేంద్రాల్లో రాజకీయంగా కీలకంగా ఉన్న నాయకుల్లో చాలా మంది అనర్హులుగా ఉన్నారు. ప్రజల్లో చులకనగా ఉంటుందని అనర్హత విషయాలను బయటకు వెల్లడించకుండా ఇతరులకు అవకాశం ఇచ్చేందుకు తాము పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పుకుంటున్నట్లు తెలిసింది.

ఈ ఎన్నికల ఖర్చులు సమర్పించని పాపమే అనర్హత

ఇదిలా ఉండగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్ధేశించిన లెక్క ప్రకారం ఖర్చు చేయాల్సి ఉంటుంది. సంబంధిత ఎన్నికల లెక్కల ఖర్చులను ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుంది. పోలింగు పూర్తయిన నెల రోజుల్లోగా అయా అభ్యర్థులు ఎన్నికల్లో చేసిన ఖర్చు వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. కానీ గత ఎన్నికల్లో పోటీ చేసి లెక్కల సమర్పించని అభ్యర్థులు సుమారు 6వేల మంది సమర్పించలేదని రాష్ట్ర ఎన్నికల సంఘం జాబితాను విడుదల చేసింది. ఈ 6వేల మందిని ఎన్నికల సంఘం అనర్హులుగా ప్రకటించింది. గత ఎన్నికల్లో 8686 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. వీటిలో 6వేల మంది అభ్యర్థులు అనర్హుల జాబితాలో చేరారు. దీన్నిబట్టి సుమారు 50శాతానికి పైగా అభ్యర్థులు అనర్హులైనారని తెలుస్తుంది. ఇలాంటి పరిణామాల దృష్టిలో పెట్టుకొని ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం సర్పంచు, వార్డు సభ్యులు ఎంత మేరకు ఖర్చు చేయాలనే వివరాలను ప్రకటించింది. పైగా ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చులను జమ చేసేందుకు బ్యాంకు ఖాతాలను తెరవడం తప్పనిసరి చేసింది. దీంతో ప్రతి అభ్యర్థి నామినేషన్ వేసే సమయంలోనే బ్యాంకు పాస్ పుస్తకాలను కూడా నామినేషన్ పత్రాలతో పాటు జతపర్చాలని నిబంధనలను విధించింది. 5వేల జనాభా దాటిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.2.50లక్షలు, వార్డు మెంబర్లు రూ.50వేలు మించి ఖర్చు చేయరాదని, 5వేలు కంటే తక్కువ జనాభా కల్గిన గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఖర్చును రూ.1.50లక్షలు, వార్డు మెంబర్లు రూ.30వేలుగా రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.

వాస్తవానికి ఎన్నికల్లో పోటీ చేసి ఖర్చులను సమర్పించని జాబితాలో రిజర్వుడ్ స్థానాల్లో పోటీ చేసిన ఎస్సీ, ఎస్టీ, మహిళా, బీసీలే ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. అయా గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్లు రాగానే అయా పార్టీలకు చెందిన నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులను రాజకీయాలతో సంబంధం లేకున్నా నిలబెడుతారు. ఒకవేళ ఎన్నికల్లో ఓడిపోతే అయా పార్టీల నాయకులు వారిని పట్టించుకోరు. వారు బతుకుదెరువు కోసం వలసలు వెళ్లడం లేదా రాజకీయాల్లో క్రియాశీలకంగా లేకపోవడంతో ఎన్నికల ఖర్చులను సమర్పించకుండా పట్టించుకోరు. దీంతో మళ్లీ ఎన్నికలు వచ్చినప్పుడే వారు గుర్తుకు వస్తుంటారు. దీంతో ఇలాంటి సమస్యలు ఉత్పన్నమౌతుంటాయని తెలుస్తుంది.

ఈబీసీ బిల్లు పాస్..కోటాకు ఆమోదముద్ర

(మొదటి పేజీ తరువాయి) వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లను కల్పించాలని ప్రయత్నిస్తున్నాం. పీవీ హయాంలో ప్రత్యేక చట్టం ఏమీ చేయకపోవడంతో సుప్రీం కోర్టు కొట్టివేసింది. చాలా మంది రిజర్వేషన్లు 50 శాతం దాటితే కోర్టు కొట్టివేస్తుందని అంటున్నారు. ఆ ఆందోళన నిజమే అయితే ఇప్పటి వరకు రిజర్వేషన్లకు ఆర్టికల్ 15, 16 కల్పించిన వెసులుబాటులే మూలం. ఆర్టికల్ 16(4)లో కులాల ఆధారంగా రిజర్వేషన్ల ప్రస్తావన ఉంది" అని జైట్లీ అన్నారు. చాలా రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో అన్ రిజర్వుడ్ కేటగిరీల వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానాలు చేశాయని ఆయన విమర్శించారు. సమాజంలో పేదలకు ప్రయోజనాలు కల్పిస్తుంటే వామపక్షాలు వ్యతిరేకించడం ఇదే మొదటిసారి అని జైట్లీ వ్యాఖ్యానించారు.

60 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చాలి: పాశ్వాన్

రిజర్వేషన్ బిల్లుపై చర్చలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ జనరల్ కేటగిరి రిజర్వేషన్స్‌పై మూడు డిమాండ్లు సభ ముందుంచారు. 60 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చాలని, అందువల్ల కోర్టులో సవాలు చేసే వీలుండదని అన్నారు. అదేవిధంగా 60 శాతం రిజర్వేషన్‌ను ప్రైవేటు రంగంలోనూ, ఇండియన్ జ్యుడిషియల్ సర్వీస్‌లోనూ వర్తింప చేయాలని ఆయన సూచించారు.

తొందరపాటు చర్య.. బిల్లును జేపీసీకి పంపాలి: కాంగ్రెస్ ఎంపీ కేవీ థామస్

కాగా అగ్రవర్ణాల పేదల రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం తొందరపాటుగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ ఎంపీ కేవీ థామస్ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కోటా బిల్లుకు తాము మద్దతిస్తున్నామన్నారు. దీనికి తాము వ్యతిరేకం కాదన్న ఆయన దీనిని తీసుకొచ్చిన తీరు మాత్రం ప్రభుత్వ నిజాయితీపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. దీనిని పరిశీలించేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపి సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. "ఏ తొందరపాటు నిర్ణయమైనా అనేక సమస్యలకు దారితీస్తుంది. పీవీ హయాంలో మొదటిసారి ఆర్థిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్లు తెచ్చారు. కానీ ఆ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వం చాలా తొందరపాటుగా వ్యవహరిస్తోంది. ఆ అనుభవం దృష్ట్యా ఇందులో ఎన్నో చట్టపరమైన అంశాలు ఇమిడి ఉన్నాయి. అసలు ఈ దేశంలో ఉద్యోగ కల్పన ఎక్కడ ఉంది? ఈ ప్రభుత్వం ఏటా 2 కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఐదేళ్లలో పది కోట్ల ఉద్యోగాలు రావాల్సి ఉంది. కానీ అలా జరగలేదు. ఈ ప్రభుత్వానికి ఇంకా 3 నెలలు మాత్రమే సమయం ఉంది. ఇంత తొందరపాటుతో తీసుకున్న నిర్ణయాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?" అని కాంగ్రెస్ ఎంపీ కేవీ థామస్ ప్రశ్నించారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికే ఎన్డీయే ప్రభుత్వం తప్పుల మీద తప్పులు చేస్తోందన్నారు. అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఈ రిజర్వేషన్లను ఎలా అమలు చేస్తారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ చట్టం సుప్రీం కోర్టులో నిలవదు: తంబిదురై

కాగా ఈ కోటా బిల్లును అన్నాడీఎంకే వ్యతిరేకించింది. దేశంలో సామాజిక న్యాయం కోసమే రిజర్వేషన్లు ఉన్నాయని, అలాంటప్పుడు అగ్రవర్ణ పేదలకు 10శాతం రిజర్వేషన్ల బిల్లును ఇంత తొందరగా తీసుకురావాల్సిన అవసరమేంటని ఆ పార్టీ సభ్యుడు తంబిదురై ప్రశ్నించారు. ఆర్థిక హోదాను బట్టి రిజర్వేషన్లు ఇవ్వరాదని, పేదల కోసం తగినన్ని పథకాలున్నాయని ఆయన అన్నారు. ఇంతకాలం పేదల కోసం చేపట్టిన పథకాలు, ప్రయత్నాలు ఏమయ్యాయని నిలదీశారు. 'శతాబ్దాలుగా అణచివేతకు గురైన శూద్రుల కోసమే రిజర్వేషన్లు. ఎన్నో పథకాలు ప్రకటించి ప్రచారం చేసుకుంటున్నారు. . వాటి ఫలాలు ఏవీ? ఈ నేపథ్యంలో రిజర్వేషన్లకు ఆర్థిక వెసులుబాటు అనేది ప్రాతిపదిక కాబోదు. గ్రామీణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి పేరుతో అనేక పథకాలు అమలు చేస్తున్నారు. నిమ్న వర్గాల రిజర్వేషన్ల అంశాన్ని అంబేద్కర్ గుర్తించారు. ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న నినాదం తమిళనాడులో 1920 నాటి నుంచే ఉంది. అంబేద్కర్ ఎంతో చదువుకున్నా ఎన్నో అవమానాలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఇదే వ్యవహార శైలితో ముందుకెళ్తే ఈ చట్టం నిలవదు. ప్రభుత్వం తీసుకు వచ్చే రిజర్వేషన్ బిల్లును సుప్రీంకోర్టు కొట్టేస్తుంది. 70ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ఇంకా కుల వివక్ష ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ద్రవిడ ఉద్యమాలు రిజర్వేషన్ల కోసం నినదించాయి. ఎంజీఆర్ హయాంలో తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లకు నాంది పలికారు" అని ఆయన వివరించారు. తమిళనాడులో సామాజికంగా వెనుకబడిన వారికి 70శాతం రిజర్వేషన్లకు అన్నాడీఎంకే డిమాండ్ చేస్తోందన్నారు. 'రాజ్యాంగ సవరణను తీసుకురండి. అయినా 9వ షెడ్యూల్ రక్షణ శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వదు' అని తంబిదురై తెలిపారు.

రాజకీయ జిమ్మిక్కు: టీఎంసీ

రిజర్వేషన్ల బిల్లుపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ మాట్లాడారు. కేంద్రం తీరును తప్పుబట్టిన ఆయన.. వంద రోజుల్లో ఎన్నికలుండగా ఈ తరహా బిల్లు ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. "ఇది రాజకీయ జిమ్మిక్కు అనే అనుమానం ఉంది. రైల్వేలో 85వేల ఉద్యోగాలకు 25 మిలియన్ల దరఖాస్తులు వచ్చాయి. ఇదే స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్ల బిల్లును ఈ ప్రభుత్వం ఎందుకు తీసుకురావట్లేదు? ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగ కల్పనపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. ఉపాధి కల్పనకు ఇచ్చిన హామీలపై ఏం చేయబోతున్నారో స్పష్టం చేయాలి. ఏ ఏటికాయేడే తప్పించుకుంటూపోతే నిరుద్యోగంపై ఎప్పటికీ చర్చ జరగదు. నిరుద్యోగ యువత గురించి ఈ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుందని నమ్ముతూ రిజర్వేషన్ల బిల్లుకు టీఎంసీ మద్దతిస్తోంది" అని సుదీప్ బందోపాధ్యాయ వెల్లడించారు.

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు మంచిదే: మాయావతి

అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి స్వాగతించారు. రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతిస్తామని ఆమె ప్రకటించారు. అయితే సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోదీ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని రాజకీయ గిమ్మిక్కుగా మాయావతి అభివర్ణించారు. "కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచిదే. కానీ దీని వెనుక ఉన్న ఉద్దేశం మాత్రం మంచిది కాదు. సరిగ్గా లోక్సభ ఎన్నికలకు ముందు ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల ఇది రాజకీయ ఎత్తుగడగానే కనిపిస్తోంది. మరింత ముందే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేది..." అని మాయావతి పేర్కొన్నారు. "ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల జనాభా పెరిగిన విషయాన్ని పరిగణలోకి తీసుకుని వారికి 50 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయాలి ' అని మాయావతి డిమాండ్ చేశారు.

ఈబీసీ బిల్లును టీఆర్ఎస్ స్వాగతిస్తోంది: జితేందర్‌రెడ్డి

అగ్రవర్ణాల పేదల కోసం 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన ఈబీసీ బిల్లును స్వాగతిస్తున్నామని టీఆర్ఎస్ ఎంపీ జితేందర్రెడ్డి అన్నారు. చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈ బిల్లును సీఎం కేసీఆర్ పూర్తిగా స్వాగతిస్తున్నారని అన్నారు. సమ్మిళిత వృద్ధి, బలమైన సమాజ నిర్మాణం కోసం జరిగే... ప్రతి ప్రయత్నాన్ని టీఆర్ఎస్ స్వాగతిస్తుందని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు సరైన మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడమే ఆర్థిక వెనుకబాటుకు ప్రధాన కారణమన్నారు. సమాజంలో వెనుకబాటు తనానికి ప్రభుత్వాలే కారణమని జితేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాల వైఫల్యం వల్లే ఆర్థిక వెనుకబాటు అనే సమస్య వచ్చిందన్నారు. ఇప్పటి వరకు ఉన్న ఏ ప్రభుత్వం కూడా.. సామాన్యుడి గురించి ఆలోచించలేదన్నారు. ఆలస్యమైనా అగ్రవర్ణ పేదలకు న్యాయం జరుగుతుందని జితేందర్రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపీలో 8 శాతంగా ఉన్న ముస్లిం జనాభా తెలంగాణలో ఇప్పుడు 12 శాతానికి చేరిందని తెలిపారు. 10 శాతం రిజర్వేషన్లతో వారి సమస్య పరిష్కారం కాదన్నారు. అందుకే తమ ప్రభుత్వం ముస్లింల రిజర్వేషన్లను.. 12 శాతానికి, ఎస్టీల రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిందని జితేందర్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు ఉన్నాయన్న ఆయన తెలంగాణ అసెంబ్లీ ఆమోదించాక కూడా దీనికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపలేదని విమర్శించారు. రిజర్వేషన్లు రాష్ట్రాల పరిధిలోనే ఉండాలని చాలా కాలంగా తమ పార్టీ డిమాండ్ చేస్తోందని గుర్తు చేశారు. ఈబీసీ రిజర్వేషన్ల బిల్లుకు సవరణలు ప్రతిపాదిస్తూ మద్దతిస్తున్నట్లు జితేందర్ రెడ్డి ప్రకటించారు.

పౌరసత్వ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



(మొదటి పేజీ తరువాయి) మైనార్టీలు తీవ్ర హింసను ఎదుర్కొంటున్నారు. వారంతా ఆశ్రయం కోసం భారత్ వైపు చూస్తున్నారు. అలాంటి వారి కోసం ఈ సవరణ బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇటీవలి కాలంలో ఇది వివాదాలకు దారితీసింది. దీనిపై అసత్య ప్రచారాలు జరుగుతున్నాయి. పౌరసత్వ సవరణ బిల్లు కేవలం అసోం రాష్ట్రం కోసం కాదు. పొరుగు దేశాల నుంచి భారత్‌కు వచ్చే శరణార్థుల ఒదరి కోసం. పశ్చిమ సరిహద్దుల నుంచి కూడా చాలా మంది శరణార్థులు రాజస్థాన్, పంజాబ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు వస్తున్నారు. ఆ మూడు దేశాల నుంచి భారత్‌కు వచ్చే హిందువులు, జైనులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్శీలకు భారత పౌరసత్వం కల్పించడం కోసమే ఈ బిల్లును తీసుకొచ్చాం' అని ఆయన తెలిపారు.

విపక్షాల అభ్యంతరం

కాగా ఈ బిల్లుపై పలు విపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. చాలా రాష్ట్రాలు ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయని, సవరణ వల్ల అసోంలో పెద్ద ఎత్తున అల్లర్లు జరుగుతాయని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. దీనిని ఎంపిక కమిటీకి పంపించాలని ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. అయితే స్పీకర్ సుమిత్రా మహజన్ నిరాకరించారు. దీంతో ప్రభుత్వం తీరును నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. తృణమూల్ కాంగ్రెస్ కూడా ఈ బిల్లుపై అభ్యంతరం వ్యక్తం చేసింది. బిల్లు ఆమోదం పొందితే ఈశాన్య రాష్ట్రాలు, ముఖ్యంగా అసోం భగ్గుమంటాయని తృణమూల్ ఎంపీ సౌగతారాయ్ హెచ్చరించారు. ఇది ప్రజలను విభజించే బిల్లు అని, రాజ్యాంగ మౌలిక లక్షణాలకు వ్యతిరేకమని చర్చ సందర్భంగా ఆయన అన్నారు. అయితే దీనిపై రాజ్‌నాథ్ సింగ్ స్పందిస్తూ, ప్రతిపాదిక చట్టం అసోంకు మాత్రమే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకూ, కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తిస్తుందని చెప్పారు. ఈ బిల్లుతో దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా లబ్ధిదారులు నివసించేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. కాగా ఈ బిల్లును 2016లో లోక్‌సభలో ప్రవేశపెట్టి ఆ తర్వాత జేపీసీకి పంపగా సోమవారం నివేదిక అందజేసింది. దీంతో జేపీసీ సిఫారసుల మేరకు తాజా ఈ బిల్లును మంగళవారం లోక్‌సభలో కేంద్రం ప్రవేశపెట్టింది. చర్చ అనంతరం విపక్షాల ఆందోళనల మధ్య ఈ బిల్లు ఆమోదం పొందింది. మరోవైపు పౌరసత్వ సవరణ బిల్లుపై ఇప్పటికే అసోంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి.

అలోక్ వర్మకు మళ్లీ సీబీఐ బాధ్యతలు




(మొదటి పేజీ తరువాయి) ఆరోపణలు ఉన్నందున హైపవర్ కమిటీ విచారణ పూర్తి అయ్యే వరకు ఆయన ఎలాంటి విధాన పరమైన నిర్ణయాలు తీసుకోకూడదని సుప్రీం పేర్కొంది. కమిటీ విచారణ పూర్తి అయ్యి నివేదికను అందించిన తరువాతనే ఆయన విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటారని ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు నియామకాన్ని సుప్రీం కోర్టు పక్కన పెట్టింది. కాగా సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ పదవీ కాలం ఈ నెల 31తో ముగియనుంది.

సుప్రీంకోర్టు ఆదేశాలు పాటిస్తాం: అరుణ్ జైట్లీ

సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మకు తిరిగి బాధ్యతలు అప్పగించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పందించారు. న్యాయస్థానం ఆదేశాలను ప్రభుత్వం పాటిస్తుందని ఆయన అన్నారు. కేంద్ర విజిలెన్స్ కమిషన్(సీవీసీ) సిఫార్సు మేరకే సీబీఐలో టాప్ ఇద్దరు ఉన్నతాధికారులను సెలవులపై పంపాలనే నిర్ణయం తీసుకున్నామని జైట్లీ పేర్కొన్నారు. సీబీఐ విశ్వసనీయత, నిష్పాక్షిక విచారణను కొనసాగించే క్రమంలో దర్యాప్తు సంస్థ విస్తృత ప్రయోజనాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని వ్యవహరించిందన్నారు. 'ఏ ఒక్క వ్యక్తికీ ప్రభుత్వం అనుకూలంగా ఉండదు. సీబీఐలో టాప్ 2 అధికారులిద్దరూ పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. దీంతో సంస్థ సమగ్రత, విశ్వసనీయతను కాపాడేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సీవీసీ సిఫార్సులు తీసుకున్న తర్వాతే సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ, ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానాను సెలవుపై పంపించింది. కోర్టు తీర్పుపై వారం రోజుల్లో ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటాం' అని అరుణ్ జైట్లీ తెలిపారు.

సుప్రీం తీర్పు.. ప్రభుత్వానికి చెంపపెట్టు: విపక్షాలు

కాగా సీబీఐ వ్యవహారంలో కేంద్రం నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టడంపై విపక్షాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రధాని మోదీ తీసుకున్న తప్పుడు నిర్ణయాలను సుప్రీం పక్కన పెట్టిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్దీప్ సుర్జేవాలా ట్వీట్ చేశారు. ప్రధాని అక్రమ ఆదేశాలు ఇచ్చారని, సుప్రీంకోర్టు వాటిని పక్కన పెడుతూ ఇలా నిర్ణయం తీసుకోవడం మోదీ విషయంలోనే జరిగిందని, ఇలా జరిగిన తొలి ప్రధాని ఆయనేనని విమర్శించారు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి కానీ.. సంస్థల సమగ్రతను కోర్టు కాపాడిందనే విషయాన్ని మోదీ గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. ' మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బలోపేతం చేసేందుకు ఇది ఒక గుణపాఠం కావాలి. మీరు ఎంత ఎదురులేని వ్యక్తి అయినప్పటికీ చట్టం దానికి ముగింపు పలికింది' అని మోదీని ఉద్దేశించి సుర్జేవాలా విమర్శలు చేశారు. సుప్రీం కోర్టు తీర్పు కేంద్ర ప్రభుత్వానికి చెంప పెట్టు అని రాష్ట్రీయ జనతా దళ్ ఎంపీ మనోజ్ ఝా పార్లమెంటు ఎదుట విలేకరులతో అన్నారు. కోర్టు తీర్పు ప్రధాని మోదీపై ప్రత్యక్ష నేరారోపణ అని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దేశంలోని ప్రజాస్వామ్యాన్ని, సంస్థలను దెబ్బతీసిందని అన్నారు. రఫేల్ ఒప్పందంపై విచారణను ఆపేందుకు సీబీఐ డైరెక్టర్‌ను రాత్రికి రాత్రి తప్పిస్తారా అంటూ ట్విటర్లో ప్రశ్నించారు. కాగా అలోక్ వర్మకు సుప్రీం తీర్పు పాక్షిక విజయం అని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వెల్లడించారు.



భాష్యం విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిజాంపేట్ బ్రాంచి నందు ఫుడ్ కార్నివాల్ నిర్వహించబడినది. దీనికి సీఈఓ చైతన్య, జడ్ఈఓ శిరీష, స్కూల్ ప్రిన్సిపల్ బి.శ్రీదేవి పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలవల్ల పిల్లల్లో ఆహార అలవాట్ల పట్ల అవగాహన పెరుగుతుంది అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శబరిమల యాత్ర ప్రారంభం

విజయక్రాంతి, అంబర్‌పేట్: జయంతీశ్వర్ అయ్యప్ప సేవా సంఘం, సీతాఫల్‌మండి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల శబరిమల యాత్ర కాచిగూడ తుల్జాభవన్ నుంచి ప్రారంభమైంది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప స్వాములు తుల్జాభవన్‌లో విష్ణు తోబుల గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అయ్యప్పస్వాముల భక్తి గీతాలు, అయ్యప్పస్వామి మహాపడిపూజ కార్యక్రమం అందరిని ఎంతగానో ఆకట్టుకుంది. పూజా అనంతరం తుల్జాభవన్ నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్ వరకు అయ్యప్పస్వామి పల్లకి సేవను మంగళహారతులతో ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వాములతో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జవంతీశ్వర్ అయ్యప్ప సేవా సంఘం చైర్మన్ డి.రంగారావు, అధ్యక్షుడు కెవెన్‌సీ బోస్, ప్రధానకార్యదర్శి ఎస్.ప్రేమ్‌కుమార్, ప్రదీప్‌నాయుడు గురుస్వామి, విజయ్‌కుమార్ గురుస్వామి, యాదగిరి గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.



క్షత్రియ రాజ్‌పుత్ ట్రస్ట్‌బోర్డు 2019 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన హోంమంత్రి

విజయక్రాంతి, అంబర్‌పేట్: క్షత్రియ రాజ్‌పుత్ ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన మహారాణా ప్రతాప్ 2019 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం హోంమంత్రి మహ్మమూద్ ఆలీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ రాజ్‌పుత్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అజీత్‌సింగ్, కార్యదర్శి మోహన్‌సింగ్, పి.శ్రీదేవి, హరిసింగ్, ట్రస్టీస్ టీకారాం సింగ్, హేమంత్, బంధువ తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్‌లో ఎల్ఐసీ స్టాల్ ప్రారంభం



హైదరాబాద్ 'నుమాయిష్' ఎగ్జిబిషన్‌లో మంగళవారం ఎల్ఐసి ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. సౌత్ సెంట్రల్ జోన్ రీజినల్ మేనేజర్ ఎం.జగన్నాథ్ దీనిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పాలసీలకు సంబంధించి పూర్తి వివరాలను స్టాల్‌లో సంప్రదించి తెలుసుకోవచ్చు.

మేడ్చల్ జిల్లా మేరు సంఘం నూతన సంవత్సర క్యాలెండరు ఆవిష్కరణ

విజయక్రాంతి, ఉప్పల్: మేడ్చల్ జిల్లా 2019 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణకు తెలంగాణ మేరుసంఘం 1059/1977 ఆశీస్సులతో మేడ్చల్ జిల్లా మేరు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ ,హెచ్‌బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ,జిహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గొల్లూరి అంజయ్య, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మేడ్చల్ జిల్లా మేరు సంఘం అధ్యక్షులు రామగిరియాదగిరిమేరు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మేరు కులానికి మేరు ఫెడరేషన్ తీసుక రావడానికి టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జోగురామన్నల దృష్టికి తీసికెళ్ళినానని త్వరలోనే ఫెడరేషన్ ఏర్పాటుకు సన్నాహాలు జురుగుతాయని అయన తెలిపారు. మేరు కులానికి అన్ని విదాలుగా ఆదుకుంటానని, ఎంబీసీ కార్పొరేషన్ నుండి రుణాలు ఇప్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మేరు సంఘం అధ్యక్షులు కాటారం కృష్ణ, పొడిశెట్టి నర్సింహ, రావి పాపన్న, డీకొండ నర్సింహారావు, శీలం కోటి, కె.బాయక్క, దేవేందర్, నరేష్, నారాయణ, గజునిని, జిల్లా, మండల, జోనల్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమన్వయంతో సమస్యలు పరిష్కారించాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

విజయక్రాంతి, అంబర్‌పేట్: నూతనంగా పైప్‌లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం అధికారులను అదేశించారు. నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవిరమేష్‌లతో కలిసి ఆయన డివిజన్‌లో పాదయాత్ర చేసి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాదయాత్రలో గుర్తించిన సమస్యలను అని విభాగల అధికారులు సమనవయంతో పరిష్కారించేందుకు కృషి చేయాలని అధికారులను కోరారు. రత్నానగర్ నాలా రిటార్నింగ్ వాల్ నిర్మాణంపై బస్తీ వాసులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ 16 డిఎంసీ క్రిష్ణయ్య, ఈఈ నిత్యానందం, ఏఎంఓహెచ్ హేమలత, డీఈఈ సుధాకర్, ఏఈ ఉపేంద్ర, ఎస్ఎస్‌లు ప్రాతప్‌సేన్, నవీన్, జలమండలి అధికారులు మహేందర్‌రెడ్డి, శాకిర్, సత్యానారయణ, టీఆర్ఎస్ నాయకులు గరిగంటి రమేష్, దన్‌రాజ్‌యాదవ్, బాగవాన్, రాజుగౌడ్, మురళి కృష్ణ, మహేందర్‌యాదవ్, లాలయ్యగౌడ్, రాముయాదవ్, దాడిగేజగన్‌యాదవ్, ఆర్.కె.బాబు, ప్రశాంత్, నిరంజన్, ఈశ్వర్, జాహీర్‌పాషా, బుచ్చిరెడ్డి, షఫి, బి.ఈశ్వర్‌యాదవ్, కె.అరవింద్, జె.శ్రీనివాస్, బాబు, పి.సంతోష్‌కుమార్, ఎ.అనీల్‌కుమార్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డెక్కిన కార్మిక, ఉద్యోగ సంఘాలు

విజయక్రాంతి, ఉప్పల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక సమస్యలు విస్మరిస్తుందంటూ రెండు రోజుల దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె తలపెట్టిన పది జాతీయ కార్మిక, ఉద్యోగ సంఘాల, ప్రభుత్వ రంగ సంస్థలు ఐక్యంగా సమ్మెను చేపట్టిన నిరసన జ్వాలలు రోడ్డెక్కాయి. ఉప్పల్లో కార్మిక చట్టాల నిర్వీర్యాన్ని వ్యతిరేకిస్తూ ఉప్పల్, కాప్రా సర్కిళ్లలోని పారిశ్రామిక వాడల్లో కార్మికులు నాయకులు స్కూటర్ ర్యాలీ నిర్వహిస్తూ కంపెనీలను బంద్ చేయించారు. సిఐటియు, ఎఐటియుసి, టీఆర్ఎస్‌కెవి ఆటో యూనియన్‌లు, నేషనల్ కోఆర్డినేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్‌లు, మధ్యాహ్న భోజన కార్మికులు ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొని కమలానగర్ సీపీఎం కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి ఈసిఎల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కార్యదర్శి పాలడుగు భాస్కర్, సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నిర్మల హాజరయ్యారు. ఈ నిరసన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా సిఐటియు కార్యవర్గ సభ్యుడు ఉన్నికృష్ణ, నాయకులు కోమటి రవి, వెంకన్న,శ్రీనివాస్, వినోద్, మూశ్యం వెంకటేష్, రాం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల కబ్జాలపై అధికారుల స్పందన

- పల్లె చెరువులో పూడ్చిన మట్టి, బండరాళ్లను తొలగించే చర్యలు చేపట్టిన అధికారులు

విజయక్రాంతి, రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి పల్లెచెరువు అక్రమాలపై రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకోనేందుకు రంగంలోకి దిగారు. మంగళవారం విజయక్రాంతి దినపత్రికలో ప్రచురితమైన " రాజేంద్రనగర్‌లో జోరుగా చెరువుల కబ్జాలు " అనే వార్త కథనానికి రెవిన్యూ అధికారులు స్పంధించారు. పల్లె చెరువులో కబ్జాదారులు పోసిన మట్టి, బండరాళ్లను జేసీబీ సహాయంతో తీసివేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారులు ఎన్నికల విధుల్లో బీజీగా ఉండటంతో కబ్జాదారులు ఇదే అదునుగా బావించి ఇష్టారాజ్యాంగా చెరువులను కబ్జాలకు పాల్పడ్డారు. ఒక పల్లెచెరువే కాదు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లోని చెరువులను సైతం కబ్జాదారులు రాజకీయ నాయకుల అండదండలతో పాటు కొందరు అవినీతి అధికారుల సహకారంతో కోట్ల విలువైన చెరువులు, కుంటలు కబ్జాదారుల పాలయ్యాయి. అదే విధంగా నియోజకవర్గం పరిధిలోని అన్ని చెరువులు, కుంటలు, వరదనీటి కాలువలను కబ్జాల నుంచి కాపాడి రెవిన్యూ రికార్డుల ప్రకారం కంచెలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. ప్రధానంగా భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో ప్రత్యేక కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పంధించకపోతే చారిత్రాత్మకమైన చెరువులు, కుంటలు, వరదనీటి కాలువలు కనుమరుగయ్యే ప్రమాదాలు పొంచి ఉన్నాయి.



విజయక్రాంతి ఎఫెక్ట్

చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేస్తే కఠిన చర్యలు తీసుకొంటాం: ఎస్.రాములు, తహసీల్దార్

ప్రభుత్వ భూములు, చెరువుల, కుంటలు, వరద నీటి కాలువలు ఎవరు కబ్జాలు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాజేంద్రనగర్ తహసీల్దార్ ఎస్.రాములు తెలిపారు. మైలార్‌దేవ్ పల్లి పల్లెచెరువులో కబ్జాదారులు వేసిన మట్టి, బండరాళ్లను జేసీబీ సహాయంతో తీసివేస్తున్నామన్నారు. అదే విధంగా చెరువుకు ఆనుకొని అక్రమంగా నిర్మించే భవన నిర్మాణ పనులను నిలిపివేయటం జరిగిందన్నారు.

ఫార్మసిస్టు గ్రేడ్–2 ఉద్యోగ అభ్యర్థుల ధర్నా

విజయక్రాంతి, మెహిదీపట్నం: ఫార్మసిస్టు గ్రేడ్–2 ఉద్యోగాల భర్తిలో అన్యాయం జరిగిందంటూ ఫార్మాసిస్ట్‌లు టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. టీఎస్‌పీఎస్సీ ఫార్మసిస్టు గ్రేడ్–2 రాత పరీక్షలో మెదటి మెరిట్ లిస్టు 31.12.2018 విడుదల చేశారని తరువాత మరో రెండు లిస్టులు విడుదల చేశారని ఈ లిస్టులపై చాలా సందేహలున్నాయని తెలిపారు. కనీస అర్హత మార్కులు సాధించని అభ్యర్థులకు వెయిటేజీ కలిపి అర్హత సాధించినట్లు ప్రకటించారని వాపోయారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు అనుగుణంగా వెయిటేజీ లిస్టు తయారు చేశారని దీంతో నాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

జీవన స్థితిగతిని తెలుసుకునేందుకే కమిషన్ ఏర్పాటు..

విజయక్రాంతి, మెహిదీపట్నం: తెలంగాణా రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ మంగళవారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. తెలంగాణా ఏర్పడిన తరువాత 119 వెనుకబడిన కులాల వాస్తవ జీవన స్థితిగతుల గురించి తెలుసుకోవడానికి తెలంగాణా రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటు చేశామని చెర్మెన్ బి.ఎస్.రాములు, సభ్యులు డా.వకుళాభరణం కృష్ణ మెహన్, డా.అంజనేయులు గౌడ్, జూలూరి గౌరిశంకర్‌లు తెలిపారు. వీరికి ఉపకులపతి ఆచార్య ఎస్వీ.సత్యనారాయణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మెన్ బి.ఎస్ రాములు మాట్లాడుతూ 31 జిల్లాల లోని 97 ప్రభుత్వ సంస్థల నుంచి బీసీ ఉద్యోగుల వివరాలు సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయ బీసీ ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వంతోనే వివక్షకు చరమగీతం

- బీజేపీ అధ్యక్షుడు కే లక్ష్మణ్

విజయక్రాంతి, హైదరాబాద్: అన్ని వర్గాలకు సామాజిక, ఆర్థిక సమానత్వం కలిగినప్పుడే వివక్షకు చరమగీతం పాడగలమని బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ తెలిపారు. అందుకోసమే మోడీ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సామాజిక, ఆర్థిక సమానత్వంలో భాగంగానే ఓబీసీలకు వర్గీకరణ సాధించే దిశలో తమ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. ఇప్పుడు ఈబీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తోందని తెలిపారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈబీసీలకు రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ సహ ఇతర పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. గుజరాత్‌లో పటేళ్లకు రిజర్వేషన్ల కోసం జరిగిన ఆందోళనకు మద్దతిచ్చిన ఈ పార్టీలు ఇప్పుడు మాట మారుస్తున్నాయన్నారు. ఈబీసీలపై అంత ప్రేముంటే కాంగ్రెస్ ఎందుకు చేయలేదని నిలదీశారు. రిజర్వేషన్లను కల్పించడం వల్ల బలహీనవర్గాల్లకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారావు

విజయక్రాంతి, బోడుప్పల్: కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడంలో కార్మికులందరూ ఐక్యంగా ముందుకు సాగాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ రాజారావు అన్నారు. మంగళవారం నాడు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మేడిపల్లి మండల కేంద్రంగా జరిగిన కార్మికుల ర్యాలీలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాజారావు మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తొలినాటి నుంచి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. కార్మికులు అందరూ ఈ సమ్మెలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.భాస్కర్, నాయకురాలు నిర్మల, మేడిపల్లి మండల కార్యదర్శి ఎన్. సృజన, మైసగల్ల బాల్‌నర్సింహ్మా, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



ఫేస్‌బుక్ ఖాతా లేకపోయినా ...

ఫేస్‌బుక్ ఖాతా లేదు కాబట్టి తమ వివరాలేవీ ఇతరులకు తెలియన్న ధీమాలో ఉన్న వారికి ఇది చేదు కబురే. మీకు ఫేస్‌బుక్ ఖాతా లేకపోయినా, మీ ఆండ్రాయిడ్ ఫోన్లో వాడే ఇతర యాప్‌ల ద్వారా మీ వివరాలన్నీ ఆటోమేటిక్‌గా ఫేస్‌బుక్‌కు వెళ్లిపోతాయని బ్రిటన్‌కు చెందిన ప్రైవసీ ఇంటర్నేషనల్ అనే స్వచ్ఛంద సంస్థ వెల్లడించింది. సాధారణంగా ఆండ్రాయిడ్ ఫోన్ వాడే వారు అనేక యాప్‌లను వినియోగిస్తుంటారు. వాళ్లు ఏ యాప్‌ను ఓపెన్ చేసినా వారి సమాచారం అంతా ఆటోమేటిక్‌గా ఫేస్‌బుక్‌కు చేరిపోతోందని ఈ అధ్యయనంలో తేలింది. ఫేస్‌బుక్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కిట్ (ఎస్డీకే) ద్వారా ఈ యాప్ డెవలపర్లు యూజర్ల సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకుంటున్నారు. గతేడాది ఆగస్టు, డిసెంబర్ నెలల మధ్య కోటి నుంచి 50 కోట్ల మంది వినియోగదారులు వాడుతున్న 34 యాప్‌లను పరిశీలించిన అనంతరం ప్రైవసీ ఇంటర్నేషనల్ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఈ జాబితాలో డ్యుయోలింగో, ట్రిప్ అడ్వైజర్, ఇన్‌డీడ్, స్కైస్కానర్ వంటి యాప్‌లు ఉన్నాయి. ఈ యాప్‌లు ప్రధానంగా ఎలాంటి సమాచారాన్ని ఫేస్‌బుక్‌కు అందజేస్తున్నాయో కూడా ఈ సంస్థ విశ్లేషించింది. 61 శాతం యాప్‌లను వినియోగదారులు ఓపెన్ చేయగానే వారి సమాచారం ఫేస్‌బుక్‌కు చేరిపోతోందని తెలిపింది.

ఈ యాప్స్ పంపిన సమాచారాన్ని గూగుల్ అడ్వర్టైజింగ్ ఐడీ ద్వారా ఇతరులు పంచుకుంటున్నారని వెల్లడించింది. ఈ సమాచారం ఆధారంగా ప్రకటనకర్తలు యూజర్ల ప్రొఫైల్స్ రూపొందించి వారికి అనుకూలమైన, ఆసక్తి కలిగించే ప్రకటనలు ఇస్తున్నారని పేర్కొంది. వినియోగదారుల సమాచారాన్ని కంపెనీలు పంచుకోవడమన్నది చాలా మామూలు విషయమని ప్రైవసీ ఇంటర్నేషనల్ నివేదికపై ఫేస్‌బుక్ స్పందిస్తూ తెలిపింది. దీనివల్ల వినియోగదారులతో పాటు కంపెనీలకు కూడా లాభం చేకూరుతుందని వెల్లడించింది.

భళా టీమిండియా భళా!!

ఒక పెద్దన్నయ్య, ఓ చిన్నారి తమ్ముడూ ఆడుకుంటుంటే, అన్నయ్య బావిలో పడిపోయాడట. సాయం చేసేందుకు ఏవరూ లేరు. దాంతో బుజ్జి తమ్ముడే తాడు వేసి అన్నయ్యను పైకి లాగాడట. ఆ తరువాత ఊళ్లోకి వెళ్లి జరిగింది చెబితే... 'నీ అంత చిన్న పిల్లాడు ఇంత పెద్దవాడికి పైకి లాగడమేమిటి? నువ్వు అలా చేయలేవు!' అని అంతా అన్నారట. ఆఖరికి ఓ ముస్సలాయన మాత్రం 'వీడు పైకి లాగే ఉంటాడు.' అన్నాడట. 'అదెలా సాధ్యం' అని అంతా అడిగారట. దానికాయన తాపీగా...' వీడికి తాను చిన్న పిల్లాడినని, తాను పెద్దవాడిని పైకి లాగలేనని, అది అసాధ్యమని తెలియదు కాబట్టి' అన్నాడట.

సరిగ్గా విరాట్ కోహ్లీ కూడా అలాంటి వాడే. అతనికి అసాధ్యం అంటే తెలియదు. అతని సారథ్యంలో ఆటాడే ఇండియన్ క్రికెట్ జట్టుకి బాల్ టాంపరింగ్‌కి బాబులు, స్లెడ్జింగ్‌కి తాతలు, ఫాస్ట్ బౌలింగ్‌కి ముత్తాతలు అయిన ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోవాలని తెలియదు. అందుకే 71 ఏళ్లుగా అసాధ్యం అనుకున్న దాన్ని అవలీలగా సుసాధ్యం చేసేశారు. వానదేవుడు ఆస్ట్రేలియన్ టీమ్‌లో పన్నెండో ఆటగాడుగా రంగంలోకి దిగకపోతే ఇది 3–1తో గెలవాల్సిన సిరీస్. నీళ్లలో మొసలికుండే బలమే సొంతగడ్డపై ఆస్ట్రేలియాకూ ఉంటుంది. అందుకే సొంత గడ్డమీద ఆస్ట్రేలియా బీ టీమ్ ను కూడా కొట్టడం అంత సులువేం కాదు. కంగారూలను కంగారూల నేలలో కంగారెత్తించడం మామూలు సంగతి కాదు.

1947–48 లో లాలా అమర్ నాథ్ నాయకత్వంలో గెలిచిన తరువాత భారత్ మళ్లీ ఆస్ట్రేలియాపై సిరీస్ విజయం సాధించలేకపోయింది. ఆ తరువాత మూడు సార్లు మనం గెలుపునకు చాలా చేరువగా వచ్చాం. 1977–78 లో ఆస్ట్రేలియన్ దిగ్గజాలు డెన్నిస్ లిల్లీ, చాపెల్ సోదరులు కెర్రీ ప్యాకర్ సిరీస్‌లో ఆడేందుకు వెళ్లిపోగా చివరికి 41 ఏళ్ల బాబీ సింప్సన్ ఆస్ట్రేలియన్లకు క్యాప్టెన్‌గా వ్యవహ రించాల్సి వచ్చింది. అప్పుడు మన టీమ్‌లో బిషన్ సింగ్ బేదీ, గవాస్కర్, గుండప్ప విశ్వనాథ్, ప్రసన్న, చంద్రశేఖర్ వంటి మహారథులు ఉన్నారు. అయినా మనం 3–2 తో ఓడి వచ్చాం. తరువాత 1985–86లో గెలుపునకు చాలా చేరువగా వచ్చాం. కానీ అంపైర్లు ఆస్ట్రేలియన్ 'బ్యాగీ గ్రీన్' క్యాప్‌ను పెట్టుకోకుండానే మనతో ఆటాడేసుకున్నారు. ఫలితంగా సిరీస్ 0–0 తో సమం అయింది. 2003–04 లోనూ మనకు గెలుపు ద్రాక్ష అందినట్టే అంది అందకుండా పోయింది. అలా 71 ఏళ్లుగా ఆస్ట్రేలియా గడ్డపై భారత్ సిరీస్ గెలుపు ఆకాశకుసుమంలాగానే మిగిలిపోయింది. ఇన్నాళ్లకు ఓటమి తెలియని విరాట్ కోహ్లీ, ఆయన జట్టు దేశాన్ని గెలిపించారు.

ఆసీస్ గడ్డపై సిరీస్ గెలిచిన తొలి ఏషియన్ క్యాప్టెన్ గా విరాట్ కోహ్లీ ఇప్పుడు క్రికెట్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో నిలిచాడు. 1988 తరువాత తొలిసారి ఆస్ట్రేలియా సొంత గడ్డపై ఫాలోఆన్ ఆడాల్సి రావడమూ ఆస్ట్రేలియన్ క్రీడాభిమానులు ఖచ్చితంగా చెరిపేసుకోవాలనుకునేంత చేదు జ్ఞాపకం. బాట్స్ మెన్ల పరుగుల తుపాను, బౌలర్ల వికెట్ల వరద, ఫీల్డర్ల నైపుణ్యం బహుశః ఆస్ట్రేలియా ఇప్పట్లో మరిచిపోలేదు. తమ గడ్డపైనే తమను మేరు శిఖరాలనుంచి మట్టిగుట్టలుగా మార్చేసిన భారత క్రీడాకారుల నుంచి ఆస్ట్రేలియా పాఠాలు నేర్చుకోవాల్సిందే.

నిజానికి ఒకప్పుడు టెస్టుల్లో సీనియర్లు, పరిమిత ఓవర్ల మ్యాచిల్లో యువ కెరటాలు ఆడేవి. ఇప్పుడు ధోనీ వంటి సీనియర్లు పరిమిత ఓవర్ల ఆటను ఎంచుకుంటే, మయాంక్ అగర్వాల్, రిషభ్ పంత్, జస్ ప్రీత్ బూమ్రా, చేతేశ్వర్ పూజారాల్లాంటి యువ ఫిరంగులు ఓపికగా ఆడాల్సిన అయిదు రోజుల మ్యాచ్ ను ఆడుతున్నారు. మొత్తం మీద సీనియర్ల అనుభవం, యువకుల ఉధృతి ఇండియన్ క్రికెట్ కు కొత్త యుగాన్ని తీసుకొచ్చాయి. తరాల మార్పును భారత్ చాలా నైపుణ్యంతో సర్దుకోగలిగింది. కానీ ఆస్ట్రేలియా ఈ విషయంలో విఫలమైపోయింది. హేడెన్, గిల్ క్రిస్ట్, మెక్ గ్రాత్, పాంటింగ్ వంటి దిగ్గజాల తరువాత టీమ్‌లో కొత్త తరం, పాత తరాల సమ మేళవింపు సాధించడంలో ఆస్ట్రేలియన్ క్రికెట్ యాజమాన్యం పొరబాట్లు చేసింది. ఫలితంగా ఈ సిరీస్ ఓటమి సంభవించింది.

మొత్తం మీద కోహ్లీ ఒక పరిణిత నేతృత్వాన్ని భారత్‌కు అందించాడు. మాపటికి మహా వృక్షంలా ఎదిగేందుకు కావలసిన బీజానికి నీరు పోసి, కంచెకట్టి, పెంచి పోషించే తోటమాలి నైపుణ్యం ఈ యువ ఆటగాడిలో పుష్కలంగా ఉందని ఈ సిరీస్ నిరూపించింది. ఆట తరువాత 'మెరే దేశ్ కి ధర్తీ సోనా ఉగలే.. ఉగలే హీరే మోతీ' అనంటూ భారత ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌లో చేసిన నృత్యం రాబోయే రోజుల కాబోయే విశ్వవిజేతల రాకడకు ముందస్తు సూచన!!

భారత ఆటగాళ్లకు శుభాభినందనలు!!

వాక్కు దైవ స్వరూపం

లలితా దేవి మనలో పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అని వాక్‌రూపంలో ఉండే సరస్వతి యే. వ్యక్తం కాబోయే సృష్టికి ముందున్న బ్రహ్మమును 'పరా' అంటారు. వాక్కుగా వ్యక్తం కాబోయే శబ్ద అక్షర బ్రహ్మస్థితిలో ఉన్న 'పరా' వాక్కు రూపిణి లలితాదేవి. హృదయ కమలంలో ప్రవేశించిన 'పరా' వాక్కు యొక్క సూక్ష్మరూపమైన రెండవ స్థితిలోని వాక్కు 'పశ్యంతి'. పశ్యంతీ – వైఖరీ మధ్య మూడవ సంకేత స్థితి 'మధ్యమా'. నాల్గవ స్థితి సుస్పష్టముగా ఉచ్చరింప బడి వ్యక్తమైన వాక్కు 'వైఖరీ'. పరా–సంకల్పము, పశ్యంతి–భావము, మధ్యమా–సంకేతము, వైఖరీ–ఉచ్చారణ.


ఆకట్టుకొనేలా మాట్లాడటం ఓ కళ. ఆ మాటలను ఎప్పుడు మొదలు పెట్టాలో, ఎప్పుడు ఆపాలో తెలియటం మరీ గొప్ప కళ. ఒకరి గురించి ఒకరు మాట్లాడటం మానేసి, ఒకరితో ఒకరు మాట్లాడటం మొదలు పెడితే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి. పొగిడితే మందహాసం చేసి, తెగడితే (తిడితే) మౌనం వహించేవాడు ఉత్తముడు. ఓర్పుకు మించిన కవచం లేదు. కోపానికి మించిన శత్రువు లేదు.

కాలు జారితే వెనక్కు తీసుకోవచ్చు. మాట జారితే వెనక్కుతీసుకోలేము. నోరు మంచిదైతే ఊరు మంచి దౌతుంది. మంచిని మైకులో చెప్పాలి. చెడును చెవిలో చెప్పాలి. మాట తూటాలాగా ఉండ కూడదు. పువ్వు లాగా మృదువుగా ఉండాలి. సంతోషం పంచుకుంటే పెరుగుతుంది. దుఃఖం పంచుకుంటే తరుగుతుంది.

మాటలోనే మహత్తు ఉంది. సత్యమే చెప్పాలి కాని మృదువుగా చెప్పాలి. సప్త వ్యసనాలలో అనవసరంగా మాట్లాడటం అనేది ఒకటి. దేవుడు రెండు చెవులను ఇచ్చాడు, కాని ఒకటే నోరు ఇచ్చాడు. కనుక తక్కువ మాట్లాడాలి, ఎక్కువ వినాలి. కత్తి కంటే మాటకు పదునెక్కువ. కత్తితో నరక పడిన కొమ్మ చిగురించ వచ్చు. కాని మాటలతో గాయపడిన మనస్సు కుదుట పడిపోవటం కష్టం. సమస్త వ్యవహారాలు మాట తీరు పైనే చక్కపడటం, లేదా చెడిపోవటం జరుగుతాయి. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. మాటకు ప్రాణం సత్యం. మాట వెండి అయితే మౌనం బంగారం. మాట లను మాటలతో అడ్డుకోలేము. మౌనంతోనే అది సాధ్యం.

పురాణ గాథ – రాక్షస రాజు బలిచక్రవర్తి స్వర్గం ఆక్రమించి, ఇంద్రుడిని వెళ్ళగొట్టాడు. శ్రీహరి వామను ని అవతారంలో బలిచక్రవర్తి చేస్తున్న యజ్ఞానికి వచ్చాడు, బలిచక్రవర్తి, ఆయనను ఆహ్వానించి, నీకేది కావాలో కోరుకుంటే దానమిస్తానంటాడు. వామను డు మూడు అడుగుల నేలను దానమివ్వమని అడుగు తాడు. బలిచక్రవర్తి దానం ఇవ్వటానికి సమ్మతిస్తే, గురవు శుక్రాచార్యుడు బలిచక్రవర్తికి చెబుతాడు 'వచ్చినవాడు శ్రీ హరి, దానమిస్తే, నీ సంపదనంతా హరిస్తాడు' అని. అప్పుడు కూడా బలిచక్రవర్తి ఇచ్చిన మాట తప్పనని, మనిషి శాశ్వతం కాదు, మాటే శాశ్వతం అని చెప్పి, వామనుడు అడిగిన దానం ఇస్తాడు. అప్పుడు వామనుడు, ఇంతింతై, వటుడం తయై, ఒక పాదంతో భూమిని, రెండో పాదంతో భువిని ఆక్రమించి, మూడో పాదం ఎక్కడ పెట్టాలని అడిగితే, బలిచక్రవర్తి తన తల మీద పెట్టమంటాడు. బలిచక్రవర్తి తన భక్తుడ వటం వలన సంహరించక అతనిని పాతాళానికి తొక్కి, ఇంద్రుడికి స్వర్గం ఇస్తాడు. వాక్కు దైవ స్వరూపం, ఇచ్చిన మాట నిలపెట్టుకోవాలి. ఎట్టి పరిస్థితుల లోనైనా ఆడినమాట తప్పరాదు.





క్లిష్టమైన సమస్యలను లౌక్యంతో పరిష్కరించాలి

'కర్రవిరగనూ కూడదు, పాము చావనూ కూడదు' అనేది లౌక్యం. 'అనువు గానిచోట అధికులమనరాదు, కొండ అద్ద మందు కొంచమై ఉండదా' అన్నాడు వేమన. వితండ వాదుల వద్ద మౌనమే ఆయుధం. 'గోటితో పొయ్యే దానిని గొడ్డలి దాకా తెచ్చుకో కూడదు' అనేది లౌక్యం. పరిస్థితులను బట్టి తెలివిగా మెలగటం లౌక్యం. హోరు గాలికి నిటారుగా నిలిచిన చెట్టు విరిగి పడుతుంది. పక్కనే ఉన్న గడ్డిమొక్క హోరుగాలికి తల వంచి, తరువాత నిటారుగా నిలబడు తుంది. అదీ లౌక్యం అంటే.

క్షీరసాగర మథనం ప్రారంభం అయ్యేముందు దేవతలకు, దానవులకు మధ్య వచ్చిన సమస్యను నారధుడు లౌక్యంతో ఎలా పరిష్కరించాడో ఇప్పుడు తెలుసుకుందాం.

పురాణగాథ – క్షీరసాగర మథనం దేవేంద్రుడు పదవీ గర్వంతో, దూర్వాసుడు ఇచ్చిన పూల మాల ను ధరించకుండా, తన వాహనం ఏనుగు మీదికి విసిరి వేస్తే అది మాలను కింద వేసి తొక్కుతుంది. దూర్వాసుడు కోపించి, ఇంద్రుడిని పదవీభ్రష్టుడివి కమ్మని శపిస్తాడు. రాక్షసు లు దేవతల మీద గెలిచి, దేవతలను స్వర్గం నుంచి వెళ్ళగొడతారు. దేవతలు శ్రీమన్నారాయణుడిని వేడుకుంటే రాక్షసులను ఒప్పించి దేవతలు, రాక్షసులు కలిసి క్షీరసాగరమథనం చెయ్యమని, అప్పుడు ఉద్భవించే అమృతంలో దేవతలకు పూర్వ వైభవం వస్తుందని చెబుతాడు.

రాక్షసులకు అమృతం ఆశ చూపి దేవతలు వారిని క్షీరసాగర మథనానికి ఒప్పిస్తారు. క్షీరసాగరంలో మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకిని తాడుగా కట్టి, క్షీరసాగరాన్ని చిలకటానికి, రాక్షసులు ఒక వైపు, దేవతలు ఒక వైపు, తాడును లాగేటట్లు ఏర్పాటు చేసుకుంటారు. అయితే వాసుకి తలవైపు పట్టుకున్న వారికి వాసుకి వెడలక్కే విషం వల్ల మరణిస్తారు గనక తల వైపు పట్టుకోటానికి రాక్షసులుగాని, దేవతలు గాని ఎవరూ అంగీకరించరు. ఆ సమస్య తీర్చటానికి శ్రీహరి నారదుడిని అక్కడకు పంపిస్తాడు. నారదుడు చాకచక్యంగా ముందు దేవతలను అడిగితే మేము వాసుకి తోక వేపే పట్టుకుంటా మంటారు. అప్పుడు రాక్షసులను అడిగితే మేమే తోకవైపు పట్టుకుంటామంటారు. నారదుడు ఇది సబబు అంటాడు. దేవతలు ఖిన్నులై ఎందుకని అడిగితే, 'అధములు తోకవైపు, ఉత్తములు తలవైపు పట్టుకోవటం న్యాయమని' చెబుతాడు. అది విని రాక్షసులకు కోపం వచ్చి 'మేమే ఉత్తములం, కనక మేమే తలవైపు పట్టుకుంటాం, దేవతలు అధములు కనుక వారు తోకవైపు పట్టుకోవాలి' అంటారు. అట్లానే చెయ్యమంటాడు నారదుడు. ఆ విధంగా నారదుడు లౌక్యంతో చాకచక్యంగా సమస్య తీర్చాడు, దేవతలకు హాని జరగకుండా వాసుకి తోకవైపు దేవతలు పట్టుకునే ఏర్పాటు చేశాడు.

మందర పర్వతం సముద్రంలో కుంగి పోతుంటే శ్రీహరి కూర్మావతారమెత్తి దానిని తన వీపుపై నిలుపుతాడు. క్షీరసాగర మథనం ప్రారంభమయి మొదలు హాలాహలం వచ్చి లోకాలను దహించి వేస్తుంటే శివుడు దానిని చిన్న ముద్దగా మార్చి, అర్థాంగి అంగీకారంతో తన గొంతులో ఉంచి నీలకంఠుడైనాడు. తరువాత సురభి అనే కామధేనువు, ఐరావతం, కల్పవృక్షము, చంద్రుడు, లక్ష్మీదేవి, ధన్వంతరి మొ॥ చాలా వచ్చినవి. ఐరావతాన్ని ఇంద్రుడు, చంద్రుడిని శివుడు, లక్ష్మీదేవిని శ్రీహరి తీసుకున్నారు.

ధన్వంతరి చేతిలో అమృత కలశం ఉన్నది. దానిని దానవులు లాక్కొని వెడుతుంటే, శ్రీహరి మోహినీ అవతారం ఎత్తి వాళ్ళను మోహింపజేసి, ఆ పాత్రను తీసుకొని దానవులను రాక్షసులను రెండు వరుసలలో కూర్చుండేటట్లు చేసి, అమృతం పంచుతానని చెప్పి, ముందుగా దేవతలకు పంచుతాడు. మోసపోయిన రాక్షసులు కోపంతో దేవతల మీద యుద్ధం చేశారు. కాని అమృత ప్రభావం వల్ల దేవతలు గెలిచారు. మరణించిన దానవులను వారి గురువు శుక్రాచార్యుడు సంజీవనీ మంత్రంతో బ్రతికిస్తాడు. రాక్షసులు అమృతకలశం లాక్కోవటం అనే దుశ్చర్యకు పాలుపడటం వలన, శ్రీహరి వారికి అమృతం దక్కకుండా చేశారు.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

అనేక మంది యువకులపై దొంగ కేసులు

ఈ కేసులపై శాసనసభలో నిరసన తెలిపిన శ్రీ టి. పురుషోత్తమరావు, శ్రీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి ప్రభృతులు పోలీసులు మొట్టమొదలు ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిపై హత్యానేరం కేసు నమోదు చేయాలని శాసనసభలో గొంతెత్తి డిమాండ్ చేశారు.

జిల్లాలలో అనేకమంది యువకులపై కూడా ఇలాగే ఎన్నో దొంగ కేసులు బనాయించి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నా, వారుమాత్రం మొక్కవోని ధైర్యంతో తమ ధ్యేయసాధనకు కృషి జరుపుతున్న విషయాన్ని ఈ నాయకులు సభ దృష్టికి తెచ్చారు.

హైదరాబాదు స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి శాసన మండలికి ఏర్పడిన ఖాళీకి పోటీ చేసేందుకు సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. వెంకట రామారెడ్డి ఎంచుకొనగా ఎలాగైనా ప్రత్యేక తెలంగాణ వాడిని ఓడించాలని పాలకవర్గం నిశ్చయించుకున్నది.

వెంకట్రామారెడ్డి అనుమాయులందరినీ జైళ్ళల్లో పెట్టి అతనితో పోటీ చేస్తున్న మరొక కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ ప్రభాకరరెడ్డి విజయానికి లక్షల రూపాయలు పాలకులు ఖర్చు చేశారు. ఈ ఎన్నికలలో పి.సి.సి. ప్రభుత్వ యంత్రాంగం దివారాత్రులు నిర్విరామంగా పనిచేశాయి. అయినా శ్రీ వెంకట్రామారెడ్డి అఖండ విజయం సాధించారు. అది తమ విజయంగా భావించిన ప్రజలు శ్రీ వెంకట్రామ రెడ్డికి ఏప్రిల్ 25న అఖండ సన్మానం జరిపి, రాజధాని నగరంలో నిషేధపు ఆజ్ఞలను ధిక్కరించి గంటల తరబడి ఊరేగించి ప్రజా సమితి పట్ల తమ ప్రేమాదరణలను వెల్లడి చేశారు.

శుభాశుభాలు ఒంటరిగా జరుగవన్నట్టు, ఆనాడు తెలంగాణ ఉద్యమానికి శుభగడియ తారసిల్లినదేమో రెండవ రోజే మరొక విజయం సమకూరింది. ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం క్రింద నిర్బంధించిన శ్రీ ఆదిరాజు వెంకటేశ్వర రావు, శ్రీ మదన్ మోహన్, శ్రీ మల్లిఖార్జున్ ముగ్గురినీ విడుదల చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. విడుదలయిన వారిని, శ్రీ వెంకట్రామారెడ్డిని తెలంగాణ ప్రజాసమితి కార్యాలయం వద్ద డాక్టర్ చెన్నారెడ్డి ప్రభృతులు పూలమాలలతో అభినందించారు. తెలంగాణకు రాష్ట్ర ప్రతిపత్తి విషయంలో తన అభిప్రాయాలు ఆయన అప్పటి వరకు వెల్లడిచేయనప్పటికీ, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం దొరికితే ఆనందించే ధోరణిలో ఉన్నారు. ఆ తర్వాత రెండు మూడు రోజుల లోనే డిటెన్యులుగా ఢిల్లీ ఆదేశంపై రాష్ట్ర ప్రభుత్వమే విడుదల చేసింది.

తెలంగాణ సమస్య పరిష్కరించటంలో ముఖ్యమంత్రి అవలంభించిన కుత్సిత విధానాలను నిరసిస్తూ ఆయన మంత్రివర్గం నుండి రాజీనామా చేసిన శ్రీ కొండాలక్ష్మణ్ అప్పటికి సుమారు రెండు నెలలపాటు, రాష్ట్ర సమగ్రతను పరిరక్షించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. కేంద్ర నాయకులు కూడా ఆయన నిజాయితీని అర్థం చేసుకొనలేక పోయారు. ముఠా రాజకీయాలతో సతమతమవుతున్న కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ నిజలింగప్ప, ఆంధ్ర ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి తనకేదో ఒరగ పెట్టగలడన్న దురాశతో, హర్యానాలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో తమ అభిప్రాయాలు వెల్లడించేందుకు కూడ శ్రీ లక్ష్మణ్‌ను అనుమతించలేదు. వాస్తవానికి రాజకీయ తీర్మానంలో తెలంగాణ సమస్యను చేర్చి చర్చించాలన్న ప్రతిపాదనను మొదట కాంగ్రెస్ అంగీకరించి, శ్రీ లక్ష్మణ్‌కు దానిపై ప్రసంగించే అవకాశం ఇస్తానన్నారు.

ఉద్యమకర్తలతో ముఖాముఖి చర్చలు జరుపవలసిన ఆగత్యంపై అంతకు ముందే ప్రధానమంత్రితో ప్రముఖ పత్రికా రచయిత శ్రీ పుత్తూరు వెంకటేశ్వర రావు అనేక ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ఉన్నందున అతని గురించి హర్యానా సభలలో శ్రీమతిగాంధీ ఆంధ్ర కాంగ్రెస్ ప్రముఖ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. శ్రీపుత్తూరుగారి సహాయం తీసుకొని ప్రజాసమితి, విద్యార్థి కార్యాచరణ సంఘం నాయకులకు వారు ప్రధానితో ముఖాముఖి చర్చలు జరుపవలసిన ఆగత్యాన్ని గురించి ఒప్పించేందుకు ప్రయత్నం జరగాలని ప్రధాని కోరగా శ్రీ బి.వి. రాజు పరోక్షంగా అభిమతం నెరవేర్చేందుకు ప్రయత్నం చేశారు. మరొకవైపున ఈ ప్రతినిధులను సమావేశానికి పిలిచి చర్చించవలసిన అవసరాన్ని అంతకుముందే ప్రధానికి నచ్చజెప్పడంలో కూడా శ్రీ రాజు కృతకృత్యులయ్యారు.

సమగ్ర ఆంధ్రప్రదేశ్‌లోనే అటానమస్ రీజన్ (స్వతంత్ర ప్రతిపత్తికల ప్రాంతం)గా రూపు సంతరించుకునే అవకాశాన్ని తెలంగాణ ఉద్యమనాయకులు 1969లో జారవిడుచుకున్నారని అనిపిస్తుంది. శ్రీ వి.వి. గిరి, శ్రీ నీలం సంజీవరెడ్డి మధ్య రాష్ట్రపతి పదవికి పోటీ జరగడానికి పూర్వం ఏప్రిల్ 1969లో ప్రధానమంత్రి చర్చలకు రావలసినదిగా పుత్తూరు గారి ద్వారా ఆహ్వానించినప్పుడు ప్రజాసమితి ప్రతినిధులు ఢిల్లీ వెళ్ళి ఉంటే తెలంగాణకు 1971 ఒప్పందం వలన జరిగిన దానికంటే అధిక ప్రయోజనం జరిగి ఉండేదే మోనని ఆనాడు ప్రధానమంత్రికి సన్నిహితంగా ఉన్న ఒక అధికారి ఈ రచయితకు చెప్పారు. ఎందుకంటే, ఈ ఆహ్వానాలకు ప్రధాన కారకుడు ప్రేరకుడైన నాటి పత్రికా సంపాదకుడు శ్రీ పొత్తూరి మొదట తన సంపాదకీయాలు, ప్రధానికి ఉత్తరాల ద్వారా, ఆ తరువాత ఆమెకు తనకు జరిగిన టెలిఫోన్ సంభాషణలలో తెలంగాణకు వాస్తవంగా చాలా అన్యాయం జరిగినదని చెప్పిన మాటలతో ఆమె ఏకీభవించింది. విద్యార్థులు, ఉద్యోగులు వివిధ వర్గాల ప్రజలు ఎవరో కోరటం వలన కాక ఉద్యమంలో తమకు తామే 'స్పాన్టేనియస్' గా పాల్గొనినారనే వాస్తవాన్ని శ్రీమతి గాంధీ అంగీకరించారు.

'నేను తెలంగాణకు ముమ్మాటికి న్యాయం చేస్తాను. చర్చలకు ఆహ్వానిస్తే అనుకూలంగా స్పందిస్తారో లేదో మొదట ఉద్యమ నిర్వాహకులతో మాట్లాడి నాకు చెప్పండి' అని ప్రధాని కోరిన దరిమిలా వెంకటేశ్వర రావు సమితి నాయకులతో, విద్యార్థి నాయకులతో చర్చలు జరిపారు. ఆహ్వానాన్ని మన్నించగలమని మాట ఇచ్చిన అనంతరమే చొరవ చూపి ఉద్యమకారులను చర్చలకు పిలువవలసినదిగా శ్రీ వెంకటేశ్వర రావు ప్రధానికి చెప్పారు. శ్రీ రావుకు శ్రీ వి.బి. రాజు బాసటగా నిలిచారు. మొదటి నుండి ఉద్యమంతో సంబంధం ఉన్న ముగ్గురు పత్రికా రచయితలు శ్రీ పి. నరసింహ స్వామి, శ్రీ ప్రతాప్ కిషోర్, శ్రీ రఘువీర రావు క్రిమినల్ కేసుల నుండి అప్పటికే విడుదల అవడం వలన సమితి, విద్యార్థి సంఘం నాయకులతో సమాలోచనలు జరపడంలో శ్రీ వెంకటేశ్వర రావుకు సహాయం చేశారు. మొత్తం మీద, కొందరు విద్యార్థి నాయకులు, కొందరు సమితి నాయకులకు మే మొదటి తేదీన ప్రధానమంత్రి ఆహ్వానాలు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలోని ఒక ఉపకార్యదర్శి సంతకంతో పంపబడినవి. శ్రీ మదన్‌మోహన్, శ్రీ వెంకట్రామా రెడ్డి, శ్రీ యస్.బి.గిరి, శ్రీ జి. నారాయణరావు, శ్రీ యస్. రఘువీర రావు, శ్రీ పి. వెంకటేశ్వరరావు, శ్రీ మల్లికార్జున్, శ్రీ సి.హెచ్. వెంకటేశ్వర రావు, శ్రీ శ్రీధర్ రెడ్డి, శ్రీ పుల్లారెడ్డి, శ్రీ వజాహత్‌లకు ఈ ఆహ్వానాలు అందాయి.

ఏమైతేనేం ప్రధాని ఆహ్వానాలు అందిన అనంతరం వాటిని ప్రజాసమితి, విద్యార్థి నాయకులు తిరస్కరించడం జరిగింది. జైళ్ళలో ఉన్న వారినందరినీ మొదట విడిచిపెట్టాలనే సాకు చూపడం జరిగింది. **(సశేషం)**

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

భారతీయతను చాటుతున్న ప్రవాసులు

భారత విదేశాంగ శాఖ ఆధ్వర్యంలో న్యాయ శాస్త్ర నిపుణులు ఎల్.ఎం.సింఘ్వి అధ్యక్షతన ఏర్పడిన ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సుల మేరకు ప్రతి సంవత్సరం జనవరి 9 తేదీన ప్రవాస భారతీయుల దినోత్సవాన్ని నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. 2003లో మొదటి సారిగా ఈ దినోత్సవాన్ని నిర్వహించారు.2004లో ఢిల్లీలో, 2005లో ఈ దినోత్సవాన్ని నిర్వహించారు. విదేశాలలో నివశిస్తున్న భారతీయులైన యువకులను ఆకర్షించటం, మన దేశం గొప్ప తనం, ఔన్నత్యాన్ని ప్రపంచంలో దశ దిశలా ప్రచారం చేయటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. 9.1.1915న జాతిపిత మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి తిరిగి వచ్చారు. అందువలన ఆ తేదీని ప్రవాస్‌దివస్‌గా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. విదేశాలలో భారతీయులు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. శాస్త్రవేత్తలుగా, ఆర్థికవేత్తలుగా, రాజకీయవేత్తలుగా కీర్తి గడిస్తున్నారు. మన పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను , ఆచారవ్యవహారాలను పరిరక్షిస్తున్నారు. మన దేశ పేరు ప్రఖ్యాతలు కాపాడుతున్నారు. ప్రతి యేటా పెద్ద సంఖ్యలో యువత మన దేశం నుంచి వివిధ దేశాలకు చదువు. ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం వెళుతున్నారు. వారి సంపాదనలో కొంత మన దేశంలో వారు పుట్టిపెరిగిన స్వగ్రామాల అభివృద్ధికి కేటాయిస్తున్నారు. ఏ దేశమేగినా, ఎందుకాలిడినా, ఏ పీటమెక్కినా నిలుపరా నీ జాతి గౌరవం అంటూ రాయప్రోలు సుబ్బారావు గారు రాసిన దేశభక్తి గేయ సారాంశాన్ని అక్షరాలా నిజం చేస్తున్నారు. పేరుకు విదేశాలకు వెళ్లినా నిత్యం వారి ఆలోచనలు మన దేశం చుట్టే తిరుగుతున్నాయి. విదేశాలలో మన భారతీయులు సోదరభావంతో ఆత్మీయంగా కలిసి ఉంటున్నారు. మనమంతా ఒక్కటే, మేరా భారత్ మహాన్ అంటూ జీవిస్తున్నారు. నా దేశం నాకు ఏమి ఇచ్చింది అని కాకుండా నేను నా దేశానికి ఏ విధంగా సహాయపడుతున్నాను అనే నినాదాన్ని నిజం చేస్తున్నారు.



అమెరికా లాంటి దేశాలలో ఆటా, తానా లాంటి సభలు, సమావేశాలు నిర్వహిస్తూ కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నారు. 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అని చాటుతున్నారు.మనం కూడా మన ప్రవాస భారతీయులను గౌరవిద్దాం. వారు చేస్తున్న సేవలను అందరికీ తెలియచేద్దాం.

– కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

ఎన్నికల వేళ.. విద్యార్థుల భవితవ్యంపై ఆందోళన

అన్ని పని దినాలలో వార్షిక ప్రణాళికను అనుసరిస్తూ, పాఠ్య ప్రణాళిక సహాయంతో విద్యా బోధన చేసినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటాము. డిసెంబర్ మాసంలోనే పదవ తరగతి పాఠ్య బోధనను పూర్తి చేసి, మార్చిలోగల వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయడంలో భాగంగా ప్రభుత్వం నిర్వహించే పరీక్షలకు, పునః బోధన గావిస్తూ , అర్థంగాని విషయాలను విద్యార్థులకు నివృతి చేస్తూ ముందుకెళితేనే విద్యార్థి సమగ్ర ప్రగతికి బాటలు వేసినట్లవుతుంది. పరీక్షలు ముగిశాక, మూల్యాంకనం గావించి ఫలితాలు వెలువడటంలో ఉపాధ్యాయుల, పాఠశాల భవిష్యత్ ఇమిడి ఉంటుంది. కానీ ఈ సంవత్సరం రాష్ట్రంలో వరుస ఎన్నికలు ఉండటం, వాటి నిర్వహణ బాధ్యత ఉపాధ్యాయులపై ఉండటంతో పాఠశాలలో సమయ లేమి కారణంగా, సరైన సమయంలో పాఠ్యాంశాలు పూర్తిచేయలేక, సరైన శ్రద్ధ తీసుకోలేక విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్నాయా అంటే అవుననక తప్పదు. డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ పూర్తి చేశారు. గ్రామపంచాయతీలకు మూడు దశలలో ఈ నెల 21,25,29న ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ సర్వం సిద్ధం చేసింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికలకు జనవరి 17న నోటిఫికేషన్ ఇచ్చి ఫిబ్రవరి రెండవ వారంలో ఒకే రోజున 906 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, అదే రోజున ఓట్ల లెక్కింపు చేపట్టి, గెలుపొందిన వ్యక్తులతో కమిటీలను ప్రకటించనున్నాయి. 9 డిసిసిబిలు, 9 జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలతో పాటు టెస్కాలకు ఎన్నికలు నిర్వహించి ఫిబ్రవరి 25 నాటికీ పూర్తిచేయాలనే ప్రణాళికతో ఉన్నారు. ఆర్వో, ఏఆర్వోలుగా గెజిటెడ్ అధికారులను నియమించాలి కానీ, వారి స్థానంలో స్కూల్ అసిస్టెంట్‌లను నియమిస్తున్నారు. ఆర్వో, ఏఆర్వోలతో పాటు ఇతర పోలింగ్ సిబ్బందిగా, ఏదోరకమైన విధులను నిర్వర్తించడానికి ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. 34 గ్రామపంచాయతీలకు కలిపి ఒక క్లస్టర్ చేసి ఆర్వో, ఏఆర్వోలను నియమిస్తే వీళ్ళు తొలుత గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకొని నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, విత్ డ్రా, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు పనులు చేస్తారు. తర్వాత ఆర్వోలు ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన, ఉపసర్పంచ్ నియామకం వంటి పనులు చేయాల్సి ఉంటుంది. ఇతర సిబ్బంది పోలింగ్ కేంద్రాలలో విభిన్న విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు శిక్షణ , విధుల నిర్వహణ వంటి పనుల కోసం శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. వీటన్నిటినీ ప్రభుత్వ ఉపాధ్యాయులే నిర్వహించడం విశేషం.

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ పాఠశాలలు, అన్నీ రకాల రెసిడెన్షియల్ పాఠశాలలున్నా అందులో కేవలం ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులను ఎన్నికల నిర్వహణకు ఉపయోగించుకుంటే అందులో చదివే విద్యార్థులు ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థుల భవితవ్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలు ఫలితాల సాధనలో ఇప్పటికే అంతంత మాత్రంగా ఉంటే, ఈ ఎన్నికల వలన ఈ విద్యా సంవత్సరం ఫలితాలపై సర్వత్రా ఆందోళన నెలకొంది. ఎన్నికల నిర్వహణ తప్పనిసరి, ఎందుకంటే అభివృద్ధి అనేది పాలకులపైనే ఆధారపడి ఉంటుంది. కానీ వివిధ రకాల డిపార్టుమెంటులున్నాయి. పరిస్థితులను అర్థం చేసుకుంటూ, విద్యార్థుల పట్ల సానుకూలంగా ఆలోచించి ఎవరికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఎన్నికలను నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైన వున్నది. మిగతా ప్రభుత్వ ఉద్యోగులు సైతం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎన్నికల నిర్వహణకు ఎన్నికల కమిషన్‌కు సహకరించాలి. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనలను అర్థం చేసుకుని విద్యార్థులకు మంచి ఫలితాలు రావడంలో అందరూ భాగస్వామ్యులు కావాలి.



–డా॥ పోలం సైదులు,
9441930361

నేర చరిత్ర ఉన్న వారిపై నిఘా : ఎస్పీ

విజయక్రాంతి, మహబూబ్‌నగర్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు ఆయా గ్రామాలను సందర్శిస్తూ, నేర చరిత్ర గలవారిపై గట్టి నిఘా పెట్టాలని, అతిగా ప్రవర్తించే వ్యక్తుల గురించి వారి కుటుంబ సభ్యులకు తెలుపుతూ తగు రీతిన హెచ్చరించాలని ఎస్పీ రెమా రాజేశ్వరి పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సందర్భంలో గొడవలు సృష్టించేవారి పట్ల చట్టాలు కఠినంగా ఉంటాయని,తర్వాత బాధపడి లాభం లేదని ఎస్పీ హితువు పలికారు. పోలీసు నిఘా బృందాల సమాచారం మేరకు కొన్ని గ్రామాలలోని కొందరి వ్యక్తులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామని, అదే విధంగా తమ పోలీసు అధికారులకు ప్రజలకు సహకరిస్తారన్న నమ్మకాన్ని ఎస్పీ వెలిబుచ్చారు.

సంగారెడ్డికి వైద్యకళాశాల

- మెడికల్ కాలేజి ఏర్పాటుకు కసరత్తు!

విజయక్రాంతి, సంగారెడ్డి: సంగారెడ్డి పురోగతివైపు పరుగులు తీస్తోంది. పట్టణంలోని అంతర్భాగంగా పోతిరెడ్డిపల్లి పురోగతి వైపు పయనిస్తోంది. తప్పకుండా ఆ హామీని నెరవేరుస్తాం.. ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ, సంగారెడ్డిలో వైద్య కళాశాల ఏర్పాటుపై గత కొన్నేళ్లుగా డిమాండ్ వినిపిస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులు సైతం తాము అధికారంలోకి వస్తే వైద్య కళాశాల మంజూరు చేస్తామని హామీ ఇస్తూవస్తున్నారు. శాసనసభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు కూడా ఇదే విషయమై ప్రస్తావించాయి. అయితే రెండోసారి టీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో వైద్య కళాశాలలు మంజూరు చేయడంపై శ్రద్ధ వహిస్తుంది. అంతే కాకుండా వైద్య రంగానికి ప్రాధాన్యం ఇవ్వడంతో ఆ దిశగా కార్యచరణ ప్రారంభించింది. వైద్య కళాశాల మంజూరు అయితే జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సేవలు మరింత మెరుగు పడనున్నాయి. రాష్ట్రంలోని అయిదు జిల్లాల తో పాటు సంగారెడ్డికి వైద్య కళాశాలవచ్చే అవకాశాలపై ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

జీతాలు లేక జీవితాలు సతమతం

విజయక్రాంతి, కొల్లాపూర్: ఉన్నత చదువులు చదివి ఉద్యోగం లేక నిరుద్యోగులు ఉపాది వస్తుందని విద్యావాలంటరీగా విధులు నిర్వహిస్తున్నారు. వేలల్లో వేతనాలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగుల సరిత విధులు నిర్వహిస్తున్న విద్యావాలంటరీలు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు భోదన చేస్తున్నారు. అలాంటి వారి పరిస్థితి వేతనాలు రాక దారుణంగా తయారు అయ్యింది . జీతం వస్తే నెల మొత్తం కుటుంబ సభ్యులను పోషించుకునే పరిస్థితి ఉంది. అలాంటి సమయాల్లో వేతనాలు రాక మూడు నెలలు అవుతుందంటే వారి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అధికారులు అర్థం చేసుకోవాలి. రాష్ట్ర అధికారులు స్పందించి విద్యావాలంటరీలకు వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయి



విజయక్రాంతి, ములుగు: క్రీడలు శారీరక ధృడత్వంతోపాటు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని ములుగు శాసన సభ్యులు ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడల పోటీల కార్యక్రమానికి సీతక్క ముఖ్య అతిధిగా హాజరై బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. అంతకముందు క్రీడా కార్యక్రమంలో పాల్గొన్న యువకులను సీతక్క అభినందించారు. ఈసందర్భంగా సీతక్క మాట్లాడుతూ నేటి జీవన విధానంలో మనిషికి శారీరక వ్యాయామం తగ్గిపోతున్న రోజుల్లో క్రీడా పోటీలను ఏర్పాటుచేయడం వల్ల యువతి యువకులు, విద్యార్థుల్లో సైతం శారీరకంగా ధృఢత్వాన్ని కలిగి ఉండటానికి క్రీడలు దోహదపడుతాయని వారికి ఈసందర్భంగా సీతక్క అభినందలు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఆర్టీసి డ్రైవర్ ఎండి ఖాజా , రవిశెట్టి శారద ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సీతక్క వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నల్లెల్ల కుమారస్వామి, నాయకులు పైడాకుల అశోక్, బానోతు రవిచందర్, పల్లె జయపాల్ రెడ్డి, ఓరుగంటి మొగిళి, తిరుపతి, సంజీవ, జీవన్ రెడ్డి, కోగిల మహేష్ తదితరులు ఉన్నారు.

బ్యాంకర్లు వంద శాతం రుణాల లక్ష్యాలు సాధించాలి

విజయక్రాంతి, సూర్యాపేట: జిల్లాలోని యస్‌సి, యస్‌టి, బిసిల లబ్దిదారులకు మంజూరు చేసే రుణాలను ఏళాంటి జాప్య చేయకుండా వెంటనే గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ డి. అమయ్‌కుమార్, బ్యాంక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో సంక్షేమ శాఖల అధికారులు, బ్యాంక్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యస్‌స్సి, యస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని, ఆయా పథకాలు ప్రజలకు అందే విధంగా కృషి చేయావలసిన బాధ్యత, సంక్షేమశాఖల అధికారులు, బ్యాంకర్లదేనని ఆయన అన్నాడు. సంక్షేమ శాఖల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి రుణాలు మంజూరి చేస్తున్నప్పటికి కొంతమంది బ్యాంకర్లు రుణాలు అందించుటలో జాప్యం చేయుట వలన అనుకున్న లక్ష్యాలు సాధించుటలో వెనుకబడి పోతున్నారని ఆయన అన్నారు.

జిల్లా జడ్జీని కలిసిన ఉన్నాతాధికారులు

విజయక్రాంతి, ఆదిలాబాద్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలను స్వీకరించిన ఎంజి.ప్రియదర్శిణిని జిల్లా కలెక్టర్ దివ్యదేవరాజన్, ఎస్పీ విష్ణు ఎస్.వారియర్‌లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని తన ఛాంబర్‌లో ఆమెను కలిసిన జిల్లా ఉన్నాతాధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సాదరంగ స్వాగతం పలుకుతూ తమ శుభాకాంక్షలు తెలియజేసారు. జల్లాలోని వివిధ అభివృద్దిపనులు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకునే పలు అంశాలపై ఈ సందర్భంగా వారు చర్చించారు.

సింగరేణిలో దేశవ్యాప్త సమ్మె విఫలం

విజయక్రాంతి, రామగుండం: కార్మికుల డిమాండ్లపై జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన రెండు రోజుల దేశవ్యాప్త సమ్మె సింగరేణిలో పూర్తిగా విఫలమయ్యింది. రామగుండం సింగరేణి రీజియన్‌లోని మూడు డివిజన్లలలో ఈ దేశ వ్యాప్త సమ్మె ప్రభావం ఏ మాత్రం చూపలేదు. బొగ్గు ఉత్పత్తి యధాతధంగా జరిగింది. ఈ ప్రాంతంలోని భూగర్భ, ఉపరితల గనుల్లో కార్మికులు తమ విధులకు హాజరయ్యారు. మొదటిరోజు ఈ సమ్మె ప్రభావం లేకపోవడంతో సింగరేణి అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. రెండోరోజు సమ్మె జరుగకుండా జాగ్రతలు తీసుకుంటున్నారు. అయితే బొగ్గు ఉత్పత్తిలో కొంతమేరకు సేవలను అందించే సింగరేణిలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొన్నారు. ఇందులో ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు తదితర సంఘాల నాయకులు ఎం.నారాయణ, వేల్పుల కుమారస్వామి, ఇ.నరేశ్, ఎం.ఎ.గౌస్, మేరుగు రాజయ్య, ఎల్లా గౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, రమేష్, తోకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

విజయక్రాంతి, భద్రాచలం: విద్యార్థుల్లో దాగిన క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలక్టర్ రజత్‌కుమార్ శైనీ తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటి రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడల పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం వేదికగా స్థానిక ఐటిడిఏ ఘనమైన ఏర్పాట్లతో గిరిజన క్రీడా సంబురం నిర్వహించడం అభినందనీయం అన్నారు.. ఈ క్రీడల ప్రారంభ వేడుకలో గిరిజన సంక్షేమశాఖ డీడీ రామ్మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు పుట్టా శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికలు మాకొద్దు మహాప్రభో

విజయక్రాంతి, అచ్చంపేట: ప్రజా పరిపాలన సుగమం కావాలని, ప్రజలచేంతకు పాలన అనే ప్రధాన లక్ష్యంలో తెలంగాణ రాష్ట్ర సర్కార్ కొత్త గ్రామ పంచాయితీలను ఏర్పర్చిన విషయం విధితమే. కాగా నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో కొత్తగా వంగురోనిపల్లి, మన్ననూర్ ప్రశాంత్ కాలనీలను ఏర్పాటు చేయగా ఈ గ్రామ పంచాయితీలతో పాటు కుమ్మరోనిపల్లి, లక్ష్మాపూర్, కల్ములోనిపల్లి గ్రామ పంచాయితీల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా గిరిజనులు లేకున్నప్పటికిని, 1950 జనవరి 26 న ఏజెన్సీల విభజన సందర్భంగా ఇచ్చిన గెజిట్‌లో దోమలపెంట గ్రామం లేకున్నా కొందరు స్వార్ధంతో ఈ ఆరు గ్రామపంచాయితీలతో పాటుగా సగం వార్డులను సైతం ఎస్‌టి అభ్యర్థులకే కేటాయిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చన ఎన్నికల నోటిఫికేషన్ ను స్థానిక ప్రజలు తప్పుబడుతూ మా గ్రామ పంచాయితీల్లో ఎన్నికలు నిర్వహించవద్దని మంగళవారం స్థానిక మండల అభివృద్ధి అధికారికి, తహాశీల్దారు కు ప్రజలు, రాజకీయ నాయకులు ఏకగ్రీవ తీర్మాణం చేస్తూ తీర్మాన ప్రతులను సమర్పించారు.

పేరుకు పెద్ద.. ఊరుకు దిబ్బ

- ప్రారంభమైన బ్లడ్ బ్యాంక్.. విధులకు నోచుకోలేదు..
- ప్రసవం ప్రభుత్వ ఆసుప్రతిలో వైద్యం ప్రైవేటుల్లో



విజయక్రాంతి, యాదాద్రి: జిల్లా ఆసుపత్రిగా నియామక ఉత్తర్వులు వచ్చినప్పటికీ... వైద్య సేవలు మాత్రం ఏరియా ఆసుపత్రివే అందుతున్నాయి... బ్లడ్ బ్యాంక్ ప్రారంభమై నెలలు గడుస్తున్న నేటికి వినియోగం లేదు..ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టిన ప్రతి బిడ్డ వైద్యానికి ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించాల్సిందే. .పేరుకు పెద్ద ఊరుకు దిబ్బ అన్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర వైద్యశాల పరిస్థితి నెలకొంది..

పెద్ద ఆసుపత్రిలో...చిన్న వైద్యం

జిల్లా పునర్విభజనలో భాగంగా ఉమ్మడి నల్లగొండలోని భువనగిరి డివిజన్‌ను యాదాద్రి భువనగిరి జిల్లాగా ఏర్పాటు విషయం విదితమే..జిల్లా కేంద్రం కావడంతో ప్రజా అవసర నిమిత్తం పెద్ద ఎత్తున జిల్లా ఆఫీసులు వచ్చి చేరాయి... అందులో భాగంగానే ప్రజా వైద్యసేవల కోసం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా వైద్య కేంద్రంగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ....ఆసుపత్రి నేమ్ బోర్డు మార్చారు కాని.. వైద్య సేవలు మాత్రం ఏరియా ఆసుపత్రివే అందుతున్నాయి...అరకొర వైద్య సిబ్బందితో పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్య అందించ లేక పోతున్నమంటున్నారు వైద్యధికారులు..హైవేపై అయిన రోడ్డు ప్రమాద కేసులు సైతం ఇక్కడికే వస్తుంటాయి..ఇక్కడ జిల్లా వైద్య కేంద్ర ఆసుపత్రిలో ఉండాల్సిన ఎక్యూమెంట్స్ లేక పోవడంతో.. వైద్యం కోసం వచ్చిన వారిని హైదరాబాద్‌కు రెఫర్ చేయడం జరుగుతుంది..దీంతో ప్రయాణ మార్గ మధ్యంలో ప్రాణాలు కోల్పోయినవారు చాలానే ఉన్నారు.. కేసీఆర్ కిట్టు ప్రభావంతో గర్భిణీలు డెలివరీకి ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు... దీంతో జిల్లా ఆసుపత్రిలో రోజుకు వందల మంది ప్రసవిస్తున్నారు...చిన్న పిల్లల స్పెషలిస్టులు కొరతతో.. పసికందుల వైద్య ప్రయాణం ప్రైవేటు వైద్యం వైపు వెలుతుంది...అర్ధ రాత్రి సమయంలో నైతే వారి బాధ వర్ణనాతీతంగా ఉంటుంది..అర్ధరాత్రి పుట్టిన పాప యోగక్షేమాలు తెలుసుకోవడానికి ఇటు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు ఉండక..అటు ప్రైవేటు ఆసుపత్రిలో డాక్టర్లు లేక.... ఎమర్జెన్సీ అయితే హైదరాబాద్‌కు ఊరుకల్సిం దే..జిల్లాలో వైద్యం అరచేతిలో ప్రాణవాయువు అన్నట్లు ఉంది..

వైద్యసిబ్బంది కొరతతో... వెలవెలబోతున్న వైద్యాలయం...

జిల్లా వైద్య కేంద్రంలో ఉండాల్సిన స్పెషలిస్టు వైద్యుల కొరత..250పడకలకు గాను ప్రస్తుతం 100 పడకలతోను కాలం గడుపుతుంది...జిల్లా వైద్య కేంద్ర నామ్స్ ప్రకారం అన్ని రకాల స్పెషలిస్టు డాక్టర్లు ఉండాలి కాని ఇక్కడ మాత్రం ప్రత్యేక మైన స్పెషలిస్టులు లేరు 60 మందితో కూడా వైద్య బృంధం అవసరం ఉన్నప్పటికీ... ప్రస్తుతం 25 మంది వైద్యధికారులతో సాదసీద వైద్యసేవలు ప్రసవం, చిన్న చిన్న రోగులకు మాత్రం మే వైద్య సేవలు అందుతున్నాయి.జిల్లా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ కేంద్రం ప్రారంభించి నెలలు గడుస్తున్నప్పటికీ... వినియోగంలోకి మాత్రం రావడం లేదు... ఇక్కడి రోగులు యధావిధిగా బ్లడ్ కోసం హై దరాబాద్ ప్రాంతంలోని ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుంది...లేద వేలకు వేలు వెచ్చించి ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌ల వద్ద కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది..

వైద్య పరికరాల కోసం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం: సూపరింటెండెంట్

జిల్లా కేంద్రంలో ప్రజా వైద్య అవసరాల కోసం వైద్య పరికరాలు అందుబాటులో లేవు..ప్రభుత్వంకు నివేదిక పంపాము త్వరలోనే వస్తాయి.. జిల్లాకు మంజూరైన మాతా శిశు వైద్యశాల కోసం భూ సేకరణ జరుగుతుంది.

పేరుకు పెద్దాసుపత్రి లోపల చెత్తాసుపత్రి



విజయక్రాంతి, నల్లగొండ: నల్లగొండ జిల్లా ప్రభుత్వాస్పత్రి పేరుకే పెద్ద ఆస్పత్రికాని ప్రజలు చెత్త ఆస్పత్రిగా పిలుస్తున్నారు. జి ల్లా కేంద్రంలో ఉన్న కేంద్ర ప్రభు త్వ ఆస్పత్రి చెత్త దిబ్బలా తయా రైంది. ఆస్పత్రిలో వాడేసిన ప్లాస్టిక్ కవర్లు, గ్లూకోజ్ బాటిల్స్ అన్ని ఆస్పత్రిలోని బహిరంగ ప్రదేశాల్లో పడేయడంతో డంపింగ్ యార్డ్‌లా తలపిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్ ప్రవేశ పెట్టిన తరువాత సామాన్య ప్రజానీకం మారుమూల పల్లెల నుండి జిల్లా కేంద్ర ఆస్పత్రికి రావడంతో ఎప్పుడు చూసినా జనంతో కిక్కిరిసి పోతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లలకు మాతా శిశు సంరక్షణ కేంద్రం నూతన భవనాన్ని నిర్మించి ఆధునిక వసతులు కల్పించడంతో పేద ప్రజలు సుదూర ప్రాంతాల నుండి డెలివరికి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్నారు. ఈ మధ్యనే స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపా ల్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి ప్రతి వార్డులో ఉన్న రోగులను, రోగుల సమస్యలు తెలుసుకొని వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించాలని ఆస్పత్రి ఆవరణలో ఉన్న చెత్తను తక్షణమే తరలించాలని ప్రభుత్వ డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేసినా వారి ప్రవర్తనలో మార్పు రాకపోవడం గమనార్హం, ఎక్కడ వేసిన చెత్త అక్కడే ప్రత్యక్షమవ్వడం, రోగులు, రోగి బంధువులు మాతా శిశు సంరక్షణ కేంద్రానికి వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి ఉన్నది.

మిషన్ భగీరథ పనులతో నీటికోసం ప్రజల అగచాట్లు



విజయక్రాంతి, నకిరేకల్: నియోజకవర్గంలోని చిట్యాల మున్సిపాలిటి పరిధిలో గత నాలుగు రోజులుగా మిషన్ భగీరథ పనులు ఊపందుకున్నాయి. వాడ వాడలా పనులను పూర్తి చేసేందుకు అధికారులు, కాంట్రాక్టర్లు కంకణ బద్దులై పని చేస్తున్నారు. ప్రస్తుతం విద్యానగర్, ఇందిరా నగర్, సాయి ద్వారకా పురి కాలనీ, భాగ్యనగర్ కాలనీలలో చురుకుగా పనులు కొనసాగుతున్నాయి. దీనికి ప్రజల నుండి హర్షం వ్యక్తం అవుతున్నప్పటికి ఈ పనుల కారణంగా ప్రస్తుతం సరఫరా అవుతున్న నీటి పైపులు పగిలిపోయి వీధి నల్లాలు, ఇంటింటికి సరఫరా అయ్యే నీరు సరఫరా కాక ప్రజలు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పైపుల కోసం జేసిబిలు వాడటం కారణంగా ఆపరేటర్లకు ఎక్కడ పాత పైపులు ఉన్నాయో తెలియకపోవడం కారణంగా అవి డ్యామేజ్ అవుతున్నాయి. గోతులు తీసే సమయంలో మున్సిపాలిటి నీటి విభాగానికి చెందిన మనుషులు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.పని జరుగుతున్న పలు ప్రాంతాలలో పైపులు పగిలితే అట్టి ప్రాంతాలలో నీటి సరఫరా నిలిపివేశారు తప్ప వాటిని రిపేర్ మాత్రం చేయకపోవడం శోచనీయం.

బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్‌గా కృష్ణ



విజయక్రాంతి, మిర్యాలగూడ: బీసీసంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా కర్నాటి శివరామకృష్ణను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు శిరిసినవాడ నర్సింహా, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు పోగుల సైదులుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గునగంటి వెంకన్నగౌడ్‌లు మంగళవారం నియామకపత్రం అందజేసి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 72 సంవత్సరాలు గడుస్తున్నా.బీసీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు శివరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సరికొండ రుషికేశ్వర్‌రాజు, యువజన నాయకులు గుంజ ప్రసాద్, మల్లయ్య, వెంకన్న, శ్రీను, రాజు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేసిన ఎమ్మెల్యే



విజయక్రాంతి,బోధన్: గ్రామ పంచాయతీ ఎన్నికలవేల గ్రామ సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేయటంలో స్థానిక ఎమ్మెల్యే షకీల్ బిజీ అయ్యారు .బోధన్ పట్టణానికి దగ్గరగా ఉన్న బెల్లాల్ గ్రామంలో అధికార టీఆర్ఎస్ పార్టీనుండి బుర్రి లత పేరును ఎమ్మెల్యే ఖరారు చేశారు.బోధన్‌లో ఎమ్మెల్యే ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపొందగా గ్రామ పంచాయితీ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున టీఆర్ఎస్ పార్టీ తరపున కేవలం ఒక్కరినే బరిలో దింపే ఆలోచనలో ఎమ్మెల్యే ఉన్నట్లు తెలుస్తుంది.ఇందులో భాగంగా బోధన్ పట్టణానికి ఆనుకుని ఉన్న బెల్లాల్ గ్రామ సర్పంచ్‌గా టీఆర్ఎస్ పార్టీనుంచి బుర్రి లతను ఎమ్మెల్యే ఖరారు చేశారు.ఎమ్మెల్యే ఎన్నికల్లో పనిచేసిన దానికంటే రెట్టంపు పని చేసి టీఆర్ఎస్ అభ్యర్థిని కార్యకర్తలు గెలిపించుకోవాని పిలుపునిచ్చారు.

మానవ మనుగడకు మట్టి పాత్రల వినియోగం

విజయక్రాంతి, పెద్దపల్లి: ప్లాస్టిక్ వస్తువులను నిర్మూలించి, మట్టి పాత్రల వినియోగాన్ని పెంచితేనే మానవ మనుగడ సాధ్యపడుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ వనజాదేవి పేర్కొన్నారు. పెద్దపల్లిలో మంగళవారం జిల్లాలోని కుమ్మర శాలివాహనులకు మట్టి వాటర్ బాటిల్స్ తయారిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వాహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ, ప్రస్థుతం ప్లాస్టిక్ వినియోగాన్ని ఎక్కువగా చేస్తున్నారని, అధి భూమిలో క్షయం కాదని చెప్పారు. దీనిద్వారా భవిష్యత్‌లో పర్యావరణం దెబ్బతిని మానవ మనుగడకు ఇబ్బందులు ఏర్పడతాయిని అన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించే క్రమంలో మట్టి పాత్రల తయారిని ప్రోత్సహించడం జరుగుతోందని అన్నారు. జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు హెచ్. వెంకటేశ్వరి, దామోదర్, కుమ్మర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టికే. శ్రీనివాస్, జిల్లా సంఘం భాద్యులు రావికుమార్, సతీష్, రవిందర్, మల్లేష్, లింగయ్య, సారయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పైసలివ్వందే ఫైల్ కదలదు..సబ్ రిజిస్ట్రార్ కొర్రీలు..?

- బ్రోకర్ల ద్వారా మామూళ్ల దందా..



విజయక్రాంతి,సిరిసిల్ల: సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి అడ్డగా మారింది. చేయి తడపందే ఇక్కడ ఫైల్ కదలదూ. ఒక్కో పనికి ఒక్కో రేటును నిర్ణయిస్తు సబ్ రిజిస్ట్రార్ బ్రోకర్ల ద్వారా మామూళ్లు తీసుకుంటూ రోజుకు రూ.లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నాడనే బలమైన బహిరంగ ఆరోపణలున్నాయి. అవినీతిపై ఎవరైనా కొనుగోలు దారుడు ప్రశ్నిస్తే వారి భూమి రిజిస్ట్రేషన్ పక్కకు పెట్టాల్సిందే. ఇంకా ఏమైనా ఎదురు మాట్లాడితే అనేక కొర్రీలను సాకుగా చూపి పెద్ద మొత్తంలో డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తాడని పలువురు రిజిస్ట్రేషన్ దారులు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ ఆవరణలో గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎల్లారెడ్డిపేట,గంభీరావుపేట, ముస్తాబాద్,ఇల్లంతకుంట,వీర్నపల్లి,సిరిసిల్ల మండలాల నుండి నిత్యం అనేక మంది భూముల క్రయ,విక్రయాల రిజిస్ట్రేషన్ల కోసం ఇక్కడి వస్తుంటారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 3.30 వరకు రిజిస్ట్రేషన్ ఫైల్లను అధికారి వద్దకు అనుమతిస్తారు. కార్యాలయానికి అరకిలోమీటర్ల దూరంలో ఈ దస్తావేజులు ఉండాల్సి ఉండగా ఇక్కడ కార్యాలయాన్ని ఆనుకొనే కనిపిస్తారు. ఒక్కో రిజిష్ట్రేషన్‌కు ఒక్కో రేటను నిర్ణయిస్తు ఫైల్లను రిజిస్ట్రార్ వద్దకు పంపిస్తారు. ఎవరికి సంబంధించిన ఫైల్లపై వారికి కేటాయించిన గుర్తులతో కార్యాలయం లోనికి వెళతాయి. చట్టప్రకారం ఐతే డాక్యూమెంట్ రైటర్ కు కార్యాలయం లోనికి అనుమతి ఉండదూ కానీ ఇక్కడ అధికారికి డాక్యూమెంట్ రైటర్లే ఆదాయ వనరులు కాబట్టి వారికే ప్రాధాన్యత కనిపిస్తుంది.

ఎవరైనా ఒక అడుగు ముందుకు వేసి కార్యాలయం లోకి వెళితే అక్కడున్న దళారులు వెంటనే కలుగజేసుకుని వారి ఫైళ్లను బయటకు పంపిస్తారు. డబ్బులిస్తే మాత్రం ఏ టైంనా ఫర్వాలేదంటూ దళారులు ఫైళ్లను దగ్గరుండి ఆఫీసర్ వద్దకు పంపిస్తారు. దీనికి గాను ఒక్కో ఫైలుకు రూ.4వేల నుండి రూ.10వేల వరకు సబ్ రిజిస్ట్రార్‌కు ముడుపులు ముడుతాయని రిజిష్ట్రేషన్ చేయించుకునే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐతే ఈ డబ్బులను నేరుగా కాకుండా దళారుల ద్వారా అధికారికి చేరవేస్తారనే ఆరోపణలున్నాయి. రిజిష్ట్రేషన్ కార్యాలయ సమీపంలో ఉన్న డాక్యూమెంట్ రైటర్స్ సైతం నెల నెల రిజిష్ట్రార్‌కు మామూళ్లు ఇవ్వాల్సిందేని వాపోతున్నారు. ఎప్పుడైనా మామూ ళ్లు ఇవ్వడంలో జాప్యం అయిందంటే ఇక అంతే డా క్యూమెంట్ రైటర్స్ ఫైల్ ఆగాల్సిందే. కార్యాలయ సమయం ముగిసే వరకు అలాగే ఉంటుంది. ఇదేంటని ఎ దురు మాట్లాడితే నాళా పన్ను కట్టాలంటూ, కోర్టు కేసు లో ఉన్నవంటూ సాకులు చూపుతూ నాలుగోవంతు డబ్బులను వసూలు చేస్తు తమ వాటా తీసుకుంటు అధికారికి డబ్బులను చేరవేస్తారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాత డేట్లతో బాండ్ పేపర్ల విక్రయాలు..కోర్టు మెట్లు ఎక్కుతున్న కేసులు

పాత డేట్లతో బాండ్ పేపర్లను విక్రయిస్తు క్రయ విక్రయదారులకు అయోమయానికి గురి చేస్తు స్టాంప్ వెండర్లు సొమ్ము చేసుకుంటున్నారు.చనిపోయిన వారి పేరుమీద బాండ్ పేపర్లు అమ్ముతు అసలైన కొనుగోలు దారున్ని ఇబ్బందుల పాలు చేస్తున్నారు. మరికొందరైతే కోట్ల విలువైన భూములను ఒక్కో స్టాంపు పేపర్లు రూ.5 వేల నుండి రూ.8 వేల వరకు పాత తేదిలలో అమ్ముతూ దనార్జనే ధ్యేయంగా పెట్టుకున్నారు.ఇలాంటి సంఘటనలతో అసలైన భూమి కొనుగోలు దారు కోర్టుల చట్టు తిరగాల్సి వస్తోంది.

కాంగ్రెస్ పోరాట ఫలితం.. ఫలించింది..



- టీపీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి...

విజయక్రాంతి, యాదాద్రి: జిల్లాలో నిర్మిస్తున్న బస్వాపురం ప్రాజెక్టు పరిధిలో ముంపుకు గురవుతున్న..భూ నిర్వాసితుల పరిహారం కోసం అనేక సార్లు కాంగ్రెస్ పార్టీ తరుపున పోరాటం చేశాం..గత నెలలో పెద్ద ఎత్తున్న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించిన నిరాహారదీక్షకు స్పందించిన ప్రభుత్వం గత ఆరు రోజుల క్రితం నుండి రైతు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి పేర్కొన్నారు..మంగళవారం జిల్లా కేంద్రంలో స్థానిక సంకల్ప హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్ని మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రాజెక్టు పరిధిలో ముంపుకు గురవుతున్న గ్రామాలకు..పునర్నిర్మాణం కోసం వారు కోరిన ప్రాంతంలో వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ కార్యదర్శి తంగళ్ల పెల్లి రవి కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోత్నక్ ప్రమోదు కుమార్ , పట్ట అధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు.

సన్మానానికి పిలిచి అవమానిస్తారా



- మున్సిపల్ కమీషనర్‌పై ఎమ్మెల్యే పైలెట్ ఫైర్

విజయక్రాంతి, తాండూరు: అధికారులు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలని తమాషాలు చేస్తే తాటా తీస్తామని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మున్సిపల్ కమీషనర్ భోగేశ్వర్లును హెచ్చరించారు.మంగళవారం మున్సిపల్ చైర్మన్ సునితా సంపత్ కుమార్ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిని ఆహ్వానించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని సన్మానించాలని మున్సిపల్ చైర్మన్ నిర్ణయించుకున్నారు.ఉదయం 11:30 గంటలకు సమావేశం ప్రారంభం అయ్యింది.సుమారు ఒంటి గంటకు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమావేశానికి హాజరైయ్యారు. ముందుగా ఎమ్మెల్యేను మున్సిపల్ అధికారులు, చైర్మన్‌తో పాటు కౌన్సిల్ సభ్యులు సన్మానించారు.అనంతరం మున్సిపల్ సమావేశం కొనసాగించాలని ఎమ్మెల్యే కోరారు.దీనిపై టిఆర్ఎస్ కౌన్సిలర్‌లు అభ్యంతరం చెప్పారు.ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయకుండా అధికారిక కార్యక్రమాలలో పాల్గోనరాదని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతు తాండూరు అభివృద్ధికి అందరు సహకరించాలని పార్టీలను పక్కన పెట్టి సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం

విజయక్రాంతి, దేవరకొండ : చింతపల్లి మండల కేంద్రంలో డాక్టర్ అలుకా జైహిందిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సహాయంతోమధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. భానునాయక్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలోముఖ్య అతిథిగా రాష్ట్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంఘం అధ్యక్షుడు మందడి కృష్ణారెడ్డి, చింతపల్లి ఎస్సై శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతల సాయంతో మధ్యాహ్న భోజనం చింతపల్లి జూనియర్ కళాశాలలో నిర్వహించడంతో ప్రిన్సిపాల్‌కి అభినందనలు తెలిపారు.

దుబ్బాక ప్రజలకు అన్యాయం చేస్తే ఊరుకోం..!

విజయక్రాంతి, దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు అన్యాం చేస్తే ఊరుకోనే పరిస్థితి లేదని, ప్రజలకు అన్యాయం చేసే మాస్టర్ ఫ్లానింగ్ అవసరం లేదని బీజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాధవనేని రఘునందన్ రావు అన్నారు. దుబ్బాక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ కేంద్రామైన దుబ్బాకలోని మాస్టార్ ఫ్లాన్ పేరిట ఉన్న పేదల లక్షల ఆస్తులను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపి నాయకులు బాలేష్‌గౌడ్, చారీ, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఆశావహులపై అనర్హత వేటు..

విజయక్రాంతి, వేములవాడ : స్థానిక సంస్థల ఎన్నికల సమరం ఒక్క జరుగుతుండగా, మరో పక్కా ఎన్నికల కమీషన్ మాత్రం ఎన్నికల పోటీలో అనర్హత ఉన్న అభ్యర్థుల పేర్ల బాంబును పేల్చింది. దీంతో ఎన్నికలో బరిలో నిలిచేందుకు సన్నహాలు చేసుకున్న వ్యక్తులు ఒక్కసారిగా ఉలికిపడ్డారు. ఇప్పటికే గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల పోటిలో ఉండేందుకు ప్రచారం మొదలు పెట్టారు. కాగా మంగళవారం ఎన్నికల జిల్లా అధికారి వెంకటరామిరెడ్డి ప్రకటించాడు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటిలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల్లో ఖర్చు చేసిన నివేదికను సర్కారుకు సమర్పించలేదు. దీంతో వారి అభ్యర్థుల పేర్లను జిల్లా వ్యాప్తంగా ప్రకటించారు. జరుగుతున్న ఎన్నికల్లో గతంలో పోటి చేసిన వార్డు సభ్యులు సర్కారు ఖర్చులు చూపని వారిలో వార్డు సభ్యులు 1557, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు 103 మంది పేర్లను ప్రకటించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అనర్హత వేటు జాబితా ప్రకటించడంతో చర్చనీయాంశంగా మారింది.గత ఎన్నికల్లో పోటిలో నిలిచి ఓడిపోయి, విత్‌డ్రా చేసిన వారు సర్కారుకు సమర్పించే ఎన్నికల ఖర్చు నివేధిక మర్చిపోయారు. కాగా నూతనంగా వెలువడిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటిలో నిలిచేందుకు నోటిఫికేషన్ వెలువడకముందే గ్రామాల్లో ప్రచారం జోరు పెంచారు. గత ఎన్నికల్లో వార్డు సభ్యులుగా, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులుగా పోటిలో నిలిచి, ఎన్నికల ఖర్చు వివరాలు సర్కారుకు సమర్పించకపోవడంతో వారిని ఈ ఎన్నికల్లో అనర్హలుగా ప్రకటించింది. వార్డు సభ్యులు 1557 మంది, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు 103 మంది పేర్లు వివరాలను వెల్లడించారు.

వాహనదారులు ట్రాఫిక్ అడ్వైజరీ పాటించాలి

విజయక్రాంతి, వరంగల్ అర్బన్: వరంగల్ రైల్వే గేట్, బట్టల బజార్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్న దృష్ట్యా ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగే ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి ట్రాఫిక్ అడ్వైజరీని వరంగల్ పోలీస్ కమిషనర్ డా.వి.రవిందర్ విడుదల చేశారు. బట్టలబజార్‌లోని రైల్వేగేట్ నెంబర్ 62 లెవిల్ క్రాసింగ్ ఆర్.ఓ.బి నెం 480బి వద్ద జనవరి 08, 2019 నుంచి జనవరి10, 2019 వరకు ఓవర్ బ్రిడ్జి పూర్తిస్థాయిలో నిర్మాణం పనులు జరుగుతుండటంతో ఈ ప్రాంతంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను చేశారు. ఇందులో భాగంగానే వరంగల్ రైల్వేగేట్ బైపాస్ రోడ్‌ను పూర్తిగా మూసివేశారు. దీంతో రైల్వే గ్రేట్ బేపాస్ రోడ్ మార్గానికి వెళ్లేందుకు వినియోగించే పోతన జంక్షన్, అండర్ బ్రిడిడ్జ, బీట్ బజార్, మేడరవాడ మార్గాలను పూర్తిగా వేసివేయడం జరిగింది. అదే విధంగా లోకల్ ఆర్టీసీ బస్సులు తిరిగి పోతన జంక్షన్‌కు మళ్లించి ఎంజీఎం మీదుగా పంపించబడుతాయి. ఖమ్మం మయిరు హంటర్ రోడ్ మరియు చిన్న బ్రిడ్జ్ మీదుగా వచ్చే వాహనాలు పోతన జంక్షన్ నుంచి ఎంజీఎం వైపు మళ్లించబడతాయి. సిపి డా.వి.రవిందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కార్మిక చట్టాల పరిరక్షణ కోసం దేశ వ్యాప్త సమ్మె

విజయక్రాంతి, మహబూబాబాద్: కార్మికుల చట్టాల పరిరక్షణ కోసం దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మహబూబాబాద్ పట్టణంలో ఐక్య కార్మిక సంఘాలు స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం నిరసన, ధర్నా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అజయ్, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజు, ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు సీహెచ్.లింగ్యానాయక్ లు మాట్లాడుతూ కార్మిక సంఘాలు అనేక త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నాలుగు కోడులుగా సవరించి యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మికులకు నష్టం జరిగే విధంగా సవరణలకు పూనుకుంటుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు రేషపల్లి నవీన్, తోట బిక్షం, గునిగంటి రాజన్న, చింతకుంట్ల వెంకన్న, నర్ర శ్రావణ్, చింతకుంట్ల యాకాంబ్రం, యాకుబ్, పోతుగంటి నవీన్, మంద శంకర్, తోట శ్రీను, జక్కరయ్య, యుఎస్‌పీసీ నాయకుడు గోవర్ధన్, ఉపేందర్ రెడ్డి, వెంకట్రాంనర్సయ్య, నల్ల లింగయ్య, లక్ష్మయ్య, బాలాష్టి రమేష్, ప్రేమలత, స్వప్న, గిరిజ, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రెండీ

పట్టు చీర భద్రతకు పది సూత్రాలు

- పట్టు వస్త్రాలు ఎక్కువగా నీటిని పీల్చుకొని, వదిలే గుణాలను కలిగి ఉంటాయి. వీటిని ఎక్కువ సమయం నీటిలో ఉంచితే రంగు పోతుంది.
- శుభ్రతకు గోరు వెచ్చని మంచినీరు మాత్రమే వినియోగించాలి.
- సబ్బు, బేబీ షాంపూను వీలైనంత తక్కువగా వాడాలి.
- రంగు చీరలు అయితే అంచును నీళ్లలో తడిపి, చేతితో రుద్ది రంగు పోతుందో లేదో పరిశీలించాలి. 10 చుక్కల నిమ్మకాయ రసం వేసి, దానిలో చీరను ఉంచి వెంటనే ఉతకాలి.
- పట్టు వస్త్రాలను శుభ్రత తర్వాత గట్టిగా పిండకుండా, మలవకుండా నీడలో ఆరేయాలి.
- తేమగా ఉన్నప్పుడు ఇస్త్రీ చేస్తే వేడి ప్రభావం దుస్తులపై పడదు.
- మడతలను ప్రతి మూడు నెలలకు ఒకసారైనా మార్చాలి.
- బీరువాలో భద్రపరిచే సమయంలో కలరా గోళీలు కాకుండా గంధపు చెక్క ముక్కలు గుడ్డలో చుట్టి ఉంచాలి. మిరియాలను ఒక వస్త్రంలో చుట్టి చీరల మధ్యలో ఉంచినా మంచిదే. దీనివల్ల తేమ చెరకుండా ఉంటుంది.





పెద్ద అంచు పెద్ద ఫ్యాషన్..

చీరలోని గొప్పతనం తెలుసుకో.. ఈ చీర కట్టి ఆడతనం పెంచుకో.. అని ఓ కవి రాసినట్లు.. పండగ వచ్చిందంటే చాలు ప్రతి పడతీ చూపు పట్టుచీరలపైనే. పండగ శోభంతా పట్టుచీరల్లోనే. ధగ ధగ మెరిసిపోయే పట్టుచీరల వైభవమే వేరు. ఈ పండగరోజుల్లో శోభాయమానంగా కనిపించాలంటే ఓ 'పట్టు' పట్టాల్సిందే! బంగారు, వెండి జరీ ధగధగలు, కలనేతల కళాకాంతులు మీ సొంతం చేసుకోవాలనుకుంటే ఇదిగో ఇలాంటి సంప్రదాయ చీరలతో మెరిసి మురిసిపొండి..!

సంప్రదాయం ఉట్టిపడుతూనే సవాళ్లను ఎదర్కొనేంత ధీమాగా కనపడాలన్నదే ఆధునిక మహిళ అంతర్యం. నవతరం మనసెరిగిన డిజైనర్లు సంప్రదాయ వేడుకలకు వైవిధ్యంగా డిజైన్లను తీసకువస్తున్నారు. సన్నగా పొడువుగా ఉన్నవారు పెద్ద పెద్ద జరీ అంచున్న చీరలు కట్టుకుంటే ఇక ఆ అందం గురించి చెప్పనక్కర్లేదు. పెద్ద పెద్ద జరీ అంచులపై ప్రత్యేకమైన డిజైన్లు రావడంతో మరింత ప్రత్యకతను సంతరించుకుంటున్నాయి.

చామంతులు, కనకాంబరాలు కలిపి కట్టిన పూమాలల్లా కనిపించాలంటే పవిట చెంగు, కుచ్చిళ్లు ఒక రంగులో, చీర మొత్తం మరో రంగులో ఉండాలి. అలాంటి కాంట్రాస్ట్ రంగుల్లోనే చీర భారీగా కనిపించి కనువిందు చేస్తుంది.



పసుపు రంగు శుభప్రదం. అదే రంగు పట్టు చీర అయితే మరింత మంగళకరం. పసుపు రంగు చీరకు ఒత్తయిన జరీ అంచు ఉంటే అద్భుతమే.

నీలం రంగులో ఉండే ఆకర్షణే వేరు. వినీలాకాశంలో విహంగంలా కనిపించాలంటే నీలం రంగు పట్టుచీర ఎంచుకోవాలి. దాని మీద జరీ బుటా కూడా నిండుగా ఉండాలి.

ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే మల్టీకలర్స్ ఎంచుకోవాలి. పట్టు చీరల్లోనూ ఇలాంటివి ఉంటాయి. అయితే లేలేత రంగులలో ఉండేలా చూసుకుంటే బాపు బొమ్మలా కనిపించడం ఖాయం!

పట్టెడంత పట్టుతో చీరకు కోరుకున్నంత మెరుపు రాదు. పట్టు చీర స్వర్ణ కాంతులు వెదజల్లాలంటే పట్టు చీరంతా నిండుగా ఉండాలి. అప్పుడే వేడుకల్లో వెలిగిపోవచ్చు.

కుచ్చిళ్ల దగ్గర జరీ అంచు మోకాళ్ల వరకూ ఉండడం చీరకు వినూత్న ఆకర్షణను తెచ్చిపెడుతుంది. ఆ జరీ మీద కనిపించీ, కనిపించకుండా ఉండే సెల్ఫ్ డిజైన్ ఈ చీరలకున్న మరో ప్రత్యేకత!

వెండి వెలుగులు విరజిమ్మాలంటే వెండి జరీలో ధగధగలాడాలి. నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలనుకుంటే వెండి జరీ చీరను ఎంచుకుంటే సరి!



విజయారెడ్డి
కర్టసీ: భార్గవి కూనం










నృత్యం చేస్తున్న జుంకాలు





చెవిలోలాకుల్లో చెప్పలేనన్ని డిజైన్లు... ఎన్ని వచ్చినా ఇంకేవో కొత్త వాటికోసం వెతుకుతుంటారు. నేటి తరం అమ్మాయిలు.. అందులోను తల తిప్పినప్పుడుల్లా నృత్యం చేస్తున్నట్లుగా అటూ ఇటూ ఊగిసలాడే లోలాకులంటే ఈ తరానికి మరీ ఇష్టం. ఆ విషయాన్ని గమనించే కాబోలు, ఇప్పుడు నృత్యం చేస్తున్నట్లు జుంకీలను వెరైటీ డిజైన్లను తయారు చేస్తున్నారు. అదే డిజైన్‌తో జూకాలతో పాటు లాకెట్‌ని సెట్ చేసి సెట్‌గా రూపొందిస్తున్నారు. బంగారం, ప్లాటినం వంటి ఖరీదైన లోహాలతో వజ్రాలు, రంగుల రత్నాలు పొదిగిన ఈ బొమ్మలోలాకులు చూడ్డానికే ఇంత అందంగా ఉంటే, ముద్దగుమ్మలు పెట్టుకుంటే మరింత అందంగా మెరుస్తారనడంలో సందేహం లేదు.











స్వెటర్‌కి రెక్కలొచ్చాయి

అసలే చలికాలం.. జీరో ఫ్యాషన్ కాలం అని అనుకుంటే పొరబాటే. చలి నుంచి రక్షణ కోసం వేసుకునే స్వెటర్లు సైతం సరికొత్త సొగసుల్ని అద్దుకుంటున్నాయి. ఈ క్లోక్ స్వెటర్లు అలాంటివే. రెక్కల టాప్ లేదా పాంచోస్ వేసుకున్నట్లో శాలువా కప్పుకున్నట్లో డిజైన్ చేస్తున్న ఈ రకమైన చలికోటులకి టాజెల్స్ కూడా జోడించేసి మరీ హంగామా సృష్టించేస్తున్నారు నేటి డిజైనర్లు. దాంతో ఈ అందాల స్వెటర్లతో ఫ్యాషన్ భామలు ర్యాంప్‌ల మీదా కాలేజీ పిల్లలు క్యాంపస్‌ల్లోను హల్ చల్ చేసేస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం మీరు ఓలుక్కేయ్యండి.









శుభ్రత.. పరిశుభ్రత..



భోజనానికి ముందూ, తర్వాతా చేతులు కడుక్కోవాలనే విషయం అందరికీ తెలిసిందే. కొన్ని సందర్భాలలో కడుక్కోకపోతే ఏమవుతుందిలే అని తేలిగ్గా తీసుకుంటాం. కానీ ఆరోగ్యంగా ఉండాలంటే తరచూ చేతుల్ని శుభ్రంగా కడుక్కోవడం ఓ అలవాటుగా మార్చుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంటుంది. చేతులు పరిశుభ్రంగా ఉన్నట్లయితే కొన్నిరకాల ఇన్‌ఫెక్షన్లకు దూరమై ఆయుష్షు కూడా పెరుగుతుందని వెల్లడించింది. అయితే చేతులు కడుక్కోవడానికి ఓ పద్ధతి ఉంది. సబ్బు నీటితో శుభ్రం చేసుకోవాలి. లేదంటే ఆల్కహాల్ ఆధారిత సొల్యూషన్‌తో శుభ్రం చేసుకోవాలి. చేతుల్ని తడిచేసుకొని సబ్బు రుద్దుకొని వేళ్ల మధ్యలో, మణికట్టు భాగంలో, గోళ్లలోపలా, వాటి చుట్టూ చేయంతా కనీసం ఇరవై సెకన్లు రుద్ది కడుక్కొని తుడిచేసుకోవాలి. ఇలా తినటేపుడు, వండేటపుడు, పసిపిల్లల్ని ఎత్తుకునేముందు, ముక్కు తుడుచుకున్న తర్వాత, అనారోగ్యంతో ఉన్నవారిని తాకేముందు, బాత్‌రూమ్‌కి వెళ్లి రాగానే ప్రతిసారీ శుభ్రం చేసుకోవాలి.

పసందైన పండుగ స్వీట్లు

పండగలు వస్తున్నాయంటే ముందుగా అందరికి గుర్తుకు వచ్చేది పిండివంటలే. ప్రతి వంటకం ప్రత్యేకత సంతరించుకుంటుంది. సంక్రాంతి వస్తుందంటే పది రోజుల ముందు నుంచే పిండి వంటల హడవిడి మొదలవుతుంది. వాటిలో భాగంగా రుచికరమైన స్వీట్స్ మీకోసం...

సగ్గుబియ్యం పూర్ణాలు



కావలసిన పదార్థాలు:

మినపప్పు మూడు కప్పులు, బియ్యం ఆరు కప్పులు, సన్న సగ్గు బియ్యం కప్పు, ఎండుకొబ్బరితురుము పావుకప్పు, పంచదారకప్పు, అటుకులపొడిపావుకప్పు, యాలకులపొడి టీస్పూను, నూనె వేయించడానికి సరిపడా.

తయారుచేసే విధానం

ముందుగా మినప్పప్పు, బియ్యం నాలుగు గంటలపాటు నానబెట్టాలి. నానాక సరిపడా నీటితో మరీ గట్టిగానూ పలుచగానూ కాకుండా దోసెల పిండిలా మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. పాన్లో మూడు కప్పుల నీళ్లు పోసి కాగాక సగ్గుబియ్యం వేసి ఉడికించాలి. అవి ఉడికిన తరవాత పంచదార, యాలకులపొడి వేసి కలిపి ఉడికించాలి. ఓ గిన్నెలో ఉడికించిన సగ్గుబియ్యం మిశ్రమం, ఎండు కొబ్బరి తురుము, అటుకులపొడి వేసి ముద్దగా కలపాలి. మిశ్రమాన్ని చిన్న చిన్న ముద్దల్లా చేసి ముందుగా గ్రైండ్ చేసుకున్న పిండి మిశ్రమంలో ముంచి కాగిన నూనెలో ఎర్రగా వేయించి తీయాలి.



కరకజ్జికం



కావాల్సిన పదార్థాలు

శెనగపిండిగ్లాసు, బెల్లంపొడి గ్లాసు, నూనె వేయించేందుకు సరిపడా, ఉప్పుకొద్దిగా, నెయ్యిరెండు చెంచాలు

తయారీ విధానం

శెనగపిండిలో కొద్దిగా ఉప్పు వేసుకుని నీళ్లు పోసి జంతికల పిండిలా గట్టిగా కలపాలి. బాణలిలో నూనె పోసి స్టౌపై పెట్టి వేడి చేయాలి. తర్వాత శెనగ పిండి ముద్దను జంతికల గొట్టంలోకి తీసుకుని కాగుతోన్న నూనెలో జంతికల్లా వేసి బంగారు రంగు వచ్చేదాకా వేయించి తీయాలి. మరో గిన్నెలో బెల్లం పొడి తీసుకుని అది మునిగేలా నీళ్లు పోసి స్టౌపై పెట్టాలి. తర్వాత బెల్లం కరిగి ఉండపాకం వచ్చాక వేయించుకు పెట్టుకున్న జంతికల్ని చిన్న ముక్కల్లా చేసి అందులో వెయ్యాలి. ఒక నిమిషం తరువాత స్టౌ ఆపేయాలి. తర్వాత పాకం పూర్తిగా జంతికలకు పట్టేలా కలిపి నెయ్యి రాసిన పళ్లెంలోకి ఈ మిశ్రమాన్ని తీసుకోవాలి. కొంచెం చల్లారాకా ముక్కల్లా వస్తాయి. అంతే తియ్యతియ్యని కరకజ్జం రెడీ.

నువ్వుల అరిసెలు



కావల్సిన పదార్థాలు

నువ్వులుపావు కప్పు, బియ్యంఒక కేజీ, బెల్లంముప్పావు కేజీ, నూనె వేయించడానికి తగినంత, నీరుఒక కప్పు

తయారీ విధానం

బియ్యాన్ని శుభ్రంగా కడగాలి. మళ్లీ మంచి నీళ్లుపోసి 6 గంటల సేపు నానబెట్టాలి. తర్వాత నానిన బియ్యాన్ని పల్చటి వస్త్రంమీద పోసి కొద్దిగా తడి ఆరనివ్వాలి. కొంచెం తడిపొడిగా ఉండగానే పిండి మెత్తగా పట్టించుకుని పిండి ఆరిపోకుండా మూత పెట్టుకోవాలి. బెల్లాన్ని బాగా మెత్తగా దంచి ఒక పాత్రలో వేసి అందులో ఒక కప్పు నీళ్లు పోసి స్టౌమీద సన్నని మంటపై పెట్టాలి. తర్వాత దానిని గరిటెతో కలుపుతూ ముదరుపాకం వచ్చేవరకు ఉంచాలి. పాకం రాగానే స్టౌమీద నుండి దించి ఒకరు గరిటెతో పాకాన్ని తిప్పుతుంటే మరొకరు పిండిని అందులో పోయాలి. పిండి ఉండలు కట్టకుండా జాగ్రత్తగా త్వర త్వరగా గరిటెను తిప్పాలి. సరిపడినంత పిండి పోసి అది ఆరిపోకుండా మూత పెట్టుకోవాలి. తర్వాత పిండిని చిన్నచిన్న ముద్దలుగా చేసుకొని ఒక పాలిథిన్ కవరు మీద చేతితో గుండ్రంగా వత్తుకొని పెట్టుకోవాలి. తర్వాత బాణలిలో నూనె పోసి వేడి చేయాలి. నూనె వేడెక్కగానే అందులో వత్తి పెట్టుకున్న అరిసెలను వేయాలి. అవి బంగారు రంగులోకి వచ్చేంతవరకు వేయించి తీసి వాటిని అరిసెల పలకలతో నొక్కాలి. తర్వాత వాటిని నువ్వులలో వేసి వత్తితే నువ్వుల అరిసెలు రెడీ.

మీల్‌మేకర్ హల్వా


కావాల్సిన పదార్థాలు

మీల్‌మేకర్ కప్పు, చక్కెర అరకప్పు, పాలు కప్పు, పచ్చికోవా పావుకప్పు, నెయ్యి రెండు చెంచాలు, జీడిపప్పు, కిస్మిస్ చెంచా, వేణ్నీళ్లు రెండు కప్పులు, యాలకులపొడి అరచెంచా.

తయారీ విధానం

మీల్‌మేకర్‌ని వేడినీళ్లలో ఐదు నిమిషాలు ఉంచి తీయాలి. చల్లారాక పిండేసి.. మెత్తగా మెదుపుకోవాలి. తరవాత పొయ్యిమీద బాణలి పెట్టి చెంచా నెయ్యి కరిగించి జీడిపప్పు, కిస్మిస్ వేయించుకుని తీసుకోవాలి. అదే బాణలిలో మిగిలిన నెయ్యి కరిగించి మెత్తగా చేసుకున్న మీల్మేకర్ను వేయాలి. పచ్చిదనం పోయాక అందులో పాలు పోసి మూతపెట్టి మంట తగ్గించాలి. కాసేపటికి మిశ్రమం ముద్దలా దగ్గరకు వస్తుంది. అప్పుడు చక్కెర, పచ్చికోవా వేసి బాగా కలపాలి. బాగా దగ్గర పడిన తరువాత పొయ్యి కట్టేసి వేయించి పక్కన పెట్టుకున్న జీడిపప్పు, కిస్మిస్ పలుకులు, యాలకులపొడి వేసి కలిపి దింపేయాలి. ఇలా తయారైన మీల్‌మేకర్ హల్వా వెరైటీ రుచిని అందిస్తుంది.

గోల్డెన్ ఇంప్లాంట్..



- లోహ ఇంప్లాంట్ బదులుగా..
- మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలో నూతన ఒరవడి..
- అలర్జీ నిరోధకం, దీర్ఘకాల మన్నిక

మారుతున్న పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, జీవనశైలితో రోగుల సంఖ్య పెరుగుతోంది. గతంలో పెద్ద వయస్సు వారిలో కనిపించే అనేక రోగాలు నేటి కాలంలో చిన్న వయస్సు వారిలోనే కనిపిస్తున్నాయి. అదే సమయంలో కొత్తగా తలెత్తుతున్న సమస్యలను తట్టుకునేందుకు వైద్య పరిశోధనలు కూడా ముమ్మరంగా నూతన ఆవిష్కరణలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అరిగిన మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. మోకాలి మార్పిడి శస్త్రచికిత్స తొలినాళ్లలో లోహాలతో కూడిన ఇంప్లాంట్లను ఉపయోగించే వారు. అయితే కొందరిలో లోహాల అలెర్జీ ఉండడంతో ఇలాంటి వారి కోసం నూతనంగా వచ్చిన ఆవిష్కరణే గోల్డెన్ ఇంప్లాంట్. గోల్డెన్ ఇంప్లాంట్ అలెర్జీని నిరోధించడమే కాకుండా దీర్ఘకాల మన్నిక కూడా ఎక్కువగా ఉండడంతో ఇటీవల గోల్డెన్ ఇంప్లాంట్ మార్పిడి శస్త్రచికిత్స చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. సాధారణ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స అవసరమైన రోగులకు కూడా గోల్డెన్ ఇంప్లాంట్ ఎంతో ఉపయోగకరం. అయితే దీనికి సంబంధించి బాధితులు ముందుగా తమలో ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలి. సాధారణ లోహ ఇంప్లాంట్‌కు, గోల్డెన్ ఇంప్లాంట్‌కు మధ్య ఉన్న తేడాలకు సంబంధించి సాధారణంగా ఎదురయ్యే సందేహాలు – వాటికి సమాధానాలివి.

గోల్డెన్ మోకాలి ప్రత్యామ్నాయం అంటే ఏమిటి?

బంగారు మోకాలి మార్పిడి శస్త్రచికిత్స మెటల్ అలెర్జీ ఉన్న వారికి ఒక వరం లాంటిది. ఈ మోకాలి ఇంప్లాంట్లు టైటానియం నియోబియం నైట్రెడ్ యొక్క ఉపరితల పూత (టీనిఎన్)ను విస్తరించాయి. ఈ పూత ఇంప్లాంట్ బంగారు రంగుల రూపాన్ని ఇస్తుంది. మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స తరువాత నొప్పులనుంచి బయట పడటమే కాదు మునుపటిలా ఉండవచ్చు. ఈ పూత గల ఇంప్లాంట్ అలర్జీ ప్రూఫ్ కూడా. మోకాలు పనితీరును ఇది మెరుగు పరుస్తుంది.



గోల్డెన్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స ఎందుకు అవసరం?

బంగారు మోకాలు నేడు అందుబాటులో ఉన్న ఉత్తమ ఇంప్లాంట్లలో ఒకటి. చాలా విజవంతమైనది. ఇది ఇంప్లాంట్ యొక్క జీవిత కాలాన్ని పెంచుతుంది. రోగిలో తలెత్తే అలెర్జీ ప్రతిస్పందనలను కూడా నిరోధిస్తుంది. క్రోమియం కోబాల్ట్ మిశ్రమంతో తయారైన రెగ్యులర్ మోకాలి ఇంప్లాంట్లు శరీరంలోని లోహం అయానులను విడుదల చేస్తాయి. లోహ అలెర్జీ కలిగిన రోగులలో ఈ లోహ అయాన్లు మోకాలి ప్రాంతంలో వాపును కలిగించవచ్చు. చివరకు సంక్రమణ, పట్టు కోల్పోవడం, నిరంతర మోకాలి నొప్పి వంటి సమస్యలు కలిగిస్తాయి. గోల్డెన్ మోకాలి ఇంప్లాంట్లు మానవ కణాలతో అలెర్జీ ప్రతిచర్యను ప్రేరేపించవు. ఈ ప్రయోజనాల కారణంగా గోల్డెన్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స సాధారణంగా రోగులకు సూచించబడుతుంది. ఈ ఇంప్లాంట్ 60 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న రోగుల మోకాలి మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

గోల్డెన్ మోకాలు మార్పిడిని ఎవరు ప్రత్యామ్నాయంగా ఎంచుకోవాలి?

ఎవరైన సరే గోల్డెన్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవచ్చు. లోహ అలెర్జీ కలిగిన రోగులకు ఇది ఎక్కువ ఉపయోగకరం. (కృత్రిమ ఆభరణాలకు అలెర్జీ, మెటాలిక్ వాచ్ పట్టీ లేదా మెటాలిక్ వినోదం ఫ్రేముల అలర్జీతో బాధపడేవారు). 60 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన రోగులకు గోల్డెన్ మోకాలి మార్పిడి చేయాలని సలహా ఇస్తారు. గరిష్టంగా 40 ఏళ్ల వరకు ఈ ఇంప్లాంట్ చెక్కు చెదరకుండా ఎక్కువ కాలం మన్నుతుంది.

తగ్గిన ధరలు

మెకాలి ఇంప్లాంట్ల ధరలను 59 నుంచి 89 శాతం వరకు ఔషధ ధరల చట్టంలో ప్రత్యేక నిబంధన ఉపయోగించి ప్రభుత్వం తగ్గించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశంలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స అవసరమైన 3 కోట్ల మందికి ఉపయోగపడనుంది.



– డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి
ట్రామా ఆర్థోస్కోపీ
అండ్ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్
యశోద హాస్పిటల్, సోమాజీగూడ

హెల్త్

వంటింటి పెయిన్ కిల్లర్స్...

శరీరం అన్నాక ఏదో ఒక నొప్పి బాధపెడుతుంటుంది. కానీ పెయిన్ కిల్లర్స్ వేసుకుంటే చాలా ప్రమాదం అని డాక్టర్లు చెప్తారు. పైపూతకు రకరకాల బామ్‌లు ఉండనే ఉంటాయి. కాని వాటితో కూడా ఉపశమనం కలగకపోతే, ఆలస్యం ఎందుకు. మన వంటగదే మెడికల్ స్టోర్. అక్కడికి వెళ్లి, వీటితో నొప్పులు తగ్గించేసుకోవచ్చు.



పెరుగు

పాశ్చరైజ్డ్ కాని, నిలువ ఉన్న, పుల్లటి వాసన రాని పెరుగును తీసుకుంటే కడుపు ఉబ్బరం, నొప్పి తగ్గుతుంది. పెరుగులో ఆరోగ్యకరమైన ప్రోబియోటిక్స్ ఉంటాయి. అవి జీర్ణవ్యవస్థను మెరుగు పరుస్తాయి. రోజుకి రెండు కప్పుల పెరుగు తింటే కడుపులో ఇబ్బంది, నెలసరి నొప్పులు తగ్గుతాయి.

పుదీనా



కండరాల నొప్పి, పళ్లనొప్పి, తలనొప్పి, నరాల నొప్పులు తగ్గాలంటే పుదీనా మంచి ఉపాయం. పుదీనా ఆకులు నమలాలి. అరుగుదల మెరుగు పడుతుంది. మైండ్‌ని చల్లబరుస్తుంది. అందులో ఉండే వైద్య గుణాలు కండరాలను, నరాలను రిలాక్స్ చేస్తుంది. రాత్రి నిద్రపోయే ముందు పుదీనా ఆకులను గోరువెచ్చని నీటిలో పది పన్నెండు వేసుకొని, తెల్లవారుజామున ఆ నీటిని తాగితే మంచిది.

ఎప్సమ్ సాల్ట్

మలబద్ధకానికి మంచి చిట్కా ఎప్సమ్ సాల్ట్. పొట్టలో పేగులలో కదలికలను కలిగించి కడుపులో ఉన్న వేస్ట్ సులువుగా బయటకుపోయేలా చేస్తుంది. ఒక కప్పు నీటిలో రెండు టేబుల్ స్పూన్‌ల ఎప్సమ్ సాల్ట్ వేసి కలిపి రోజూ తాగాలి. సాల్ట్‌లో ఉండే మెగ్నీషియమ్ కండరాలను రిలాక్స్ చేసి నొప్పిని తగ్గిస్తుంది.

అల్లం



అల్లంలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కండరాల నొప్పిని, ఆర్థరైటిస్‌ను, కడుపునొప్పి, ఛాతీ, నెలసరి నొప్పులను తగ్గిస్తుంది. కొద్దిగా అల్లం ముక్క నమిలితే గ్యాస్టిక్ సమస్య నుంచి వెంటనే ఉపశమనం లభిస్తుంది. అల్లం చాయ తాగితే మైగ్రెయిన్ తలనొప్పి తగ్గుతుంది. ఊపిరితిత్తుల ట్రాక్ ఇన్‌ఫెక్షన్, బ్రాంకైటిస్, దగ్గును తగ్గిస్తుంది.

వెల్లుల్లి



ఇందులో బాక్టీరియాతో పోరాడే గుణాలతోపాటు యాంటీవైరల్, యాంటి ఫంగల్ గుణాలు హీలింగ్ ఏజెంట్‌గా పని చేస్తుంది. వెల్లుల్లిని పచ్చిగా తింటేనే మంచిది. దాన్ని వండితే అందులో ఉన్న వైద్య గుణాలు హరించిపోతాయి. గోరువెచ్చని వెల్లుల్లి నూనెను జాయింట్లకు రాస్తే రిలీఫ్ ఉంటుంది. పన్ను నొప్పిగా ఉంటే కొన్ని వెల్లుల్లి రెబ్బల్ని పేస్ట్ చేసి దానికి చిటికెడు ఉప్పు చేర్చి నొప్పిగా ఉన్న పంటి మీద పెట్టాలి.

పసుపు



దీర్ఘకాలికంగా ఉన్న నొప్పుల్ని కూడా తగ్గించగలిగే గుణం దీనికి ఉంటుంది. అందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు జాయింట్లు, కండరాల నొప్పుల్ని తగ్గించగలదు. పసుపు, అలోవేరా జెల్‌ను మిశ్రమంగా చేసి దురద, నొప్పి వున్న చోట రాస్తే వెంటనే ఉపశమనం కలుగుతుంది. నోటి అల్సర్స్‌కి పసుపు, కొబ్బరినూనె పేస్ట్ రాస్తే తగ్గుతాయి.

థియేటర్లు కళ్యాణ మండపాలైన పాపమిది!

ఏపీ, తెలంగాణలో థియేటర్లు ఎన్ని? అంటే ఒకప్పుడు 4000 పైగా థియేటర్లు ఉండేవి. ఇప్పుడు 1700 స్క్రీన్లకు పరిస్థితి దిగజారింది. నష్టాలతో మిగతా స్క్రీన్లు అన్నీ మూత పడ్డాయి. కొన్నిటిని కళ్యాణ మండపాలుగానూ మర్చారు. దీంతో సినిమాలు రిలీజ్ చేసేవారికి సమస్య మొదలైందన్నది ఓ విశ్లేషణ. దీనివల్లనే ఆ నలుగురు.. థియేటర్ మాఫియా! అంటూ కొత్త వాదన తెరపైకి వచ్చింది. అయితే ఇందులో వాస్తవం ఎంత? అసలు ఎవరి చేతిలో ఎన్ని థియేటర్లు ఉన్నాయి. మాఫియా అని పిలుస్తున్న వాళ్ల చేతిలో ఎన్ని థియేటర్లు ఉన్నాయి? అన్నది పరిశీలిస్తే కళ్లు బైర్లు కమ్మే నిజాలు తెలుస్తాయి. ప్రస్తుతం ఏపీ, తెలంగాణలో మొత్తం 1170 స్క్రీన్లు ఉన్నాయి. ఇందులోనే మల్టీప్లెక్స్ స్క్రీన్లు ఉన్నాయి. ఆ నలుగురులో అల్లు అరవింద్ కి 18 థియేటర్లు ఉన్నాయి. నైజాంలో 3, తూ.గో జిల్లాకృష్ణా జిల్లాలో కలిపి 16 థియేటర్లు, ఓవరాల్ గా 18 థియేటర్లు ఉన్నాయి. దిల్ రాజుకు నైజాం వైజాగ్ కలిపి 60 థియేటర్లు ఉన్నాయి. యువి క్రియేషన్స్ కు గుంటూరుసీడెడ్ లో 35 థియేటర్లు ఉన్నాయి. ఏషియన్ సునీల్ నారంగ్‌కి నైజాంలో 170 పైగా థియేటర్లు ఉన్నాయి. అంటే ఇవన్నీ మొత్తం థియేటర్లలో 20శాతం మాత్రమే. దాదాపు 400 మంది లీజులకు తీసుకుని సినిమాల్ని రన్ చేస్తున్నారు. నాగార్జున, వారాహి చలనచిత్రం సాయి కొర్రపాటి, ఎన్వి ప్రసాద్, సత్యనారాయణ, సీడెడ్ బ్రహ్మం ఇలా పలువురి పేర్లు ప్రముఖంగా వినిపిస్తుంటాయి. సింగిల్ థియేటర్ల ఓనర్లు ఎక్కడికి అక్కడ ఉండనే ఉన్నారు.

విధేయ రాముని విధ్వంసం చూడండి!

–రామ్‌చరణ్

'రంగస్థలం' చిట్టిబాబుగా రామ్‌చరణ్ నటనకు వందకు రెండొందలు మార్కులు వేశారు ప్రేక్షకులు. ఆ సినిమా కెరీర్ బెస్ట్ హిట్‌గా నిలిచింది. 2018లో నాన్ బాహుబలి కేటగిరీలో ఇండస్ట్రీ రికార్డుల్ని బ్రేక్ చేసింది. ఆ సినిమా తర్వాత మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ నటించిన తాజా చిత్రం 'వినయ విధేయ రామ'. బోయపాటి శ్రీను దర్శకత్వంలో డివివి ఎంటర్ టైన్‌మెంట్స్ పతాకంపై డి.వి.వి.దానయ్య నిర్మించారు. ఈ చిత్రం జనవరి 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రామ్ చరణ్ హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..





- **విధేయ రాముని పాత్ర గురించి?**

ఈ సినిమాలో రామ్ పాత్రలో నటించాను. ప్రతి ఇంట్లో ఇలాంటి కొడుకు ఒకడు ఉండాలి అనుకునేలా బోయపాటి ఆ పాత్రను తీర్చిదిద్దారు. రాముడులా వినయంగా వుంటూ అవసరమైతే విధ్వంసం కూడా సృష్టించే వాడిగా కనిపిస్తాను. విధేయ రాముని విధ్వంశానికి ప్రతీకగా ఉంటుంది.

- **'రంగస్థలం' తరువాత ఏ జోనర్ అనుకున్నారు?**

ఒక నటుడుగా ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకూడదు. అన్ని జోనర్లలో సినిమాలు చేయాల నేదే నా ఉద్దేశం. 1980లో నాన్న గారు కూడా అన్ని జోనర్లలో సినిమాలు చేశారు. జోనర్ కంటే కూడా ఒక సెన్సిబుల్ సినిమా చేయాల నుకున్నాను. అందుకే ఇది అంగీకరించాను.

- **మాస్ డైరెక్టర్ బోయపాటితో కొత్త అనుభవంపై..?**

రంగస్థలం షూటింగ్ అయిపోయాక 25వ రోజుల గ్యాప్ లో ఈ సినిమా షూటింగ్ ను మొదలు పెట్టాం. బోయపాటికి వున్న కమిట్‌మెంట్స్.. అలాగే నా కమిట్‌మెంట్స్ వల్ల సినిమా షూటింగ్ ను తొందరగా మొదలు పెట్టాం. అయితే డైరెక్టర్ కు ఉన్న క్లారిటీ వల్ల నాకు ఈ పాత్ర చేయడం పెద్ద కష్టమేమి అనిపించలేదు. అయితే సినిమా ప్రారంభించే ముందు నాకు ఇంకా సమయం ఉంటే బాగుండేది అనిపించింది. బోయపాటి ప్రతి సీన్‌ని ముందే సెట్స్‌లో చేసి చూపించ మనేవాడు.

- **తెరపై 300 మందిని అయినా చంపారా?**

కనీసం వందమందికి తగ్గకూడదు కదా షేర్‌ఖాన్ (మగధీర డైలాగ్..)!

- **నిర్మాత దానయ్య గురించి?**

నిర్మాత చాలా సౌకర్యవంతమైన వ్యక్తి. ఆన్ సెట్స్ చాలా ఫ్రీగా అనిపించింది. సినిమా చేస్తున్నంతసేపూ ఏ విషయంలోనూ ఇబ్బంది పడలేదు.

- **ఆర్‌ఆర్‌ఆర్‌లో మీ పాత్ర?**

దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి మళ్లీ డీ–గ్లామరైజ్డ్ పాత్రను సృష్టించారు. ఈ పాత్ర ప్రేక్షకులకు చాలా బాగా కనెక్టవుతుంది. ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురు చుస్తున్నాను. ఈ సంవత్సరం మొత్తం ఈ సినీమాకే కేటాయించాను.

- **'ఆర్‌ఆర్‌ఆర్'లో ఎన్టీఆర్‌తో అనుభవం?**

ఎన్టీఆర్ నాకు చాలా క్లోజ్ ఫ్రెండ్ ఎప్పటినుండో. ఇక ఈ చిత్రంలో మా ఇద్దరి కాంబినేషన్ సన్నివేశాలు చాలా బాగా వస్తున్నాయి. ఎన్టీఆర్ తో కలసి పనిచేస్తుండడం మంచి అనుభూతిని ఇస్తోంది. నేను కూడా నాన్నగారిలా అందరితోనూ కలిసిపోతాను.

- **మహేష్‌తో స్నేహంపై?**

మహేష్‌తో స్నేహం ఇటీవలే ప్రారంభమైంది. బాగా క్లోజ్ అవుతున్నాం.

- **మీ బ్యానర్‌లో వేరే హీరోలకు ఛాన్సుందా?**

అది కేవలం నాన్న గారి సినిమాల కోసం మాత్రమే పెట్టాను. అందులో నేను హీరోగా కూడా సినిమాలు చేయను. నాకు చాలా మంచి నిర్మాతలు వున్నారు. ప్రస్తుతానికైతే వేరే హీరోలతో సినిమాలను నిర్మించే ఆలోచన లేదు.

- **'సైరా–నరసింహారెడ్డి' విడుదల ఎప్పుడు?**

సమ్మర్‌లో అనుకుంటున్నాం.. కుదిరితే ఓకే లేదంటే దసరాకు గ్యారంటీగా రిలీజ్ చేస్తాం. సైరా చిత్రానికి రూ.200కోట్ల బడ్జెట్‌ని కేటాయించాం.

- **నాన్నగారి రెమ్యునరేషన్?**

ఇప్పటివరకూ ఏ నిర్మాతా ఇవ్వనంత రెమ్యునరేషన్ ఇచ్చాను. అయినా ఆ విషయం నాన్నగారినే అడగండి.

- **ఉపాసన మీ సినిమాలకు ప్రచారం చేస్తున్నారు!**

ఈమధ్య హీరోల భార్యలు సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటున్నారు. ఉపాసనే కాదు .. అందరు హీరోల భార్యలు ఇదే చేస్తున్నారు. అయినా ఉపాసనకు అపోలోలో వేరే జాబ్ ఉంది కదా!

- **నిర్మాతగా మీలో మార్పు?**

ఆన్ లొకేషన్ ప్రధాన సాంకేతిక నిపుణులతో పాటు, ఇతర ప్రొడక్షన్ సభ్యులందరికీ పాకెట్ మనీ ఇస్తాను. కుటుంబాల్ని వదిలి నాతో పాటే దూరంగా వచ్చేస్తారు కాబట్టి, వాళ్లంతా నా మనుషులే కదా! అందుకే వాళ్లకు సిమ్ కార్డులు కూడా ఇస్తాను. ఎవరూ ఇబ్బంది పడకూడదనే. ఒక నిర్మాతగా అది నా స్వార్థం కూడా. అందరూ బాగా పని చేస్తారనే.



సంక్రాంతి అల్లుళ్లు వస్తున్నారు..

ఇక నవ్వులే నవ్వులు

విక్టరీ వెంకటేశ్, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోలుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మిస్తున్న చిత్రం 'ఎఫ్ 2'. 'ఫన్ అండ్ ఫ్రస్టేషన్' ట్యాగ్ లైన్. తమన్నా, మెహరీన్ నాయికలు. అనిల్ రావిపూడి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న సినిమా విడుదలవుతుంది. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ "రాజాదిగ్రేట్ తర్వాత ఏ సినిమా చేయాలని అనుకున్నప్పుడు అనీల్ ఈ ఐడియా చెప్పాడు. అప్పటి నుండి 15 నెలల పాటు ఈ జర్నీని ఎంజాయ్ చేస్తూ వచ్చాం. అనీల్‌తో ఇది మూడో సినిమా. కానీ మూడు సినిమాల ప్రయాణంలో ఎక్కడా చిన్న క్లాష్ రాలేదు. వెంకటేష్గారు, వరుణ్, తమన్నా, మెహరీన్ సహా ప్రతి పాత్రలో వినోదం కనపడుతుంది. థియేటర్‌లో 2గంటల 26 నిమిషాల్లో గంటన్నర పాటు నవ్వుకూనే ఉంటారు. సంక్రాంతికి ఎఫ్ 2 అందరికీ వినోదాన్ని పంచి సక్సెస్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం" అన్నారు. వెంకటేష్ మాట్లాడుతూ "చాలా రోజుల తర్వాత ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, మల్లీశ్వరి, నువ్వు నాకు నచ్చావ్ తర్వాత పూర్తి స్థాయి కామెడీ మూవీ చేయలేదు. చాలా గ్యాప్ తర్వాత అలాంటి మూవీ చేశాను. దిల్రాజుగారు, అనీల్ గారు నేను కామెడీతో మెప్పిస్తానని నమ్మకంతో నా వద్దకు రావడంతో ఎఫ్ 2 సినిమా చేశాను. వరుణ్ చక్కగా చేశాడు. తమన్నా, మెహరీన్ సహా అందరితో నటించడం హ్యపీగా ఉంది. క్యారెక్టర్స్ అన్నీ చక్కగా డిజైన్ చేశారు. తప్పకుండా సినిమాను ఎంజాయ్ చేస్తారు. సంక్రాంతికి పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఫన్ మూవీ" అన్నారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ "డిఫరెంట్ జోనర్‌లో సినిమాలు చేస్తూ వచ్చాను. ఆ క్రమంలో కామెడీ సినిమాలు కూడా చేయాలనుకున్నాను. నా కెరీర్లో ఎంత కామెడీ చేయాలనుకున్నానో దాన్ని అంతా అనిల్ ఒక సినిమాలో చేయించేశాడు. ఇలాంటి పాత్ర చేయడం, ఇలాంటి మంచి సినిమా చేయడం ఆనందంగా ఉంది. నిర్మాతలు, అనీల్ సహా అందరికీ థాంక్స్.

వెంకీగారు కామెడీ అంటే ఇరగదీస్తారు. ఆయనతో చేయడమంటే కాస్త టెన్షన్ పడ్డాను. అయితే ఆయన కంఫర్ట్ ఇచ్చి సినిమాను చేయించారు. ఆయనతో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు.

థియేటర్ల సమస్య అందరిదీ : దిల్ రాజు

సంక్రాంతి బరిలో నాలుగు సినిమాల మధ్య పోటీ నెలకొంది. ఆ క్రమంలోనే రజనీ పేట చిత్రానికి థియేటర్లు ఇవ్వలేదంటూ అశోక్ వల్లభనేని ఆరోపించారు. నిన్నటి సాయంత్రం జరిగిన పేట ప్రచార వేదికపై ఆ నలుగురిపై సీరియస్ అయ్యారాయన. తమకు థియేటర్లు ఇవ్వకుండా వందలాది థియేటర్లలో తమ సినిమాల్ని మాత్రమే వేసుకుంటున్నారని, రజనీకాంత్ అంతటి పెద్ద హీరోకే ఈ పరిస్థితి ఉంటే ఇతరుల పరిస్థితి ఎలా ఉంటుందో అంటూ వ్యాఖ్యానించారు. నయీమ్‌ని షూట్ చేసినట్టే ఆ నలుగురిని కూడా షూట్ చేయాలని తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.

దీనికి 'ఎఫ్ 2' నిర్మాత దిల్ రాజు కౌంటర్ వేశారు. హైదరాబాద్ రామానాయుడు స్టూడియోస్ లో 'ఎఫ్ 2' ట్రైలర్ వేడుకలో దిల్ రాజు అశోక్ వల్లభనేని కామెంట్లను తప్పు పట్టారు. తెలిసో తెలియకో వ్యాఖ్యానించారు. థియేటర్ల సమస్య చాలా పెద్దగా ఉంది. తెలుగు లో మూడు ప్రతిష్ఠాత్మక చిత్రాలు ఈ సంక్రాంతికి వస్తున్నాయి. వీటన్నిటికి ఆర్నెళ్ల ముందే రిలీజ్ తేదీల్ని ప్రకటించారు. 15 రోజుల క్రితం డబ్బింగ్ సినిమాని కొనుక్కుని థియేటర్లు ఇవ్వలేదంటూ గోల పెడుతున్నారాయన. తెలుగు సినిమాలకే థియేటర్ల సర్దుబాట్ల గురించి నానా తంటాలు పడుతున్నాం. అందరం కలిసి అండర్‌స్టాండిగ్ పై వెళుతున్నాం. ఆయన ఏదో మాట్లాడారట. ఈ కామెంట్లు చేసిన ఆయనే నవాబ్, సర్కార్ చిత్రాలు రిలీజ్ చేశారు. సర్కార్ సినిమాకి ఎన్ని థియేటర్లు కావాలో అన్ని వేసుకున్నారు. కానీ ఇప్పుడు థియేటర్లు ఇవ్వలేదని తెలుగు సినిమాని తగ్గిస్తూ కామెంట్లు చేశారు.. అనీ అన్నారు. "మేమూ ఆయనలానే మాట్లాడగలం. కానీ నాకు ఒక క్యారెక్టర్ ఉంది. ఇక్కడ మేం చేస్తోంది వ్యాపారం. అతడైనా సినిమా రిలీజ్ చేసేది ధనార్జన కోసమే. సంవత్సరంలో డిస్ట్రిబ్యూషన్‌లో ఎన్నో డబ్బుల పోయాయి. కేవలం ప్యాషన్ తోనే ఇక్కడ పని చేస్తున్నాం. డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాం. సినిమాలు తీస్తున్నాం" అనీ అన్నారు. తెలుగు సినిమాలు మూడు క్రేజీ గా రిలీజవుతున్నాయి. వినయ విధేయ రామ భారీ బడ్జెట్ తో తెరకెక్కిన సినిమా. ఎన్టీఆర్ కథానాయకుడు ప్రతిష్ఠాత్మక చిత్రం. మల్టీస్టారర్ చిత్రం ఎఫ్ 2 ప్రతిష్ఠాత్మకమైనది. వీటికే థియేటర్ల సమస్య ఉంది.. అని దిల్ రాజు అన్నారు.

పచ్చడి రుచి చూడాలి!



అక్కినేని కోడలు సమంత శుభవార్త చెబుతోందా? అంటే అవుననే తాజా హింట్ చెబుతోంది. తాజా హింట్ ప్రకారం.. 2019 లో అక్కినేని ఇంట శుభవార్త ఉంటుందని అర్థమవుతోంది. ఆ మేరకు అక్కినేని సమంత తన ఇన్‌స్టాగ్రమ్ లో హింట్ ఇవ్వడంపై ఆసక్తికర చర్చ సాగుతోంది. నాకు కొన్ని పచ్చళ్లు(పికిల్స్) ఎలా వచ్చేది? అంటూ విదేశాల్లో పర్యటనలో ఉన్న సమంత హింట్ ఇవ్వడం పై ముచ్చట సాగుతోంది. ఒక అందమైన ఫోటోకి క్యాప్షన్ గా పచ్చడి మాట ఎత్తారు. అలాగే 2019లో (కొత్త సంవత్సరం)లోకి నెమ్మదిగా అడుగులు వేస్తున్నా.. అంచనాలు పెద్దగానే ఉన్నాయి అంటూ మరో హింట్ ఇచ్చారు సామ్. అంటే 2019లో అక్కినేని ఇంట గుడ్ న్యూస్ వినిపించబో తోందనే దీనర్థం. అక్కినేని లిటిల్ హీరో పుట్టుకొస్తున్నాడనే అభిమానులు భావిస్తున్నారు. ఇక సమంత, నాగచైతన్య ప్రస్తుతం మజిలీ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 2017లో సమంత అక్కినేని బుల్లోడు నాగచైతన్యను పెళ్లాడిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలోనే ఈ జోడీ పెళ్లి తర్వాత సెలబ్రేషన్స్ కంటే కెరీర్ పైనే ఎక్కువ ఫోకస్ చేయడంతో కొన్నిటిని వాయిదా వేసుకున్నారు. ఆ సంగతిని మీడియాకి ఓపెన్ గానే ప్రకటించిన సంగతి తెలిసిందే.

పెళ్లి చూపులు నిర్మాత వారసుడు హీరోగా

ఇటీవల పెళ్లి చూపులు, మెంటల్ మదిలో చిత్రాలని నిర్మించి నేషనల్ అవార్డ్, ఫిల్మ్ ఫేర్ ఆవార్డులని పొందిన రాజ్ కందుకూరి.. ఇప్పుడు ధర్మపథ క్రియేషన్స్‌పై మరో లెడీ డైరెక్టర్‌ని సినిమా రంగానికి పరిచయం చెస్తున్నారు. అందులో తన కుమారుడు శివ కందుకూరి హీరోగా కనిపించబోతున్నారు. ప్రముఖ దర్శకులు సుకుమార్ మరియు క్రిష్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చెసిన శేష సింధు రావ్ ని ఈ చిత్రంతో దర్శకురాలుగా రాజ్ కందుకూరి పరిచయం చేస్తున్నారు.





అదే పెద్ద ఛాలెంజ్

– కంగన

బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ మణికర్ణిక చిత్రంతో ఈనెలాఖరులో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి – కంగన సంయుక్తంగా దర్శకత్వం వహించారు. క్రిష్ కొన్ని అనివార్య కారణాల రీత్యా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవడంతో కంగన ఈ ప్రాజెక్టును పూర్తిచేశారు. దీనిపై కంగన స్పందిస్తూ, ఒక సినిమాకు దర్శకనటిగా వ్యవహరించడం అంత తేలికైన పని కాదని, అందుకు ఎంతో అంకితభావం అవసరమన్నారు. ఈ చిత్రాన్ని ఈనెల 25వ తేదీన విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇటీవలే తెలుగు, తమిళ్ ట్రైలర్లు రిలీజై ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ట్రైలర్ వేడుకలో కంగనా రనౌత్ మాట్లాడుతూ "ఒక సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తూనే, దర్శకురాలిగా ఉండటం చాలా కష్టమైన పని. కానీ నా అదృష్టం కొద్దీ క్రిష్ సహాయం చెయ్యడం వల్ల కథపైన ఎక్కువ దృష్టి పెట్టాను. నటులు షాట్ అయిన తర్వాత కారవ్యాన్‌లోకి వెళ్లి రిలాక్సవుతారు. కానీ దర్శకురాలిని కాబట్టి ఆ తర్వాత కెమెరా దగ్గరకు వచ్చి నుంచునేదాన్ని" అని చెప్పుకొచ్చింది.



పూజా ఎస్కేప్ ప్లాన్

'ముకుంద', 'ఒక లైలాకోసం' చిత్రాల్లో నటించిన పూజా హెగ్డే ఆ తర్వాత బాలీవుడ్ లో హృతిక్ మూవీ 'మొహెంజదారో'లో నటించింది. ఆ సినిమా సక్సెస్ కాకపోవడంతో తెలుగులో 'డీజే' చిత్రంతో గ్రాండ్ గారీ ఎంట్రీ ఇచ్చింది. అందాల ప్రదర్శనతోపాటు ఫుల్ ఎనర్జిటిక్ నటనతో పూజా హెగ్డే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ చిత్రం తర్వాత తెలుగులో పూజా హెగ్డే లక్కీ గాళ్ అన్న పేరు దక్కించుకుంది. ఎన్టీఆర్ తో 'అరవింద సమేత' చిత్రంతోపాటు బెల్లంకొండతో 'జయ జానకి నాయక' సినిమా చేసింది. ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తోంది. ఇటీవలే తాను ఒక పెద్ద సినిమాలో ఎంపిక అయ్యానంది. అయితే ఆ సినిమా వివరాలను మాత్రం తెలపలేదు. దాంతో ఈమె అల్లు అర్జున్ – త్రివిక్రమ్ మూవీకి ఓకే అయ్యిందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఆ విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది. తెలుగులో స్టార్ హీరోయిన్స్ జాబితాలో ఉన్న పూజా హెగ్డే బాలీవుడ్‌కు పరిమితం అయ్యేనా అంటూ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా పూజాకు వచ్చిన ఆఫర్ తో బాలీవుడ్ లో క్రేజీ ఆఫర్ వచ్చిందిట. స్టార్ డైరెక్టర్ రోహిత్ శెట్టి 'సింబా'తో సక్సెస్ అందుకుని తన తదుపరి చిత్రాన్ని అక్షయ్ కుమార్‌తో చేయబోతున్నాడు. ఇక అక్షయ్ కుమార్‌కు జోడీగా పూజా హెగ్డేను ఎంపిక చేశారని తెలుస్తోంది. ఈ సినిమా సూపర్ హిట్ అవ్వడం ఖాయమని దాంతో బాలీవుడ్ లో పూజా హెగ్డే బిజీ అవ్వనుందని అలా టాలీవుడ్‌ను పూజా వదిలేస్తుందే మోనని ఊహాగానాలు సాగుతున్నాయి.

రోగనిరోధక శక్తి పెరగాలంటే..

తోటకూర, మెంతికూర, పాలకూర వంటి ఆకు కూరలు, బీర, పొట్ల, ముల్లంగి, టమోటా కూరలను, ద్రాక్ష వంటి పండ్లను నిత్యం తినడం మంచిది. బలహీనంగా ఉన్నవారు నారింజ, ఆపిల్ పండ్ల రసాలను తాగాలి. తక్కువ కొవ్వు పదార్థములను కూడా తినాలి. క్యాల్షియం, ఐరన్, విటమిన్స్ ఎక్కువగా, మాంసకృత్తులు తక్కువగా కలిగిన ఆహార పదార్థాలు తినాలి. అప్పుడే జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. వీలైనంతసేపు నడవడం మంచిది. చెమట ఎక్కువగా పట్టేలా పని చేయాలి. ఇలా చేయడం వలన శరీరంలోని మలినాలు తొలగిపోతాయి.



అపురూప బంధం.. స్నేహం

స్నేహం అపురూపమైన బంధం. కష్టాలలో, నష్టాలలో కూరుకుపోయినప్పుడు మేమున్నామంటూ తోడుగా ఉండే వాళ్లే నిజమైన స్నేహితులు. స్నేహానికి ఆడా, మగా తేడా తెలియదు. పెళ్లికి ముందున్న స్నేహబంధం వివాహానంతరం విడిపోవాల్సిందేనా అన్నది చాలామందికి కలిగే సందేహం! స్నేహానికి, వివాహానికి సంబంధం లేదంటున్నారు కొందరు. వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే!



పెళ్లి అవ్వగానే చాలామంది అమ్మాయిలు స్నేహం కొనసాగించాలని ఉన్నా... ఆ మాటని మర్చిపోవడానికి ప్రయత్నిస్తారు. మూడు ముళ్ళ బంధంతోనే చిన్నప్పటి స్నేహబంధాలను కూడా వదులుకుంటారు. అందుకు కారణాలు ఏవైనా కావొచ్చు. కానీ, స్నేహంతో మానసిక వ్యధను తొలగించుకోవచ్చు. స్నేహంలోని గొప్పదనం, విలువ స్నేహం చేసే వాళ్లకే తెలుస్తుంది. స్నేహానికి వాళ్లు, వీళ్లు అనే తేడా ఉండదు. పెళ్లైన వారు, పెళ్లి కాని వాళ్లతో, ఆడవారు మగవాళ్లతో స్నేహం చేయొచ్చని, వాళ్ల ఏళ్ల తరబడి అనుభవాలతో చెప్పిన వీరి అనుబంధపు ముచ్చట్లు మీకోసం...

స్నేహం... ఇది ఒక చిన్న పదం కావచ్చు. కానీ ఈ పదానికి ఉన్న విలువ అంత ఇంత కాదు. స్నేహానికి విలువ కట్టలేము. స్నేహితుడు లాంటి తోడు జీవితంలో మరేతోడు ఉండదు. అందుకే అందరు ఇష్టపడేది స్నేహాన్నే. స్నేహం అంటే చిరకాల బంధం. ఇద్దరు స్నేహితులు మధ్య ఏ అపోహలు ఉండకూడదు. తల్లితండ్రులు బిడ్డపై చూపే ఆప్యాయత స్నేహబంధంలో స్పష్టం చేస్తుంది. వింతగా ఉండవచ్చు ఒక అబ్బాయి మరొక అబ్బాయిని లేక ఒక అమ్మాయి మరొక అబ్బాయితో వివాహానంతరం స్నేహం కొనసాగించడం సాధ్యమా అని! ప్రేమించడం సాధ్యమా అని? ఇది సాధ్యమే, మనసులో ఏ చెడు ఆలోచన లేకుండా మిత్రున్ని మిత్రుడిగా ప్రేమించడం సాధ్యమే. ఎంత దగ్గరి స్నేహితులైనా గొడవలు, గిల్లికజ్జాలు సహజం. తప్పు చేసినప్పుడు క్షమాపణ కోరడం తప్పేం కాదు. పొగడ్తలకే పరిమితం అయ్యేవాడు స్నేహితుడు కాదు. తప్పు చేస్తే విమర్శించాలి. అది మిత్రుడి మనసును నొప్పించకుండా ఉండాలి. అనుభూతులు, భావోద్వేగాలు స్నేహితుల్ని తయారు చేయవు. వారితోటి స్నేహితుల అలవాట్లు, అభిరుచులు, కుటుంబాన్నీ గౌరవించడం నిజమైన స్నేహం లక్షణం. స్నేహమనేది అనిర్వచనీయమైన అనుభూతి. స్నేహం చేయడం ఒక కళ. చాలా కొద్దిమంది మాత్రమే స్నేహన్ని దేవుడిచ్చిన బహుమతిగా భావిస్తారు.

– తాడాల మహాలక్ష్మీ



నాగార్జున- హిమజ




మమ్మల్ని కలిపింది ఫేస్‌బుక్. ఇలా ఫ్రెండ్స్ అయినా ఎప్పుడూ, ఎక్కడా మేము కలుసుకోలేదు, చూసుకోలేదు. కొన్ని రోజుల తర్వాత హిమజ బ్లెడ్ రిక్వైర్‌మెంట్ ఒకటి పోస్ట్ చేసింది. నా బ్లెడ్ గ్రూప్ అదే కావడంతో వెళ్ళి డొనేట్ చేశాను. దానికంటే రెండేళ్లముందే సమాజానికి ఏదైనా చేయాలని ఫేస్‌బుక్‌లో బ్లడ్ డొనేషన్ అనే పేజీ క్రియేట్ చేశాను. అయితే నాకు టైమ్, ఎవ్వరి సపోర్ట్ లేక అలాగే ఉంచేశాను. కొన్ని రోజుల తర్వాత హిమజ ఇంకొక పోస్ట్ పెట్టింది. ఇంజనీరింగ్ కాలేజ్‌లో నీకు తెల్సినవారు ఎవరైనా ఉన్నారా? పేషెంట్స్ కోసం బ్లడ్ డొనేట్ ప్రోగ్రామ్ చేద్దాం అని. అనుకున్న తడవుగా ఒక్క నెలలోనే కాలేజ్‌లో పర్మిషన్ తీసుకొని బ్లడ్ డొనేట్ ప్రోగ్రామ్ చేశాము. అప్పుడే మేము మొదటి సారి కలవడం. అక్కడి నుంచే మా ఫ్రెండ్‌షిప్ స్టార్ట్ అయింది. హిమజ చేసే ప్రోగ్రామ్స్ నచ్చి, తనతో ఇంటరాక్ట్ అవ్వడం మొదలుపెట్టా. ఇద్దరం వివాహితులం. తన ఫౌండేషన్ ద్వారా ఎక్కువ సర్వీస్ చేయొచ్చు అని నమ్మకం కలిగింది. నా ప్లాన్స్ సలహాలు నచ్చడంతో ఫౌండేషన్‌లో జాయిన్ అయ్యాను. ఇద్దరం ఒకరికొకరం విషయాలను చర్చిస్తూ, పని విషయంలో ఎన్ని విభేధాలు వచ్చినా మంచి పనికే కదా అని కోపం వచ్చినప్పుడు ఒకరం తగ్గడం, అభిప్రాయాలకు విలువ ఇచ్చుకోవడం ద్వారా మా ఫ్రెండ్‌షిప్ ఇంకా బలపడింది.

నాగార్జున భార్య శరణ్య: వీళ్ళిద్దరి స్వచ్ఛమైన స్నేహం. ఇద్దరూ కొట్టుకుంటే, తిట్టుకుంటూ ఉన్నప్పుడు చూడాలి టామ్ అండ్ జెర్రీ.

హిమజ భర్త రవి: నాకు హిమజకి చిన్నప్పటి నుంచి ఉన్న ఫ్రెండ్స్ అందరూ బాగా తెలుసు. అందరూ తనని బాగా చూసుకుంటారు. కానీ నాగార్జున మాత్రం తన ఇంట్లో వాళ్లలా కేర్ తీసుకుంటాడు. గొడవ పడ్డా మళ్ళీ వాళ్లే మామూలు అయిపోతారు. ఫౌండేషన్ విషయంలో చాలా హార్డ్ వర్క్ చేస్తారు. పర్సనల్ లైఫ్‌లో మాత్రం సొంత మనుషుల్లా అందరం కలిసిపోతాము.

దినకర్, లక్ష్మి




నాకు ఇంకా పెళ్ళి కాలేదు. నా ప్రొఫెషన్‌లో ఒక వివాహిత పరిచయం అయ్యింది. తన పేరు లక్ష్మి. నాకు ఆ పేరంటే చాలా ఇష్టం. ఎందుకంటే మా అమ్మ పేరు కూడా లక్ష్మినే. తన గురించి నాకు ఫస్ట్‌లో ఏమీ తెలీదు. రెండు, మూడు సార్లు పరిచయానికే నన్ను నమ్మి నాతో అన్ని షేర్ చేసుకునేవారు. ఎంతోకాలం నుంచి తెల్సిన వాళ్ళనే నమ్మలేని ఈ రోజుల్లో నన్ను ఇంతలా నమ్మి అన్ని షేర్ చేసుకోవడం ఆశ్చర్యం కలిగించి, తన మీద గౌరవం పెరిగింది. తను ఇక ఫౌండేషన్ స్టార్ట్ చేసి సర్వీస్ చేస్తుండడం ఇంకా నచ్చింది. తర్వాత ఏం ప్రోగ్రామ్స్ చేయాలనే విషయాలన్నీ మాట్లాడేవారు. నాకు చాలా ప్రయారిటీ, ఇంపార్టెన్స్ ఇవ్వడం చాలా బాగా నచ్చింది. ఒక రోజంతా కష్టపడి తన ప్రాబ్లమ్‌ని సాల్వ్ చేశాను. ఎవరితో ఎలా మాట్లాడాలి, ఫ్యామిలీ వాళ్ళతో ఎలా ఉండాలి తనని చూసే నేర్చుకున్నాను. తన ద్వారానే నాకు ఫ్యామిలీకి ఇవ్వాల్సిన ఇంపార్టెన్స్ అర్థం అయ్యింది. నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను. తను చాలా సెన్సిటివ్, డెడికేటెడ్ అలాగే హార్డ్‌వర్కర్. తన ఫౌండేషన్‌లో చేరాను. చాలా మంది లక్ష్మి చేస్తున్న పనిని కామెంట్ చేసినా తను మాత్రం అవేం పట్టించుకోకుండా, వర్క్‌ని సక్సెస్ చేసేది. ఆ పని పట్ల అంకితభావం తన నుంచే నేర్చుకున్నాను. తన భర్త వంద శాతం సహకరించేవారు. ఈ జర్నీలో లక్ష్మి భర్తతో పరిచయం ఏర్పడి నాకు సజేషన్స్ ఇచ్చి మోటివేట్ చేశారు. నన్ను వాళ్ల ఫ్యామిలీలో ఒకడిగా ట్రీట్ చేస్తారు. వాళ్ల కుటుంబంలో నేనూ ఒక వ్యక్తిని అని గర్వంగా చెప్తున్నాను.

లక్ష్మి భర్త శ్రీనివాసరావు: వారి స్నేహం కలకాలం కొనసాగాలని ఆశిస్తున్నాను. దినకర్ తనకే కాదు, నాకూ మంచి ఫ్రెండ్ అని గర్వంగా ఎప్పటికీ చెప్తాను.


కన్యాకుమారి, ఆదిశేషారెడ్డి, అఫ్జల్





నాకు పెళ్ళి అయిన ఫ్రెండ్ అలాగే పెళ్లి కాని ఫ్రెండ్ ఇద్దరూ ఉన్నారు. ఆదిశేషారెడ్డి, వివాహితుడు, అఫ్జల్ వివాహం చేసుకోలేదు. మా నాన్నగారు మామయ్య గారు మంచి స్నేహితులు. అయితే మా అత్తగారికి కట్నం తీసుకోవాలనే ఆశ ఉండేది. కులం వేరు కావడంతో మా పెళ్ళి ఆవిడకి నచ్చలేదు. మా వారు కాంట్రాక్ట్స్ చేసేవారు. నేను కూడా ఆయనతో వెళ్తూ ఉండేదాన్ని నెల్లూరు వచ్చినపుడు హోటల్‌లో స్టే చేశాము. కోడలు బయట ఉండడం ఏమిటని ఆదిశేషారెడ్డిని మామయ్య రాయబారానికి పంపించారు. నేను రానని ఏడ్చేశాను. మేమంతా ఉన్నాం కదా అని అత్తగారింటికి తీసెకెళ్లారు. అప్పుడే ఆదిశేషారెడ్డి భార్యని కూడా ఫస్ట్ టైమ్ చూడడం, తను నన్ను ఎంతో అభిమానంగా సొంత చెల్లిలా చూసుకునేవారు. మా వల్ల కొన్ని కష్టాలు, ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చినా కష్టసమయంలో నాకు తోడుగా ఉన్నారు. నలభై సంవత్సరాల నుంచి ఈ స్నేహం అలానే కొనసాగుతున్నది. మా ఫ్యామిలీ మెంబర్స్ కూడా మా ఫ్రెండ్‌షిప్‌ని అక్సెప్ట్ చేశారు.

అఫ్జల్ గురించి చెప్పాలంటే – అఫ్జల్ ముస్లిం తనని అబ్దుల్ అని పిలుస్తారు. తనకు అమ్మా, నాన్న, సిస్టర్స్, బ్రదర్స్ ఉన్నారు. వాళ్ళది చాలా ధనిక కుటుంబం. నెల్లూరులో హోమ్ అప్లయన్స్ షాప్ ఉంది. నాకు బజారుకు వెళ్ళడం షాపింగ్ చేయడం అలవాటు లేదు భయంగా ఉండేది. వాళ్ళ షాప్‌లో కుక్కర్ కొనడానికి వెళ్ళాను అలా ఫ్రెండ్‌షిప్ మొదలైంది. తనది చిన్నపిల్లల మనస్తత్వం. మా ఫ్యామిలీలో తనంటే అందరికీ ఇష్టం. మంచి, చెడు నాతో షేర్ చేసుకునేవాడు. తనకి తెలుగు సరిగ్గా రాదు. కాబట్టి నాలుగు రకాల భాషలను కలిపి మాట్లాడుతుంటే తమాషాగా ఉండి నవ్వుకునే వాళ్ళం. వాళ్ల అమ్మకి క్యాన్సర్ అని తెలిసి రిపోర్ట్స్ తెచ్చి చూపించి పెద్దగా ఏడ్చేశాడు. వాళ్ళ అక్క ఆర్థరైటీస్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యింది. ఆమెను చంటిపిల్లలా చూసుకునేవాడు. వారి కోసమే పెళ్లి చూడా చేసుకోలేదు. రోజూ ఫోన్ చేసి, బజారు నుంచి ఏమైనా కావాలా అని అడుగుతాడు. స్నేహానికి ఎంత విలువ ఇస్తాడో, లెక్కల దగ్గర అంతే ఖచ్చితంగా ఉండేవాడు. ఇంత ఖర్చు అయ్యిందని అడిగి మరీ తీసుకునేవాడు. నేను ఏడ్పించేదాన్ని. ఆడవాళ్లు ఆడవాళ్లతోనే ఫ్రెండ్‌షిప్ చేయాలి అనేది కరెక్ట్ కాదు. అన్నా, చెల్లెల్లు, తండ్రి కూతుళ్లు కలిసి వెళ్తున్నా తప్పుగా చూసేవాళ్ళు చాలా మంది ఉన్నారు. మనస్సులో తప్పుడు ఆలోచనలు లేనప్పుడు సమాజానికి వెరవాల్సిన అవసరం లేదు. ఆదిశేషారెడ్డి, అఫ్జల్ నా ఫ్రెండ్స్ అని గర్వంగా చెప్పుకుంటాను. ఒకరితో నలభై సంవత్సరాలు, మరొకరితో ఇరవై సంవత్సరాల ఫ్రెండ్‌షిప్ మాది. మా హజ్బెండ్‌కి వీళ్ళిద్దరూ చాలా ఇష్టం.



మాటే మంత్రం..

మేఘాలు అడ్డు పడినంత మాత్రాన
సూర్యుని వెలుగు తగ్గదు..
పరాజయాలు ఎదురైనంత మాత్రాన
వ్యక్తి విలువ మారదు..





మంచు మాయ

కాసేపు మంచు దిమ్మ పై నిలబడితే యెట్లా ఉంటుంది... శరీరమంతా గడ్డ కట్టుకుపోయి ప్రాణాలు గాల్లో కలిసిపోయిన ఫీలింగ్ కదూ!మరి మంచు కట్టడాల మధ్య సరదా విహారం ఊహించుకోండి. భలేగా ఉంటుంది కదూ. మరి అక్కడికే వెళ్తున్నాం ... చైనా లోని హార్బిన్ లో హెలాంగ్ జియాంగ్ ప్రావిన్స్ లో ఏటా ఇంటర్ నేషనల్ ఐస్ అండ్ స్నో ఫెస్టివల్ జరుగుతుంది. గత 35సంవత్సరాలుగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారట. ఈ వేడుకలలో మంచుతో నిర్మించిన భారీ కట్టడాలు సందర్శకులను కనువిందు చేస్తాయట. మరీ యింత మంచు ను ఎక్కడనుంచి సేకరిస్తారనే కదా మీ సందేహం... మంచుతో గడ్డకట్టుకు పోయిన సాంగువా రివర్ ను భారీ యంత్రాలతో పగులగొట్టి ఆ దిమ్మెలతో పలకలతో వీటిని నిర్మిస్తారట. బహుశా సాంగువా రివర్ నీళ్లు అతిగా మంచు కురిసే ఈ మధ్య కాలంలో గడ్డకట్టుకుని పోవడం వల్లేయిది సాధ్యపడిందేమో...అంటే జనవరి నుంచి ఫిబ్రవరి చివరివరకూ... ఏటా జనవరీ మొదటి వారం నుంచీ ఫిబ్రవరీ 5 వరకూ జరిగే ఈ ఫెస్టివల్ ను సందర్శించేందుకు ప్రపంచం నలు మూలల నుంచీ పది లక్షలకు పైగా పర్యాటకులు చైనాకు చేరుకుంటారు. ఫెస్టివల్ జరిగే ప్రాంతంలో మైనస్ 35 డిగ్రీల ఉష్ణోగ్రత వుంటుందట. ఈ చల్లటి వాతావరణంలో పర్యాటకులు ఎంచక్కా ఆడుకుంటారు... యెగిరి గంతులేస్తూ మంచు పై సందడి చేస్తుంటారు. మరి ఆలస్యం దేనికి మనమూ పోదాం చైనాకి...





వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం



దీపకాంతులతో వెలుగులు విరజిమ్ముతూ..



'చిటికె'లో సాధ్యం..!

- చీమల పుట్ట మొదట్లో సబ్బు ముద్ద కూరితే చీమలు పోతాయి.
- అల్లం, వెల్లుల్లి మిక్సీ పట్టేటపుడు చెంచాడు నూనె వేస్తే బరకగా కాకుండా, మెత్తగా అవుతుంది.
- బీ కాంప్లెక్స్ క్యాప్స్యూల్స్‌ను ఫ్లవర్ వాజ్‌లో వేస్తే, పువ్వులు ఎక్కువ కాలం తాజాగా కనిపిస్తాయి.

కోడిగుడ్లు
రిటైల్ ధర (100కు)

హైదరాబాద్	453	విజయవాడ	453
ముంబయి	508	ఢిల్లీ	493
చెన్నై	460	బెంగళూరు	455



బ్రాయిలర్ చికెన్
ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.

హైదరాబాద్	110	ఢిల్లీ	125
కరీంనగర్	115	ముంబయి	120
వరంగల్	120	చెన్నై	120



సెన్సెక్స్ +130.77
35,981



నిఫ్టీ +30.35
10,802

రూపాయి
₹69.68
(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి
32,835.00
(హైదరాబాద్‌లో) 24 క్యా..10 (గ్రాములకు)/(రూ.)లలో

ఇన్ఫోసిస్‌కు మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్ గుడ్‌బై



బెంగళూరు: దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ నుంచి మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైదొలిగారు. ఇన్ఫోసిస్ ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ యూనిట్ గ్లోబల్ హెడ్ సుదీప్ సింగ్ రాజీనామా చేశారు. దాదాపు రెండు దశాబ్దాలుగా కంపెనీలో పనిచేస్తున్న సుదీప్ తాజాగా తన బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. అయితే ఆయన రాజీనామాకు గల కారణాలపై స్పష్టత లేదు. మరోవైపు ఇన్ఫోసిస్ కూడా దీనిపై స్పందించలేదు. గతేడాది ఇన్ఫోసిస్ చాలా మంది కీలక ఉద్యోగులను కోల్పోయింది. సుదీప్ కంటే ముందు గతేడాది అక్టోబరులో ఇన్ఫీ కన్సల్టింగ్ గ్లోబల్ హెడ్ కెన్ టూంబ్స్ రాజీనామా చేశారు. అంతకు ముందు ఆగస్టులో కంపెనీలో కీలక ఎగ్జిక్యూటివ్ అయిన ఎండీ రంగనాథ్ కూడా సీఎఫ్‌వో పదవి నుంచి తప్పుకొన్నారు. గతేడాది జనవరిలో కంపెనీ యూరప్ కార్యకలాపాలకు హెడ్‌గా ఉన్న రాజేశ్ కృష్ణమూర్తి కూడా రాజీనామా చేశారు. ఇన్ఫీ హెల్త్ కేర్‌కు హెడ్‌గా ఉన్న సంగీతా సింగ్, మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్ నితేశ్ బంగా కూడా గతేడాది కంపెనీ నుంచి వైదొలిగారు.



డిజిటల్ చెల్లింపుల కమిటీ హెడ్‌గా నందన్ నిలేకని



ముంబై: దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, ఆర్‌బీఐ పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నాయి. నోట్ల రద్దు నేపథ్యంలో ప్రజల్లో నగదు వాడకాన్ని తగ్గించేందుకు చాలాకాలంగా డిజిటల్ చెల్లింపులను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. డిజిటల్ వాలెట్లు, మొబైల్ బ్యాంకింగ్ సహా పలు రకాలుగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, ఆర్‌బీఐ చొరవ చూపుతున్నాయి. కాగా, భారత్‌లో డిజిటల్ చెల్లింపుల మదింపునకు మంగళవారం ఆర్‌బీఐ నందన్ నిలేకని నేతృత్వంలో ఓ కమిటీని నియమించింది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఐదుగురు సభ్యులతో ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి నిలేకని నేతృత్వం వహిస్తారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నిలేకని యూపీఏ హయాంలో ఆధార్ అమలును పర్యవేక్షించే యూఐడీఏఐకి చైర్మన్‌గా వ్యవహరించారు.పీఆర్‌బీ సభ్యుల్లో అత్యధికులను ఆర్‌బీఐ కి సంబంధం లేనివారిని నియమించాలని, వీరిని కేంద్ర ప్రభుత్వం నియమించాలని కమిటీ సిఫారసు చేసింది. ఇదిలావుండగా పీఆర్‌బీ తప్పనిసరిగా ఆర్‌బీఐ పరిధిలోనే ఉండాలని, ఆర్‌బీఐ గవర్నర్ నేతృత్వం వహించాలని ఆర్‌బీఐ పేర్కొంది. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది.

రెండో రోజూ లాభాల్లో.. స్టాక్ మార్కెట్



- సెన్సెక్స్ 130. 77 పాయింట్లు లాభం
- లాభాల్లో ఫార్మా రంగ షేర్లు
- నష్ట పోయిన ఐటీ, విద్యుత్ రంగాల షేర్లు

ముంబయి: దలాల్ స్ట్రీట్ మంగళవారం లాభాలతో ముగిసింది. మంగళవారం ఉదతయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు తర్వాత స్వల్పంగా నష్టపోయి, తిరిగి లాభాల్లోకి వచ్చాయి. చివరి గంటలో మరికాస్త కోలుకున్నాయి. మౌలిక, ఐటీ, విద్యుత్ తదితర రంగాల షేర్లు నష్టపోగా, ఫార్మా రంగ షేర్లు లాభపడ్డాయి. ముఖ్యంగా సన్ ఫార్మా బాగా లాభాలను నమోదు చేసింది. చివరికి సెన్సెక్స్ 130.77పాయింట్లు లాభపడి 35,980.93 పాయింట్లకు చేరింది. నిఫ్టీ 30.40 పాయింట్లు లాభపడి 10,802.20 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంకు, ఎస్‌బీఐ , యస్ బ్యాంకు, టాటా మోటార్స్ తదితర కంపెనీలు లాభపడ్డాయి. జీ ఎంటర్‌టైన్ మెంట్ , యూపీఎల్, కొటక్ మహీంద్రా, ఎన్టీపీసీ, బీపీసీఎల్ తదితర కంపెనీల షేర్లు నష్టపోయాయి. రూపాయి విలువ బలహీన పడింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.70.17 వద్ద ట్రేడవుతోంది.

ప్రపంచంలో పెద్ద కెమెరా స్మార్ట్‌ఫోన్

ఢిల్లీ: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ మేకర్ హువావే సబ్ బ్రాండ్ హానర్ భారీ కెమెరాతో ప్రపంచంలోనే తొలి స్మార్ట్ ఫోన్‌ను లాంచ్ చేయనుంది. 48ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 589 సెన్సార్‌తో హానర్ వ్యూ 20 / హానర్ వి 20 పేరుతో జనవరి 29న భారత మార్కెట్‌లోకి లాంచ్ చేయనుంది. గత నెలలో ఈ స్మార్ట్‌ఫోన్‌ను చైనా మార్కెట్లో ఆవిష్కరించింది.

హానర్ వి 20 ఫీచర్లు

6.4 అంగుళాల ఎల్‌సీడీ డిస్‌ప్లే, 2130x1080 రిజల్యూషన్, హై సిలికాన్ కిరిన్ 980 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ పై 9, 6జీబీ/8జీబీ ర్యామ్, 128జీబీ/256 స్టోరేజ్, 48ఎంపీ రియర్ కెమెరా, 25 ఎంపీ సెల్ఫీ కెమెరా, 4000ఎంఏహెచ్ బ్యాటరీ,దీని ధర : సుమారు రూ. 30వేలు, హైఎండ్ వేరియంట్ ధర సుమారు రూ.35వేలు



ఐఎంఎఫ్ చీఫ్ ఎకనామిస్ట్‌గా తొలి మహిళ

- పదవిలో నియమితులైన గీతా గోపీనాథ్



వాషింగ్టన్: అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థలో చీఫ్ ఎకనమిస్ట్‌గా తొలి మహిళ నియమితులయ్యారు. భారత్‌లోని కర్ణాటకకు చెందిన గీతా గోపీనాథ్‌కు ఆ పదవి దక్కింది. ఐఎంఎఫ్‌లో అత్యున్నత పదవి పొందిన తొలి మహిళగా గీత ఘనత సాధించారు. ఆమె హార్వర్డ్ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్. ఐఎంఎఫ్ పరిశోధన విభాగం డైరెక్టర్‌గా పనిచేసిన మౌరీ ఆబ్స్టెఫెల్ డిసెంబరు 31 పదవీ విరమణ పొందారు. ఆయన పదవీ విరమణ తర్వాత గీతకు చీఫ్ ఎకనమిస్ట్‌గా పదవి దక్కింది.

గత ఏడాది అక్టోబరు 1వ తేదీనే గీతా గోపీనాథ్‌ను ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్‌గా నియమించుకుంటున్నట్లు ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టీన్ లగార్డే వెల్లడించారు. ఆమె ప్రపంచంలోని అత్యుత్తమ ఆర్థికవేత్తల్లో ఒకరని ప్రశంసించారు. గీతా గోపీనాథ్ ఐఎంఎఫ్‌కు 11వ చీఫ్ ఎకనమిస్ట్. తనకు ఈ పదవి దక్కడం చాలా అరుదైన గౌరవంగా భావిస్తున్నానని గీత ఆనందం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రపంచీకరణ నుంచి వెనక్కి తగ్గడం, సుంకాలు పెంపు పెద్ద సవాళ్లుగా మారాయని, బహుళజాతి సంస్థలకు ఇబ్బందులు పెరిగాయని గీత వెల్లడించారు.

భారత మార్కెట్లో ఒన్ ప్లస్ ఫోన్ హవా

- ఆరు నెలలల్లో 150 కోట్లకు చేరుకున్న అమ్మకాలు
- పడిపోయిన సామ్‌సంగ్. యాపిల్ ఫోన్‌ల అమ్మకాలు



ఢిల్లీ: ప్రముఖ చైనా ప్రాడెక్ట్ అయిన ఒన్ ప్లస్ ఫోన్ భారత్‌లో సంచలనాలు నమోదు చేస్తోంది. ఏకంగా ఒన్‌ప్లస్ అమ్మకాలు యాపిల్ ఫోన్, సామసంగ్‌లను కూడా వెనక్కి నెట్టి 2018 ఎండింగ్‌లో ఏకంగా 150 కోట్లను కొల్లగొట్టింది. యాపిల్‌కు ధీటుగా ఉన్న ఫీచర్స్ కావడంతో ఒన్ ప్లస్‌కు గిరాకీ పెరిగి పోయింది. ఒన్ ప్లస్ స్మార్ట్ ఫోన్ కంటే అనేక ఫోన్‌లు మార్కెట్‌లోకి విడుదల అయినా భారత్‌లో మాత్రం అధరణను అందుకోలేక పోయాయి. 2016–17 మధ్యన కేవలం రూ.37.9 కోట్లను మాత్రమే అమ్మకాలు జరిపింది. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే సామ్‌సంగ్, యాపిల్ అమ్మకాలను దాటేసింది. 2018 ఆర్థిక సంవత్సరం రెండో భాగంలో భారత్‌లో యాపిల్ ఫోన్ రూ.13.097 కోట్ల అమ్మకాలు జరిగాయి. ఇక షావోమి రూ.22.947 కోట్లు, ఒప్పో రూ.11,994 కోట్లు , వివో రూ.11.179 కోట్లు అమ్మకాలు సాగాయి. ప్రముఖ ఆన్‌లైన్ రిటైల్ సంస్థ అయిన అమెజాన్‌లో ఒన్ ప్లస్ అమ్మకాలు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. ఒన్ ప్లస్6, ఒన్‌ప్లస్ 6టి. స్మార్ట్‌ఫోన్‌లో దూసుకుపోతున్నాయి. భారత్‌లో మొట్టమొదటి సా రిగా రూ.30.000పైన ధర కలిగిన స్మార్ట్‌ఫోన్‌ల జాబితాలో అత్యదిక అమ్మకాలు జరిగిన స్మార్ట్‌ఫోన్‌గా ఒన్ ప్లస్ రికార్డ్ సాధించింది. ఒన్ ప్లస్ నుంచి మరొక సంచలన ఫోన్ రాబోతుంది భారత్ మార్కెట్‌లోకి అదే ఒన్‌ప్లస్ 7 ఈ ఫోన్ ఎప్పుడొస్తుందా అయి ఎదురు చూస్తున్నారు. వినియోగదారులు.

స్పోర్ట్స

వన్డేలలో బుమ్రాకు రెస్ట్

- జట్టులోకి వచ్చిన మహ్మద్ సిరాజ్






సిడ్నీ: టెస్టు సిరీస్‌లో సరికొత్త చరిత్ర లిఖించిన కోహ్లీ సేన ఇక ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లకు సిద్ధమవుతోంది. ఈ సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు తదుపరి మ్యాచ్‌లలో బీసీసీఐ విశ్రాంతి కల్పించింది. ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే మ్యాచ్‌లు, న్యూజిలాండ్ పర్యటనలో బుమ్రా ఆడట్లేదని ప్రకటించింది. అతడి స్థానంలో హైదరాబాద్ కుర్రాడు మహ్మద్ సిరాజ్‌కు అవకాశం కల్పించింది.తర్వాతి సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడమే మంచిదని భావించాం. ఆస్ట్రేలియాతో వన్డే మ్యాచ్‌లు, న్యూజిలాండ్ పర్యటనలో బుమ్రా స్థానంలో మహ్మద్ సిరాజ్ ఆడుతాడు' అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. తాజా టెస్టుల్లో బుమ్రా అద్భుత ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే.

కేవలం 12 నెలల క్రితమే టెస్టుల్లో అరంగేట్రం చేసిన బుమ్రా.. ప్రస్తుతం కీలక పేసర్‌గా మారిపోయాడు. ఆసీస్‌తో జరిగిన నాలుగు టెస్టుల సిరీస్‌లో 21 వికెట్లు తీయడం విశేషం.జనవరి 12 నుంచి భారత్–ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ అనంతరం ఐదు వన్డేలు, మూడు టీ–20లు ఆడేందుకు టీమిండియా న్యూజిలాండ్ బయల్దేరుతుంది. జనవరి 23 నుంచి న్యూజిల్యాండ్ సిరీస్ ప్రారంభం కానుంది.

పుజారా.. అభినవ బుద్ధుడు

- ఎమ్మెస్కే ప్రసాద్



ముంబై: ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగు టెస్ట సిరీస్ని భారత్ 21 తేడాతో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సిరీస్ విజయంలో చతేశ్వర్ పుజారా కీలక పాత్ర పోషించాడు. ఈ సిరీస్‌లో మూడు సెంచరీలతో 521 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా పుజారాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా టీం ఇండియా చీఫ్ సెల్కక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ పుజారాను గౌతమ బుద్ధుడితో పోల్చారు. పుజారాను ఆయన అభినవ బుద్ధుడని అన్నారు."పుజారా అభినవ బుద్ధుడు. అతని ప్రదర్శన చూస్తుంటే అలానే అనిపిస్తుంది. ఒక్కసారి క్రీజ్లో అడుగుపెట్టగానే అని ధాన్యంలోకి వెళ్లపోతాడు. గంటలపాటు డొమెస్టిక్ క్రికెట్లో ఆడినందుకు ఇప్పుడు ఫలితం వచ్చింది" అని ఎమ్మెస్కే ప్రసాద్ పేర్కొన్నారు.

టీం ఇండియాకు బీసీసీఐ నజరానా



ముంబయి: ఆస్ట్రేలియాలో చరిత్ర సృష్టించిన కోహ్లసేనకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి నగదు బహుమతి ఇవ్వనుంది. దాదాపు 71 ఏళ్లకు టీమిండియా ఆస్ట్రేలియాను వారి సొంతగడ్డపైనే ఓడించి 21 తేడాతో టెస్టు సిరీస్ కైవసం చేసుకుంది. దిగ్గజ క్రికెటర్లకు సాధ్యం కాని లక్ష్యాన్ని సాధించింది. ఈ ఘనతకు నజరానా ఇవ్వాలని బీసీసీఐ పాలకుల కమిటీ నిర్ణయించింది.

మ్యాచ్ ఫీజుకు సమానంగా బోనస్ ఇవ్వనుంది. అంటే ఒక్కో మ్యాచ్‌కు ఫీజు రూ.15 లక్షల వరకు ఉంటుంది. నాలుగు మ్యాచ్‌లు ఆడిన వారికి రూ.60 లక్షల వరకు బహుమానం దక్కనుంది. రిజర్వు ఆటగాళ్లకు మ్యాచ్‌కు రూ.7.5 లక్షలు ఇస్తారు. కోచ్‌లకు తలో రూ.25 లక్షలు ఇవ్వనున్నారు. సహాయక సిబ్బందికి ప్రొ రేటా వేతనం లేదా ప్రొఫెషనల్ ఫీజుకు సమానంగా బోనస్ ఇస్తారు. సుప్రీం కోర్టు నియమించిన పాలకుల కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. కంగారూలను వారి సొంతగడ్డపై ఓడించిన కోహ్లీసేనను అందరూ ప్రశంసించిన సంగతి తెలిసిందే. ఆ గడ్డపై ఇంతకు ముందెన్నడూ భారత్ టెస్టు సిరీస్ గెలవలేదు. చాలా మంది దిగ్గజాలు అక్కడ సిరీస్ గెలవాలని కలలు కన్నారు. గంగూలీ సారథ్యంలో ఒక సిరీస్ డ్రా అయింది.

ధోనీ రికార్డును దాటిన రిషబ్‌పంత్

- ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ 3వ స్థానంలో పుజారా
- 17వ స్థానంలో పంత్
- బౌలింగ్‌లో ఐదో స్థానంలో జడేజా



దుబాయి: ఐసీసీ మంగళవారం ప్రకటించిన టెస్టు బ్యాట్స్‌మెన్స్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాట్స్‌మెన్ పుజారా మూడో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో అతడు 521 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. అలాగే, ఆ సిరీస్‌లో 350 పరుగులు చేసిన టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఒక్కసారిగా 21 స్థానాలు ఎగబాకి 17వ స్థానంలో నిలిచాడు. ధోనీ టెస్టు కెరీర్‌లో 19వ ర్యాంకే అత్యుత్తమ ర్యాంక్‌గా ఉంది. అతని రికార్డును పంత్ అధిగమించాడు. 1973లో టీమిండియా వికెట్ కీపర్ ఫరూఖ్ ఇంజినీర్ టెస్టు బ్యాట్స్‌మెన్స్ ర్యాంకింగ్స్‌లో 17వ స్థానంలో నిలిచాడు. ఇప్పుడు ఆయన సరసన పంత్ నిలిచాడు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లే ముందు పంత్ 59వ స్థానంలో ఉన్నాడు. కాగా, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి మళ్లీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా సిరీస్‌లో రాణించిన రవీంద్ర జడేజా, మయాంక్ అగర్వాల్ కూడా బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. ఆరు స్థానాలు ఎగబాకిన భారత ఆల్‌రౌండర్ జడేజా 57వ స్థానంలో నిలవగా, మయాంక్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకుని 62వ స్థానంలో నిలిచాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో పలువురు టీమిండియా బౌలర్లు తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. కుల్‌దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 45వ స్థానంలో నిలవగా, జస్‌ప్రీత్ బుమ్రా 16, షమీ 22వ స్థానాల్లో నిలిచారు. జడేజా ఒక స్థానం మెరుగుపర్చుకుని ఐదో స్థానంలో నిలిచాడు. ఐసీసీ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో టాప్–5లో వరుసగా విరాట్ కోహ్లి (భారత్), విలియమ్సన్ (న్యూజిలాండ్), పుజారా (భారత్), స్టీవ్ స్మిత్ (ఆస్ట్రేలియా), రూట్స్ (ఇంగ్లండ్) ఉన్నారు. బౌలింగ్ టాప్–5లో వరుసగా రబాడా (దక్షిణాఫ్రికా), అండర్సన్ (ఇంగ్లండ్), ఫిలండర్ (దక్షిణాఫ్రికా), కమ్మిన్స్ (ఆస్ట్రేలియా), జడేజా (భారత్) ఉన్నారు.



ఐపీఎల్ మన దగ్గరే



ఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2019 ఎడిషన్ భారత్‌లోనే జరగనుంది. సుప్రీం కోర్టు నియమిత క్రికెట్ పాలకుల కమిటీ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఎప్పటిలా ఏప్రిల్ మొదటి వారంలో కాకుండా మార్చి 23న ఐపీఎల్ ప్రారంభమవుతుందని కమిటీ వెల్లడించింది. త్వరలోనే వేదికలను ప్రకటిస్తారు. లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో భద్రత కల్పించడం కష్టమవుతుందని పొట్టి క్రికెట్ లీగ్‌ను విదేశాలకు తరలిస్తారని ఊహాగానాలు వచ్చిన సంగతి తెలిసిందే. 'ఇప్పటికైతే ప్రాథమిక వేదికలు అందరికీ తెలిసినవే. మ్యాచ్‌లు తరలించాల్సిన అవసరం వస్తే బ్యాకప్ వేదికలు సిద్ధంగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థలను సంప్రదించాకే నిర్ణయం తీసుకున్నాం. ఎన్నికల ప్రక్రియ తేదీలు ప్రకటించిన తర్వాత సభలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బ్యాకప్ వేదికలు ఎంచుకున్నాం' అని వినోద్ రాయ్, డయానా ఎడుల్జీ నేతృత్వంలోని పాలకుల కమిటీ వెల్లడించింది. ఇంతకు ముందు 2010లో ఐపీఎల్‌ను మార్చిలో ఆరంభించారు.

సాధారణంగా అయితే ఏప్రిల్‌లో మొదలై మే చివరి వారంలో ముగుస్తుంది. ఈ సారి మే 30న ఇంగ్లాండ్‌లో వన్డే ప్రపంచకప్ సైతం ఆరంభం అవుతోంది. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం రెండు టోర్నీల మధ్య ఆటగాళ్లకు కనీసం 15 రోజుల విశ్రాంతి ఇవ్వాలి. అందుకే ముందుగా ఐపీఎల్‌ను ఆరంభిస్తున్నారు. రాష్ట్ర సంఘాలు, అధికారులతో సుదీర్ఘ చర్చల తర్వాత ఐపీఎల్ 2019 షెడ్యూలు విడుదల చేస్తామని బీసీసీఐ తెలిపింది. ఎన్నికల కారణంగా 2009లో దక్షిణాఫ్రికాలో ఐపీఎల్ నిర్వహించారు. 2014లో కొన్ని మ్యాచ్‌లను దుబాయ్‌కు తరలించారు.

ట్రాక్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ షురూ

విజయక్రాంతి, హైదరాబాద్: ఆలిండియా 56 రైల్వే ఛాంపియన్‌షిప్ ట్రాక్ సైక్లింగ్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని సైక్లింగ్ వెలోడ్రోమ్‌లో జరిగాయి. ఈ పోటీలను సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్. మధుసూదన రావు ప్రారంభించారు. ఈ ట్రాక్ సైక్లింగ్ పోటీలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. తొలిరోజు ఈవెంట్‌లో సౌత్ వెస్ట్రన్ రైల్వేకు చెందిన రాజు బాటి గోల్డ్ మెడల్‌ను సాధించారు. ఈ టోర్నమెంట్‌లో వివిధ జోనల్ రైల్వేస్ నుంచి 9 టీంలు పాల్గొంటున్నాయి. సైక్లింగ్ ఛాంపియన్ షిప్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోషియేషన్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మధుసూదన్ మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వే ఈ పోటీలను నిర్వహిస్తుందుకు ఆయన అభినందించారు. సైక్లింగ్ పోటీలు శరీరానికి, మనసుకు ఉల్లాసాన్ని ఇస్తాయని ఆయన వివరించారు. ఈవెంట్‌లో ఫైనాన్షియల్ అడ్వైజర్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఇ.వీ. కృష్ణారెడ్డి, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ కే. సెంథిల్‌లు పాల్గొన్నారు.



Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal - Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD-500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.